మాగజిన్ గత వారంరోజులపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-10-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 252 పేజీలు: 10+4 వెల: 8.00


భారీ భూకంపంతో వణికిన పనామా

నాకు 'శాంతి' ఇవ్వకుండా కమిటీ తప్పుచేసింది: ట్రంప్

5



విమానంలో దీప్కేను అదుపులోకి తీసుకొన్న పోలీసులు




వినూత్నంగా మమత నిరసన



నిరసనకారులను తరలిస్తున్న పోలీసులు

# అట్టుడికిన ఢిల్లీ

## ఎక్కడికక్కడ నేతల నిర్బంధం

**అభిజిత్ దీప్కే మరో ఇద్దరు విమానంలోనే అరెస్టు**

7 వేల మంది పైగా నిరసనకారులు అదుపులోకి

**మమత, కేజ్రీవాల్ సహా నలుగురు మాజీ సిఎంలను అదుపులోకి తీసుకొన్న పోలీసులు**

ఆందోళన ఆగదన్న సిజెపి చీఫ్

**న్యూఢిల్లీ:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద భారీ నిరసనకు పిలుపునివ్వగా, శనివారం ఢిల్లీ మొత్తం భద్రతావలయంలో మునిగిపోయింది. అనూహ్యమైన భద్రతా ఆంక్షలు, 7వేల మందికి పైగా నిరసనకారుల నిర్బంధంతో ఆందోళనను కట్టడిచేసేందుకు ఢిల్లీపోలీస్ యంత్రాంగం ఉక్కుపాదంమోపినా నిరసనకారులు నిర్బంధంలోనే ఆందోళనను కొనసాగించారు. ఉదయంనుంచే నాయకులను నిర్బంధంలోకి తీసుకున్నారు. ఢిల్లీమాజీ సీఎం కేజ్రీవాల్ ఇతర ఆప్‌నేతలు ఎంపి సంజయ్‌సింగ్ ఇతర నాయకులను బలవంతంగా వ్యాన్‌లలోకి ఎక్కించారు. అలాగే ధర్నాలో పాల్గొనేందుకు వస్తున్నబెంగాల్ మాజీ సీఎంమమతా బెనర్జీఇతర పార్టీనేతలు ఎంపిలను కూడా పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. >>2

# వచ్చే 8 నెలలు కీలకం

**ఎల్‌నినో సంక్షోభంపై అవగాహన కల్పించండి**

ప్రజలను అప్రమత్తం చేయండి

పంటలు కాపాడే చర్యలు తీసుకోండి

తక్షణ చర్యలకు ప్రణాళికలివ్వండి

**త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం: సిఎం రేవంత్**



ఎల్‌నినోపై అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు10:** ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో శనివారం సాయంత్రం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో తీవ్రమైన సంక్షోభంఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగు నీరు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్‌లో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ఎనిమిది నెలలు ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకుపకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొనుగోలు చేసేందుకు >>2

## ప్రయాణికులపై ఆర్టీసీ బాదుడు

**50% అదనపు ఛార్జీలతో దోపిడీ**

**కిటకిటలాడుతున్న బస్టాండ్లు**

బతుకమ్మ, దసరా పండుగల హడావుడి 2

**7 వేల ప్రత్యేక బస్సుల ఏర్పాటు**



రైతు యేసుతో హేళనగా మాట్లాడుతున్న గజ్వేల్ తహసీల్దార్ స్వామి

# ఇంకా బతికే ఉన్నావా?

## పురుగుల మందు తాగినా చావలేదా?

రైతు పట్ల తహసీల్దార్ స్వామి వెకిలి వ్యాఖ్యలు

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఉదంతం

**గజ్వేల్, అక్టోబర్ 10, ప్రభాతవార్త:** దేశానికి అన్నం పెట్టే అన్నదాత పట్ల కనీస గౌరవం చూపాల్సిన అధికారులే అవమానకరంగా మాట్లాడితే రైతు తన గోడు ఎవరికి చెప్పుకోవాలి? రైతు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న తహసీల్దార్ తీరు సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తహసీల్దార్ కార్యాలయంలో రైతు ఏసు స్వామి పట్ల >>2



రేడియల్ రోడ్ టెండర్లలో

# కుంభకోణం

నచ్చినవారికే కాంట్రాక్టులు 2

**తక్కువ ధరకు బిడ్లు వేసిన వారిని పక్కన పెట్టారు**

**టెండర్లను రద్దు చేసి విచారణ జరపాలి**

**సిఎం రేవంత్‌రెడ్డికి కెటిఆర్ బహిరంగ లేఖ**






ఉత్తరాఖండ్ చమోలిలో ఎత్తైన ప్రదేశంలో ఉన్న హేమకుండ్ సాహిబ్ సిక్కు పుణ్యక్షేత్రం సమీపంలో శనివారం స్నోకట్టర్ యంత్రంతో మంచును తొలగిస్తున్న ఓ కార్మికుడు

# బతికే ఉన్నావా?

>> తహసీల్దార్ స్వామి వ్యవహరించిన తీరు పట్ల సోషల్ మీడియాలో తీవ్ర దుమారానికి దారితీసింది. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన నిరుపేద రైతు ఏసు స్వామికి చెందిన భూమి ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూసేకరణలో పోవడంతో తనకు రావాల్సిన పరిహారం కోసం పలుమార్లు తహసీల్దార్ కార్యాలయంకు తిరిగాడు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో విసుగుచెంది తన గ్రామానికి చెందిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లను వెంటపెట్టుకొని వెళ్లి తహసీల్దార్ స్వామిని కలిశారు. తహసీల్దార్ స్వామి రైతును ఉద్దేశించి మాట్లాడుతూ నీవు పురుగుల మందు తాగుతా అన్నావు కదా.. ఇంకా తాగలేదా..? చావలేదు కదా? అంటూ సాక్షాత్తు తహసీల్దార్ కార్యాలయంలోనే వెకిలి నవ్వులతో మాట్లాడినట్లు సోషల్ మీడియాలో శనివారం ప్రచారం జరిగింది. రైతు తన భూమి సమస్యతో నెలలతరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతుంటే అతనికి భరోసా కల్పించాల్సిందిపోయి రైతును చావమనడం చర్చనీయాంశంగా మారింది. రైతు మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు రావడం ఆందోళనకరం. ఇప్పటికే భూమి కోల్పోయిన బాధలో ఉన్న రైతును మరింత కుంగదీసేలా అధికారి ప్రవర్తించారని సోషల్ మీడియా వేదికగా విమర్శలు వస్తున్నాయి. అన్నదాత కన్నీటికి విలువ లేకుండా పోయిందని, రైతుల సమస్యలను పరిష్కరించేది పోయి రైతులను ఆత్మహత్యలు చేసుకునేవిధంగా పురిగొలుపుతున్న అధికారులపై చర్యలుతీసుకోవాలని, ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించాల్సిన అవసరం ఉందని సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతుంది. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులే వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం లేకుండా చేస్తున్నారని సోషల్ మీడియాలో ఇంత ప్రచారం జరుగుతున్నా ఉన్నతస్థాయి అధికారులు స్పందించక పోవడం విచిత్రంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. తహసీల్దార్‌గా స్వామి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి సమస్యల కోసం వచ్చిన ప్రతి ఒక్కరిపై ఇలాంటి విమర్శలు చేస్తున్నాడని పలువురు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో పాటు ఎవరు వచ్చినా సరైన రీతిలోసమాచారం ఇవ్వకుండా తనదైనశైలిలో ప్రవరిస్తున్నాడని, పట్టణానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి మరణ ధృవీకరణ పత్రం కోసం వెళ్తే పొంతనలేని సమాధానం ఇచ్చాడని, ఆ ప్రజాప్రతినిధికి ఆర్ఐ పంచనామా చేసిన పత్రాలు సరిగా లేవని పలుమార్లు తిప్పించుకున్నట్లు మీడియా ముందువాపోయారు. తహసీల్దార్ స్వామిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**తహసీల్దార్‌పై అసత్య ప్రచారం.. రెవెన్యూ అధికారి సంతోష్**

సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంపై స్థానిక రెవెన్యూ అధికారి సంతోష్ ఫోన్‌లో విలేకరులకు వివరణ ఇచ్చారు. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఏసు స్వామి ఐదు నెలల క్రితం తహ సీల్దార్ కార్యాలయానికి వచ్చాడని, అతని భూమి ట్రిపుల్ ఆర్ భూసేకరణ కిందికి తీసుకోవడం జరిగిందన్నారు. కానీ అతని పేరుమీద ఎలాంటి రికార్డు లేదని చెప్పినప్పటికీ, తనకు పరిహారం ఇవ్వాలని పలుమార్లు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నష్టపరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని తహసీల్దార్ ముందు చెప్పినట్లు రెవెన్యూ అధికారి సంతోష్ తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించారు.

# ప్రయాణికులపై ఆర్టీసీ బాదుడు

## 50% అదనపు ఛార్జీలతో దోపిడీ

## కిటకిటలాడుతున్న బస్టాండ్లు

## ఏడు వేల ప్రత్యేక బస్సుల ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** బతుకమ్మ, దసరా పండగ వేళ నగర ప్రజలు పల్లెబాట పట్టారు. పండుగ సందర్భంగా శనివారం నుండి స్కూళ్లకు సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్ నుండి సొంతూళ్లకు వెళుతున్నారు. ఈ పండుగ రద్దీని ఆర్టీసీ క్యాష్ చేసుకుంటోంది. ప్రత్యేక సర్వీసుల పేరుతో సాధారణ చార్జీలపై అదనపు భారం వేసి ప్రయాణీకులను దోపిడీ చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోపక్క నగరంలోని ఈ నేపథ్యంలో ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. అలాగే సికింద్రాబాద్, కాచీగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లలో భారీగా ప్రయాణికుల రద్దీ నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రూట్లలో వాహనాల రద్దీ పెరిగిపోయి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయగా, రైల్వేశాఖ సైతం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 18వ తేదీ వరకు మొత్తం 7 వేల ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి. ఇప్పటికే ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రత్యేక సర్వీసుల పేరుతో అదనపు ఛార్జీలతో నిలువు దోపిడీ చేస్తున్న ఆర్టీసీ 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేస్తుండగా ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుండి కరీంనగర్‌కు ఎక్స్ ప్రెస్ చార్జీ రూ.280 ఉంటే ప్రత్యేక బస్సుల్లో ఇది రూ.420 వరకు పెరిగింది. అలాగే డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లోనూ చార్జీలు పెంచింది. కాగా సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఇక ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలతో పాటు, ఆంధ్రప్రదేశ్ ప్రాంత వాసులు సొంతూళ్లకు బయలు దేరడంతో విజయవాడ వైపువాహనాలు బారులు తీరాయి. మరోవైపు నేటి నుండి ఈనెల 25 వరకు 34 ప్యాసింజర్ రైళ్లను అదనంగా నడుపుతున్నట్టు రైల్వేశాఖ ప్రకటించింది. ఇందులో 30% అదనపు చార్జీలను వసూలు చేయనున్నారు. సికింద్రాబాద్ నుండి విశాఖకు రెగ్యులర్ చార్జీ రూ. 420 ఉంటే ప్రత్యేకరైళ్లలో రూ.530నుండి రూ.550 కానుంది.

# 8 నెలలు కీలకం

>> ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, కానీ.. మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదన్నారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో ప్రభావంపై సినిమా, మీడియా, కళాజాతలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనావేసి పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్‌లో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని గుర్తు చేశారు. జుతీబి ళితిలీ బి పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సీఎం సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తరువాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా , రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్పటికపుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు సిఎంఓ ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎంపీ వేంనరేందర్ రెడ్డి, సిఎస్ సంజయ్ జాజు, డీజీపీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**11-10-2026, ఆదివారం,**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,**
**శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,**
తి.పాడ్యమి రా.9.34,
న. చిత్త రా.10.35,
వ.ఉ.6.02 - ఉ.7.41,2)తె.4.30-ఉ.6.11,
దు.సా.4.10 - సా.4.57,
రాహు.సా.4.30- సా.6.00,
శుభ. స. లేదు.

## వార్తాఫలం

**మేషం :** బాకీలను కొంత వరకు తీరుస్తారు. కీడెంచి మేలెంచమన్న విధంగా ఆలోచనలు సాగిస్తారు.రాజకీయ సమీకరణలు చేస్తారు.

**వృషభం :** అనుకున్న చోట అనుకున్న విద్యను అభ్యసించడానికి అవకాశాలు కలిసి వస్తాయి. ఋణాలు తీసుకుంటారు

**మిథునం :** సమయోచితంగా నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. భాగస్వామ్య వ్యాపారస్తులకు ప్రతి కూలం.

**కర్కాటకం :** సుదూరప్రాంత ప్రయాణాలలో సాంకేతిక లోపాలు చోటు చేసుకుంటాయి. క్రీడల పట్ల ఆసక్తిని కలిగి ఉంటారు.

**సింహం :** గోప్యంగా వ్యవహరిస్తారు. రహస్య ఋణం చేస్తారు. కీలక వ్యవహారాలలో సొంత నిర్ణయాలకు ప్రాముఖ్యతనిస్తారు.

**కన్య :** రోజూవారీ వాయిదాలు చెల్లించడం కష్టతరమౌతుంది. నిష్ణాతుల నుండి సలహాలను తీసుకుంటారు.

**తుల :**సంస్థాపరమైనటువంటి చర్చలను సాగిస్తారు. లీజులు, లైసెన్సులు పొడిగింప చేసుకోవడానికి ప్రయత్నాలను చేస్తారు.

**వృశ్చికం :** మాట మీద నిలబడే వ్యక్తిగా పేరును సంపాదిస్తారు. ఆర్థిక విషయాలు ప్రధాన ప్రస్తావనాంశాలవుతాయి.

**ధనుస్సు :**దూరప్రాంతాలలోని మీ వారి క్షేమ సమాచారం తెలియ వస్తుంది. డాక్యుమెంట్లో అవసరమైన మార్పులను చేస్తారు.

**మకరం :** చిన్న పెట్టుబడులతో అధిక లాభాలు వచ్చే వ్యాపారాలను ప్రారంభించడానికి నిర్ణయించుకుంటారు.

**కుంభం :** దేవాలయ సందర్శనం చేసుకుంటారు. ఆదాయ, వ్యయాలు సరి సమానంగా ఉంటాయి.

**మీనం :** సాహిత్యకళారంగాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. ఇతరుల ప్రమేయం లేకుండానే కార్యక్రమాలలో విజయం సాధిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రేడియల్ రోడ్ టెండర్లలో కుంభకోణం

## నచ్చినవారికే కాంట్రాక్టులు

## తక్కువ ధరకు బిడ్లు వేసిన వారిని పక్కన పెట్టారు

## టెండర్లను రద్దు చేసి విచారణ జరపాలి

## సిఎం రేవంత్‌కి కెటిఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్,అక్టోబరు10,ప్రభాతవార్త:** రూ.3,296 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రేడియల్ రోడ్2 టెండర్ల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బుద్వేల్ నుంచి కొడంగల్ సమీపంలోని జాతీయ రహదారి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి చేపట్టిన టెండర్లలో తీవ్ర అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. పనులను ప్యాకేజీలుగా విభజించి, ముందుగా నిర్ణయించుకున్న సంస్థలకే కట్టబెట్టారనే అనుమానాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. తక్కువ ధరకు బిడ్లు వేసిన సంస్థలను పక్కనపెట్టి, ఎక్కువ ధరలకు కోట్ చేసిన సంస్థలకు పనులు కేటాయించడంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.

బుద్వేల్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ నుంచి కొడంగల్ సమీపంలోని ఎన్‌హెచ్167ఎన్ వరకు 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి మూడు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారని కేటీఆర్ పేర్కొన్నారు. 2026 సెప్టెంబర్ 30తో బిడ్ల దాఖలు గడువు ముగియగా, అక్టోబర్ 8 నాటికే సాంకేతిక మూల్యాంకనం, బిడ్డర్ల అర్హతల పరిశీలన, ఆర్థిక బిడ్ల పరిశీలన, కేటాయింపుల ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత పత్రాల్లో పేర్కొన్నారని తెలిపారు. సెలవులను మినహాయిస్తే కేవలం ఐదు పని దినాల్లోనే రూ.3,296 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించిన 13 బిడ్ల పరిశీలన, అర్హతల నిర్ధారణ, కేటాయింపుల ప్రక్రియ ఎలా పూర్తిచేశారని ప్రశ్నించారు. ప్రతి సంస్థ సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారా? నిర్ణయాలకు అవసరమైన ఆధారాలను నమోదు చేశారా? అన్నది ప్రభుత్వం వెల్లడించాలని కోరారు.

ప్యాకేజీ1ను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు రూ.1,286.03 కోట్లకు కేటాయించినట్లు, ఇది అంచనా వ్యయం కంటే 3.95 శాతం అధికమని సంబంధిత పత్రాల్లో పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు. ప్యాకేజీ2 బీవీఎస్ఆర్‌కు, ప్యాకేజీ3 జీకేసీకి దక్కినట్లు పేర్కొన్నారని తెలిపారు. అయితే మిగిలిన ప్యాకేజీలకు సంబంధించిన పూర్తి ఆర్థిక వివరాలు ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. ప్రతి ప్యాకేజీకి ఎన్ని సంస్థలు బిడ్లు వేశాయి? ఎన్ని అర్హత సాధించాయి? ఏ సంస్థ ఎంత ధర కోట్ చేసింది? అంచనా వ్యయంతో పోలిస్తే తుది కేటాయింపు ఎంత ఎక్కువగా ఉంది? అనే వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

మూడు ప్యాకేజీల్లో బిడ్డర్ల అర్హతల నిర్ధారణకు ఒకే విధమైన ప్రమాణాలు అనుసరించారా? అన్నది కీలకమైన ప్రశ్నగా కేటీఆర్ పేర్కొన్నారు. సంబంధిత పత్రాల ప్రకారం, ప్యాకేజీ1లో జీకేసీని అనర్హంగా ప్రకటించినప్పటికీ, ప్యాకేజీ3లో అర్హత కల్పించారని తెలిపారు. అలాగే బీవీఎస్ఆర్‌కు ప్యాకేజీ1, ప్యాకేజీ2ల్లో అర్హత కల్పించి, ప్యాకేజీ3లో తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఒకే సంస్థకు వేర్వేరు ప్యాకేజీల్లో భిన్నమైన నిర్ణయాలు తీసుకోవడానికి కారణాలేమిటో ప్రభుత్వం వివరించాలని కోరారు. సాంకేతిక అర్హతలపై తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ3లో సుమారు రూ.1,034 కోట్ల విలువైన పనులకు కేవలం ఇద్దరు బిడ్డర్లు మాత్రమే అర్హత సాధించినట్లు సంబంధిత పత్రాల్లో పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు. అతి తక్కువ ధరకు బిడ్లు వేసినట్లు చెబుతున్న సుషీ ఇన్‌ఫ్రా అండ్ మైనింగ్ లిమిటెడ్‌ను మూడు ప్యాకేజీల్లోనూ అనర్హులుగా ప్రకటించిన అంశంపై ఆ సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు.

ఈ సంస్థను అనర్హంగా ప్రకటించడం వల్ల మూడు ప్యాకేజీల్లో కలిపి రాష్ట్రానికి సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లుతుందని ఆ సంస్థ తరపున కోర్టులో సమర్పించిన వాదనల్లో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. ధరల వ్యత్యాసాలు, అంచనా వ్యయాలు, ఆర్థిక బిడ్లు, తుది కేటాయింపులను పోల్చి ప్రజాధనానికి నష్టం జరిగిందా లేదా అన్నది తేల్చాలని డిమాండ్ చేశారు. హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ చేపడుతున్న భారీ టెండర్లలో తమను దూరంగా ఉంచుతున్నారని, బిడ్డర్లు తమకు అనుకూలంగా వ్యవహరించకపోతే సాంకేతిక కారణాలతో అనర్హత వేటు వేస్తున్నారని కొందరు తెలంగాణ కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారని కేటీఆర్ లేఖలో ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. సంస్థలను అనర్హులుగా ప్రకటించడానికి కారణాలు, పరిశీలించిన అర్హత పత్రాలు, అధికారుల నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

రేడియల్ రోడ్1 టెండర్లపైనా పారదర్శకతకు సంబంధించి ప్రశ్నలు తలెత్తుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ.591 కోట్లుగా పేర్కొంటూ, అంచనా వ్యయం కంటే సుమారు 15 శాతం అధిక ధరకు కేటాయింపు జరిగిందని సంబంధిత పత్రాల్లో ప్రస్తావించినట్లు తెలిపారు. రెండు రేడియల్ రోడ్లకు సంబంధించిన అంచనా వ్యయాలు, బిడ్ల ధరలు, సంస్థల అర్హతలు, తుది కేటాయింపుల వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని కోరారు.

ప్రజాధనంతో చేపట్టే భారీ ప్రాజెక్టుల్లో పారదర్శకత ప్రభుత్వ బాధ్యత అని కేటీఆర్ స్పష్టం చేశారు. రేడియల్ రోడ్2 టెండర్లలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు నిరాధారమైతే, ప్రభుత్వం సంబంధిత రికార్డులతో ప్రజలకు వివరణ ఇవ్వాలని అన్నారు. ఆర్థిక నష్టం జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో చేపట్టే ప్రతి పనికి పూర్తి లెక్కలు చెప్పాలని, టెండర్ల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించాలని పేర్కొన్నారు.



అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ సతీమణి జానకీ శుక్లా, ఫౌండేష్ అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి

# బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక

## రాష్ట్ర ప్రజలకు గవర్నర్ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

**హైదరాబాద్,అక్టోబరు10,ప్రభాతవార్త:** తెలంగాణకే ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి, సంప్రదాయాలకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో పూల పండుగ ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ప్రత్యేకించి మహిళలకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరించి, సామూహికంగా వేడుకలు జరుపుకోవడం తెలంగాణ ప్రజల ఐక్యతకు, ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు నిదర్శనమని పేర్కొన్నారు. గౌరమ్మ ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, తెలంగాణ సాంస్కృతిక వైభవం ప్రపంచవ్యాప్తంగా విరాజిల్లాలని గవర్నర్ ఆకాంక్షించారు.

# ఆడబిడ్డల ఆత్మీయ వేడుక.. బతుకమ్మ పండుగ: సిఎం రేవంత్

**హైదరాబాద్,అక్టోబరు10,ప్రభాతవార్త:** తెలంగాణ ఆడబిడ్డల అతిపెద్ద పండుగ, సింగిడి రంగుల పూల సంబరం బతుకమ్మ పండుగ ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ, ప్రకృతి అందాలను పూలలో కొలువుదీర్చే ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాలను, ప్రతి గుండెలో సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు.గౌరమ్మ తల్లి ఆశీస్సులతో ఆడబిడ్డలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# కాంగ్రెస్ నేతలు వెంటనే ఢిల్లీకి

## - ఎఐసిసి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఆదేశం

**హైదారబాద్, అక్టోబరు10,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి చెందిన లోక్‌సభ,రాజ్యసభ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లాకాంగ్రెస్ అధ్యక్షులు,టిపిసిసి అధ్యక్షులు ఉపాధ్యక్షులు,ప్రధానకార్యదర్శులు,సీనియర్ నాయకులు ఆదివారం రాత్రి వరకు ఢిల్లీకి చేరుకోవాలని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఆదేశించారు. టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ అత్యంత ప్రాధన్యత తీసుకొని తెలంగాణకు చెందిన నాయకులను అక్టోబర్ 12 తెల్లవారుజామువరకు ఢిల్లీలో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ నాయకులను వెంటనే ఢిల్లీకి ఆదివారం రాత్రిలోగా చేరుకొనే ప్రయత్నాలు చేయాలని ఒక పత్రికా ప్రకటనలో కోరారు.

# తెల్లాపూర్ భూసేకరణ నోటిఫికేషన్ రద్దు

**హైదరాబాద్,అక్టోబరు10,ప్రభాతవార్త:** భూసేకరణ ఉద్దేశాన్ని స్పష్టంగా వెల్లడించకుండా జారీచేసిన నోటిఫికేషన్ చెల్లదని హైకోర్టు తీర్పుఇచ్చింది. మెదక్ జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లో 92.39 ఎకరాల సేకరణ కోసం 2006లో జారీ చేసిన నోటిఫికేషన్‌తోపాటు, 2007లో జారీ చేసిన డిక్లరేషన్‌ను రద్దు చేసింది. టౌన్‌షిప్ ఏర్పాటు, భవిష్యత్తు ప్రాజెక్టుల అభివృద్ధి పేరుతో భూసేకరణ చేపట్టడం అస్పష్టంగా ఉందని, చట్టంలోని సెక్షన్ 5ఎ కింద విచారణ నామమాత్రంగా జరిగిందని న్యాయమూర్తి పేర్కొన్నారు. పిటిషనర్ల అభ్యంతరాలను సరైన కారణాలు చూపకుండా తిరస్కరించడం సరికాదన్నారు. ప్రభుత్వానికి అవసరమైతే చట్ట నిబంధనలను పాటిస్తూ తిరిగి భూసేకరణ చేపట్టవచ్చని స్పష్టం చేశారు.

# అట్టుడికిన ఢిల్లీ

>> నిరసనల ప్రాంతం జంతర్ మంతర్ రోజంతా నిర్మానుష్యంగా కనిపించింది. నిరసనకారులు అక్కడికి చేరకుండా ల్యూటెన్స్ ఢిల్లీలో 30వేల మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించడంతో పాటు వరుసగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ముంబై నుంచి వచ్చిన విమానం దేశ రాజధానిలో దిగిన వెంటనే కాక్రోచ్ జనతా పార్టీ నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను ఢిల్లీ పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నారు. తాను ఉదయం 9 గంటల నుంచే నిర్బంధంలో ఉన్నానని సీజేపీ న్యాయ విభాగ ఇన్చార్జి రత్నా సింగ్ ఆరోపించారు. ముందు రాత్రి నుంచే పోలీసులు తమ బృందం కదలికలను గమనిస్తున్నారన్నారు. అక్రమ నిర్బంధాలపై ఎఫ్ఐఆర్లు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. నిరసనకు ఏర్పాట్లు చేసుకున్నామని, మొత్తం ప్రభుత్వ యంత్రాంగమే తమకు వ్యతిరేకంగా మోహరించినప్పుడు నాయకులు ముందుకు సాగడం కష్టమని సింగ్ అన్నారు. అయినప్పటికీ ఉద్యమం కొనసాగుతుందని, ఈ పిలుపును ముందుకు తీసుకెళ్లేందుకు కొత్త నాయకులు వస్తారని స్పష్టం చేశారు. నిర్బంధం అనంతరం విడుదల చేసిన ముందుగా రికార్డు చేసిన వీడియో సందేశంలో, జంతర్ మంతర్ వద్ద నిరసనకు సీజేపీ ఇన్చార్జి అజింక్య షిండే నాయకత్వం వహిస్తారని దీప్కే తెలిపారు. నాయకులు ఉన్నా లేకపోయినా దేశవ్యాప్తంగా నిరసన కొనసాగుతుందని పార్టీ ప్రకటించింది. సీజేపీ నిరసనలో పాల్గొనేందుకు ప్రయత్నించిన ఇండియా కూటమి నేతలు పలువురిని రాజధానిలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. వారిలో మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్ ఉన్నారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, కార్యకర్త యోగేంద్ర యాదవ్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) అధ్యక్షురాలు నేహాను కూడా నిర్బంధించారు. ఓట్ల చోరీ ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నిరసనలు నిర్వహిస్తున్నప్పటికీ, సీజేపీ కార్యక్రమానికి మాత్రం దూరంగా ఉంది. ప్రతిపక్ష పార్టీలు ప్రస్తుత పరిస్థితిని ఎమర్జెన్సీ కంటే దారుణంగా అభివర్ణించాయి. యువత నిరసనలు కొనసాగించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. తన కుటుంబ సభ్యులతో కలిసి నిరసనలో పాల్గొంటానని గతంలో ప్రకటించిన కేజ్రీవాల్, నిరసనను అడ్డుకునేందుకు ఢిల్లీ మధ్య ప్రాంతంలో విధించిన ఆంక్షలు, సీజేపీ నేతల నిర్బంధం ఎమర్జెన్సీ కంటే దారుణమని ఆరోపించారు. ఢిల్లీచలో పిలుపునిస్తూ, ఓట్ల చోరీ అంశంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా కోరేందుకు దేశవ్యాప్తంగా యువత రాజధానికి రావాలని అన్నారు. కొద్దిసేపటికే ఢిల్లీ పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ పోలీసుల నిర్బంధాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యానికి తల్లిగా పేరొందిన దేశాన్ని గొంతు నొక్కిన ప్రజాస్వామ్యంగా మార్చారని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ కుమార్‌కు వ్యతిరేకంగా సీజేపీ నిరసనలో పాల్గొనేందుకు వచ్చిన యూట్యూబర్ ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లోని సెక్టార్ 56 నివాసం నుంచి శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జర్నలిస్టులు, యూట్యూబర్లు, ఇతర కంటెంట్ క్రియేటర్లపైనా చర్యలు జరిగాయి. కేకే క్రియేట్‌గా ప్రసిద్ధి చెందిన డిజిటల్ క్రియేటర్ కావ్య కర్నాటక్‌ను ధౌలా కువాన్ వద్ద నిర్బంధించారు. స్వతంత్ర జర్నలిస్టు హర్ష్ యాదవ్ తాను బస చేసిన హోటల్‌కు పోలీసులు వచ్చి గది నుంచి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారని ఇన్‌స్టాగామ్‌లో ఆరోపించారు. ఐసా అధ్యక్షురాలు నేహా బోరా కూడా నిర్బంధితుల్లో ఉన్నారు. వామపక్ష నేతలను, నేహాను అదుపులోకి తీసుకునే సమయంలో దక్షిణ ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ అనంత్ మిట్టల్ చేతికి గాయాలయ్యాయి.

**దేశవ్యాప్తంగా 10వేలు దాటిన నిర్బంధాలు...**

ఢిల్లీ అంతటా శనివారం 7వేల మందికి పైగా నిరసనకారులను నిర్బంధించినట్లు, వారిలో న్యూఢిల్లీ జంతర్‌మంతర్ ప్రాంతంలోనే 2వేలమందికి పైగా ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా నిర్బంధితుల సంఖ్య 10వేలు దాటినట్లు నివేదికలు పేర్కొన్నాయి. హనుమాన్ ఆలయం, ఆకాశవాణి భవన్, సఫ్దర్జంగ్ ఫ్లైఓవర్, కేరళ హౌస్ సహా పలు ప్రాంతాల్లో నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌కు చేరుకున్న కొందరినీ అక్కడి నుంచి తీసుకెళ్లారు. ముంబైలోని క్రాంతి మైదాన్ వద్ద కూడా నిరసనలకు ప్రయత్నించిన వారిని పోలీసులు నిర్బంధించారు. వారిలో నటుడు ఇమ్రాన్ ఖాన్ మేనల్లుడు ఉన్నారు. ఈనెల 2న ఛత్రపతి శివాజీ మహారాజ్ పార్క్ వద్ద జరిగిన గత నిరసనలో వేలాది మంది పాల్గొన్నారు. తమిళనాడులో శనివారం ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యతిరేకంగా జరిగిన నిరసనలపై చర్యలు ప్రధానంగా చెన్నైలో కేంద్రీకృతమయ్యాయి; పలు ప్రాంతాల్లో 100 మందికి పైగా నిరసనకారులను నిర్బంధించారు. సీజేపీ నిరసనకు ముందు ఢిల్లీలో 30వేల మందికి పైగా పోలీసులు, పారా మిలటరీ సిబ్బందిని మోహరించడంతో నగరం ఖాకీమయమైంది. వీధుల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, నగర సరిహద్దులు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినళ్లు, హోటళ్లు, ఇతర కీలక ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. దీంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భద్రతా ఏర్పాట్లలో ఢిల్లీ పోలీసులకు కేంద్ర సాయుధ పోలీసు బలగాల 120కి పైగా కంపెనీలు సహకరించాయి. ముందస్తు జాగ్రత్తగా ఢిల్లీలోని మద్యం దుకాణాలను మూసివేశారు. ప్రజా రవాణా, ప్రధాన రహదారులపైనా ఆంక్షలు విధించారు. 45 మెట్రో స్టేషన్లను మూసివేసి, ప్రధాన ప్రవేశ మార్గాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. కాగా ప్రతిపక్షాలపై విరుచుకుపడిన బీజేపీ, నగరాన్ని బందీ చేయాలనుకున్న నిరసన విఫలమైందని, అది ఫ్లాప్ షోగా మారిందనిపేర్కొంది. విదేశీశక్తులతో కలిసి రాహుల్ అరాచకాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తూ, చారిత్రక వ్యక్తి మీర్ జాఫర్తో పోల్చింది. జంతర్ మంతర్‌కు వెళ్లిన వందలాది మంది యువత, పలువురు రాజకీయ నాయకులను ఢిల్లీ పోలీసులు నిర్బంధించడంతో ఇది గుంపు పాలనపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమని బీజేపీ నేత సంబిత్ పాత్ర అన్నారు.

# జగన్‌కు ఇడి షాక్

## అక్రమాస్తుల కేసు రోజువారీ విచారణకు హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** వైసిపి అధినేత వై.ఎస్ జగన్ అక్రమాస్తుల కేసు రోజువారీ విచారణకు అనుమతించాలని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇడి అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న ఈ కేసు విచారణ త్వరితగతిన సాగేలా చూసేందుకు ఆదేశాలు ఇవ్వాలని అధికారులు తమ పిటిషన్‌లో కోరారు. జగన్ అక్రమాస్తుల కేసుకు సంబంధించి తాము దాఖలు చేసిన తొమ్మిది ఛార్జిషీట్లు పదేళ్లుగా సిబిఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో వునాన్నయని ఈడీ పేర్కొంది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని ఇడి తన పిటిషన్‌లో తెలిపింది. రోజు వారి విచారణలో జగన్‌సహా ఇతర నిందితులు వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని హైకోర్టును ఇడి కోరింది. ఇడి పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది.

# భర్త, సోదరుల వేధింపులపై మహిళా కమిషన్‌లో గజల్ వాగ్గేయకారిణి ఫిర్యాదు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** కట్టుకున్న భర్త, తోడపుట్టిన సోదరుల వేధింపులపై మహిళా గజల్ వాగ్గేయకారిణి హిమజారామం మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భర్త మేకల శ్రీధర్‌తో పాటు సోదరులు ఇందు సాగర్, రఘురాంలు ఏళ్ల తరబడి తనను వేధిస్తున్నా రని ఆమె తన ఫిర్యాదులో తెలిపారు. తన భర్త మద్యానికి బానిసగా మారడంతో పాటు క్రెడిట్ కార్డులు, పర్సనల్ లోన్లు, ప్రైవేటు ఫైనాన్స్ స హా పలుచోట్ల లక్షలాది రూపాయలు అప్పులు చేసి రోజుల తరబడి ఇంటి నుంచి కనిపించకుండా పోతాడని, ఈ సమయంలో అప్పులు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి తనను వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. దీంతో పాటు తన సోదరులు భర్తచేత తనపై దాడి చేయించారని ఆమె తెలిపా రు. ఉమ్మడి ఆస్తిలో తనకు వాటా దక్కకుండా సోదరులు తన భర్తను వాడుకుంటున్నారని ఆమె ఆరోపించారు. ఈ విషయంలో అత్తలు రమ్య విజయలక్ష్మి, మరిది భానుచందర్‌ల పాత్ర కూడా వుందని హిమజారామం తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే వీరిపై ఖమ్మం జిల్లాలో గృ హ హింసతో పాటు వేధింపుల కేసు వుందని ఆమె తెలిపారు. తన భర్త, సోదరులు, అత్తలు, మరిది వేధింపుల నుంచి తనకు రక్షణ కావాలని మహిళా కమిషన్‌ను ఆమె కోరారు.



# ఢిల్లీలో సిజెపి నిరసనకు వ్యతిరేకంగా మరో నిరసన

**న్యూఢిల్లీ,అక్టోబరు 10:** ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీకి వ్యతిరేకంగా, ఢిల్లీ పోలీసులకు మద్దతుగా మరో నిరసన మొదలైంది. కన్నాట్‌ప్లేస్ సమీపంలో పెద్ద సంఖ్యలో యువత పోస్టర్లు, బ్యానర్లు పట్టుకుని అక్కడికి చేరారు. సీజేపీకి వ్యతిరేకంగా, ప్రధాని నరేంద్రమోడీ, ఢిల్లీ పోలీసులకు మద్దతు తెలిపే పోస్టర్లను ప్రదర్శించారు. తమకు ఏ పార్టీతో సంబంధం లేదని, తామంతా దేశభక్తులమని నిరసన తెలిపేందుకు వచ్చామని చెబుతున్నారు. కొన్ని పోస్టర్లలో ఈవీఎం ఫోటోలు కూడా ఉన్నాయి. ప్రదర్శనలో పాల్గొన్న వారు సీజేపీ నిరసన ఒక కుట్ర అని, దీని వెనక అమెరికా ఉందని ఆరోపించారు. గత నిరసనల్లో వారు ఉగ్రవాదులకు మద్దతుగా నినాదాలు చేశారని, ఇప్పుడు వారికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు తాము వచ్చామని చెబుతున్నారు. ఢిల్లీలో శనివారం కాక్రోచ్ జనతా పార్టీ భారీ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ ఆంక్షలు విధించారు. సీజేపీ నేతలు అభిజిత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు విమానం నుంచే అరెస్ట్ చేశారు. ఇప్పటికే 2000లకు పైగా నిరసనకారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీజేపీకి మద్దతుగా నిలుస్తున్న యూట్యూబర్ ధ్రువ్ రాఠీని, సీజేపీ లీగల్ హెడ్ రత్నా సింగ్‌లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

# ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకిన తల్లి

## మహబూబాబాద్ జిల్లాలో దారుణం

## ముగ్గురి ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమంటున్న స్థానికులు

**మహబూబాబాద్ / కురవి, అక్టోబరు 10, ప్రభాతవార్త:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల శివారు లింగ్యాతండాలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, పిల్లలు ఆత్మహత్యకు పాల్పడ్డ విషాదకర సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కురవి మండలం బలపాల శివారు లింగ్యా తండాకు చెందిన బానోత్ అనూషకు అదే గ్రామానికి చెందిన బానోత్ నవీన్‌తో 11 సంవత్సరాల క్రితం వివాహం జరి గింది. వీరికి ముగ్గురు పిల్లలు వంశీకృష్ణ,రిత్విక,వర్షిణిలు ఉన్నారు. కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం తల్లి అనూష(35)తన ఇద్దరు పిల్లలు వంశీకృష్ణ(3),వర్షిణి(5)లతో కలిసి స్థానిక వ్యవసాయ బావి లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకొని మృతదేహాలను బావిలో నుండి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.కాగా పెద్ద కుమార్తె తల్లితో వెళ్లకపోవడంతో ఆమె ప్రాణాలతో మిగిలింది.ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒకేసారి మరణించడంతో గ్రామస్థులంతా శోకసముద్రంలో మునిగిపోయారు.

# సహకార బ్యాంకింగ్‌లో సంస్కరణలు

## రుణ పర్యవేక్షణా విధానం నవీకరణ

## రుణాల వడ్డీ రేట్లకు ఏకీకృత నియంత్రణ

## ఫ్రేమ్‌వర్క్ అమలుకు మార్గదర్శకాలు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** సహకార రంగంలో గత 18 సంవత్సరాలుగా వచ్చిన నిర్మాణాత్మక, నియంత్రణ మార్పులకు అనుగుణంగా గ్రామీణ సహకార బ్యాంకుల రుణ పర్యవేక్షణ విధానాన్ని నవీకరించేందుకు సంస్కరణలు అమలు చేయాలని రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సంస్కరణల ద్వారా కేవలం సహకార బ్యాంకులను వాణిజ్య బ్యాంకుల స్థాయికి తీసుకురావడమే కాకుండా, ప్రజల్లో ఈ బ్యాంకులపై ఉన్న నమ్మకాన్ని పునరుద్ధరించడం ప్రధాన లక్ష్యం. ఈ మార్పుల వల్ల సహకార రంగంలో డిపాజిట్లు భారీగా పెరుగుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తోంది. సహకార బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలను ప్రకటించింది. రుణ రేట్లలో పారదర్శకతను మెరుగుపరచడం, వినియోగదారుల రక్షణను పెంపొందించడం కోసం, అన్ని నియంత్రిత సంస్థలలో రుణాలపై వడ్డీ రేట్ల కోసం ఒక ఏకీకృత నియంత్రణ చట్రాన్ని కూడా ప్రతిపాదించింది. సహకార బ్యాంకింగ్ రంగం కోసం తీసుకుంటున్న చర్యలలో భాగంగా, లైసెన్సింగ్ ఫ్రేమ్‌వర్క్‌పై గతంలో విడుదల చేసిన చర్చా పత్రంపై అందిన అభిప్రాయాల ఆధారంగా, పట్టణ సహకార బ్యాంకుల (యూసీబీ) లైసెన్సింగ్‌ను పునః ప్రారంభించేందుకు ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేయనుంది. అంతే కాకుండా, 2008లో చివరిసారిగా సవరించబడిన గ్రామీణ సహకార బ్యాంకుల రుణ పర్యవేక్షణ ఏర్పాటుపై సమగ్ర సమీక్ష చేపట్టిన అనంతరం కేంద్ర బ్యాంకు ముసాయిదా ఆదేశాలను కూడా జారీ చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ అధికారవర్గాలు వెల్లడించాయి. గత 18 యేళ్లుగా ఈ రంగంలో వచ్చిన నిర్మాణాత్మక, నియంత్రణ మార్పులకు అనుగుణంగా గ్రామీణ సహకార బ్యాంకుల రుణ పర్యవేక్షణ విధానాన్ని నవీకరించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోనుంది. దీనికి అదనంగా, అన్ని నియంత్రిత సంస్థలలో రుణాలపై వడ్డీ రేట్లను నియంత్రించే నియంత్రణ విధానాన్ని సమన్వయం చేసి, ప్రామాణీ కరించాలని నిర్ణయించింది. యూసీబీ లైసెన్సింగ్‌పై చర్చలో వచ్చిన అభిప్రాయాల ఆధారంగా, పట్టణ సహకార బ్యాంకుల లైసెన్సింగ్‌ను పునఃప్రారంభించడానికి ఆర్‌బిఐ ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేయనుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డిసిసిబిలు), రాష్ట్ర సహకార బ్యాంకులు (ఎస్టిసిబిలు), పట్టణ సహకార బ్యాంకులు (యుసిబి) తో సహా సహకార బ్యాంకింగ్ సంస్థల వైవిధ్యం, ఆధునీకరణపై ఈ సదస్సు ప్రధాన దృష్టి సారించింది. వ్యాపార పోర్ట్‌ఫోలియోలను విస్తరించడం, పీఏసీఎస్ ల ద్వారా రుణాల లభ్యతను మెరుగుపరచడం సామర్థ్యం, అందుబాటును పెంపొందించడానికి డిజిటల్ వేదికలను ఉపయోగించుకోనుంది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల మధ్య సమతుల్యతను పాటించడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. సైబర్ భద్రత వ్యవస్థలను బలోపేతం చేయడం, సాంకేతిక ఆధారిత పరిష్కారాలను అవలం బించడం ద్వారా సహకార బ్యాంకులను మరింత పోటీతత్వంతో తీర్చిదిద్దాలని నిర్ణయించారు. రుణ రేట్లలో పారదర్శకతను మెరుగుపరచడం, రుణ విధానాలలో మరింత స్థిరత్వాన్ని నిర్ధారించడం, వినియోగదారుల రక్షణను బలోపేతం చేయడం ఈ చర్య లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ సంస్కరణలను అమలు చేయనుంది.

# సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

## రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** సమాజానికి ఉపయోగపడే సృజనాత్మక ఆలోచనలతో ముందుకొచ్చే ప్రతి ఒక్కరినీ తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్, ప్రముఖ నేపథ్య గాయకుడు నేమాని పార్థు ఆధ్వర్యంలో రూపొందించిన భాగవతామృతం (దృశ్యశ్రవణ పద్యకథా మాలిక) మొదటి సంచికను బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో శనివారం ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ సమాజంలో నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, పురాణాలు, ఇతిహాసాలపై అవగాహన తగ్గుతోందన్నారు. ఇలాంటి తరుణంలో... మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భాగవతంలోని పద్యాలు, వాటి అంతరార్థాన్ని పిల్లలు, యువతకు సులభంగా అర్థమయ్యేలా ఆహ్లాదకరమైన సంగీతం, ఆకట్టుకునే దృశ్యరూపకంతో "భాగవతామృతం" పేరిట అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. విజ్ఞానంతో పాటు విలువలనూ పెంపొందించే ఇలాంటి తరహా సృజనాత్మక ప్రయోగాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. భాగవతాన్ని ప్రతి ఇంట్లో వినపడేలా చేసేందుకు కృషి చేసిన కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ నిర్వాహకులను, గాయకుడు నేమాని పార్థును మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గనుల శాఖ ప్రత్యేక అధికారి బిఆర్‌వి సుశీల్ కుమార్, భోగరాజు మూర్తి, పార్థు నేమాని తదితరులు పాల్గొన్నారు.

# పరస్పర గౌరవంతోనే ఆరోగ్యకర బంధాలు

## స్టాండ్ విత్ హర్ చర్చా వేదికలో సిఐడి డిజి చారుసిన్హా

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** సమాజంలో పరస్పన గౌరవంతోనే ఆరోగ్యకర బంధాలు స్థిరంగా వుంటాయని సిఐడి చారు సిన్హా తె లిపారు. ఈ విషయంలో కోపం, అహంకారం, ఆదిపత్య దోరణులతో కూడిన విషపూరిత బావజాలాన్ని అందరు విడనాడాలని ఆమె తెలిపారు, అంబేద్కర్ వర్శిటీలోని వీ హబ్‌లో శనివారం నాడు జరిగిన స్టాండ్ విత్ హర్‌కు సంబంధించి ఎనిమిదవ చర్చా వేదికలో చారు సిన్హా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో పురుషులు, మహిళలు పరస్పరం గౌరవంతో వుండడంతో పాటు అం దరు సమానమనే భావనతో మెలగాలని ఆమె అన్నారు. ఈ విషయంలో అందరు బావోద్వేగాలను నియంత్రించుకోవాలని, వాదనలకు దూరంగా వుండాలని, కొంత సమయం తీసుకుని, సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమమని ఆమె తెలిపారు. కోపాన్ని క్రీడలతో దూరం చేయవచ్చని, శారీరక వ్యాయామాలు కూడా ఇందుకు దోహదం చేస్తాయని ఆమె చెప్పారు. లింగ వివక్షకు సంబంధించి ఇప్పటికీ పాత బావజాలం కొనసాగుతుందని, ఇది బాధాకరమని ఆమె తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, పురుషులతో సమానంగా ముందుకు వెళుతున్నారని కార్మిక శాఖ ప్రత్యేక కమిషనర్ పమేలా సత్పతి అన్నారు. మహిళల అనుభవాలు, అభిప్రాయా లను తక్కువ చేసి చూడరా దని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో సీఈడబ్ల్యు మహిళా భద్రత విభాగం తరపున అనూష, ప్ర ముఖ యాంకర్లు ఝాన్సీ, దీప్తి, నటుడు వంశీ చాగంటి, వీ హబ్ సీఈఓ సీత తదితరులు పాల్గొన్నారు.



స్టాండ్ విత్ హర్ చర్చా వేదికలో పాల్గొన్న సిఐడి డిజి చారు సిన్హా తదితరులు.

# విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలపై పిటిషన్

## సామాన్యులపై మోయలేని భారం

## అసమాన ప్రభావం చూపనున్న పంపిణీ సంస్థలు

## విచారణకు అంగీకరించిన జాతీయ కమిషన్

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణలోని వ్యవసాయేతర విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.5,420 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారా న్ని వేస్తూ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు నిర్ణయానికి వ్యతిరేకంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)లో పిటీషన్ దాఖలైంది. హైదరాబాద్‌కు చెందిన ఒక న్యాయవాది దాఖలు చేసిన ఈ ఫిర్యాదును స్వీకరించింది. సరఫరా చేయబడిన విద్యుత్ నిమిత్తం పంపిణీ సంస్థలు చేసిన ఖర్చుకు, వినియోగదారుల నుండి వసూలు చేసిన ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ట్రూఅప్ ఛార్జీల పేరుతో మరోసారి ముక్కుపిండి భారీ మొత్తంలో వసూలు చేయాలనే ప్రతిపాదనపై దాఖలు చేసిన ఫిర్యాదును విచారించనుంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చే నెల నుంచి రెండేళ్లకు పైగా నెలవారీ విద్యుత్ బిల్లులలో అదనపు ఛార్జీల ద్వారా ఆ మొత్తాన్ని వసూలు చేస్తుందని ఆ ఫిర్యాదులో పిటీషనర్ పేర్కొన్నారు.

ఈ చర్య ఒక వాస్తవ విద్యుత్ షాక్ లాంటిదని, ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారాలు, ఇతర బలహీన వినియో గదారులపై అసమానంగా ప్రభావం చూపుతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుత విని యోగ దారులపై గత ఆర్థిక సర్దుబాట్ల కోసం ప్రతిపాదించిన భారం, ముఖ్యంగా వారి ఆర్థిక సామర్థ్యాన్ని, బలహీన వర్గాలపై దాని ప్రభావాన్ని తగినంతగా పరిగణనలోకి తీసుకోకుండా విధించడం సరికాదని తెలిపారు.

ఈ ఏకపక్ష, వివక్షా పూరిత ప్రభుత్వ చర్యలను నిషేధించి, చట్టం ముందు సమాన రక్షణకు హామీ ఇచ్చే ఆర్టికల్ 14 ప్రకారం తీవ్ర ఆందోళనలను రేకెత్తి స్తోందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్య వల్ల బకాయిలు, కనెక్షన్ తొలగింపు కూడా జరగవచ్చని, తద్వారా గౌరవంగా జీవించే హక్కుపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. రాష్ట్రంలోని విని యోగదారుల నుండి యూనిట్‌కు 30 పైసలు వసూలు చేస్తాయని, దీనిని తదనంతరం 50 పైసలకు పెంచనున్నాయని, ఇది సామాన్య వినియోగదారులకు పెద్దఎత్తున ఆర్థిక భారం అవుతుం దని తెలిపారు.

మానవ హక్కుల చిక్కులు, వినియోగదారులపై ప్రభావం వంటి అంశాలను పరిశీలించే వరకు ప్రతిపాదిత ట్రూఅప్ ఛార్జీల వసూలును వాయిదా వేసేలా తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదే శించాలని కోరారు. తమ అభిప్రాయాలను సమర్పించడానికి పౌరులకు కనీసం మూడు నెలల సమయమిస్తూ ఒక బహిరంగ ప్రకటన జారీ చేయాలని కూడా జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను దాఖలు చేసిన పిటీషన్‌లో పేర్కొన్నారు.





# సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌కు 124 మంది మాజీ ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్‌ల మద్దతు

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** భారత ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, జ్ఞానేశ్ కుమార్‌లకు భారీ మద్దతు లభించింది. ఈసీకి మద్దతు తెలుపుతూ 124 మంది మాజీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు బహిరంగ లేఖ విడుదల చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించే వారు అందుకు విశ్వసనీయ ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా ఎన్నికల వ్యవస్థపై అక్రమ ఆరోపణలు చేస్తూ, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నారని హెచ్చరించారు. ఇప్పటికే ఎన్నికల సంఘాన్ని, ఎస్ఐఆర్‌ను సమర్థి 42 మంది మాజీ న్యాయమూర్తులు మద్దతు తెలిపారు. లేఖలో భారత ప్రజలను ఉద్దేశించి ఈ లేఖను రాశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఓట్ చోరీకి పాల్పడ్డారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష నేతలు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరసనలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సమయంలో మాజీ బ్యూరోక్రాట్లు ఈ లేఖను విడుదల చేయడం సంచలనంగా మారింది. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా తయారీ, ఈవీఎం మిషన్లను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ల పర్యవేక్షణ వంటి బాధ్యతల్ని నిర్వహించిన అనుభవం తమకు ఉందని మాజీ అధికారులు లేఖలో పేర్కొన్నారు. తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవాళ్లం కాదని, ఆధారాలు లేకుండా మన ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని పదే పదే ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. ప్రతీ సారి ఓట్ చోరీ అనే పదాన్ని ఉపయోగించి ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. గతంలో ఎన్నికల్లో అక్రమాలు ఎలా జరిగేవో తమకు తెలుసని, పోలింగ్ కేంద్రాల వద్ద తుపాలకులతో బెదిరింపులు, ప్రభావవంతమైన వ్యక్తుల అనుచరుల దాడులు, బ్యాలెట్ పెట్టెల్లో అక్రమంగా ఓట్లు వేయడం, ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలు అప్పట్లో చోటుచేసుకునేవని తెలిపారు. బూత్ క్యాప్చరింగ్ విస్తృతంగా ఉండటంతో 1989లో పార్లమెంట్ దానిని నేరంగా పరిగణిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుందని లేఖలో గుర్తు చేశారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా అవసరమని చెప్పారు.

# బంగారం దుకాణంలో సైనైడ్ తిని చిన్నారి మృతి



మిషా (ఫైల్)

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర పరిధిలోని జీడిమెట్లలో విషాదం నెలకొంది. పండగ వేళ తమ చిన్నారికి బంగారం కొనడానికి జ్యువెల్లరీ స్టోర్‌కు వెళ్లిన తల్లిదండ్రులకు శోకం మిగిలింది. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. గోపీకృష్ణ, జానకి దంపతులు హైదరాబాద్ నగర పరిధిలోని చింతల్‌లో నివాసముంటున్నారు. వీరికి రెండేళ్ల పాప మిషా(2)ఉంది. పండుగ సందర్భంగా ఈనెల 7న పాపకు బంగారం కొనుగోలు చేయడానికి వారు చిన్నారి మిషాతో కలిసి చింతల్‌లోని ఓ జ్యువెల్లరీ స్టోర్‌కు వెళ్లారు. తల్లిదండ్రులు ఆభరణాలు చూస్తుండగా..అదే సమయంలో సైనైడ్‌ను పొరపాటున తిన్న చిన్నారి..అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన తల్లిదండ్రులు చిన్నారిని వెంటనే స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చిన్నారి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందింది. గోల్డ్‌షాప్ యాజమాన్య నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతి చెందిందంటూ చిన్నారి తల్లిదండ్రులు, బంధువులు జ్యూయెలరీ స్టోర్ ఎదుట ధర్నాకు దిగారు.

# వాయిపేటలో పోలీసులపై దాడి

## గంజాయి కేసు విచారణలో చెలరేగిన ఘర్షణ

## సిఐ, ఎస్ఐకి తీవ్రగాయాలు, 144 సెక్షన్ విధింపు

**బజార్‌హత్నూర్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** సిరికొండ మండలం వాయిపేట గ్రామంలో గంజాయి కేసు విచారణ నిమిత్తం వెళ్లిన పోలీసులపై గ్రామ స్తులు ఒక్కసారిగా దాడికి దిగిన సంఘటన తీవ్ర కలకలం రేపింది.గ్రామంలోని ఒక పెరట్లో అక్రమంగా సాగు చేస్తున్న 18 గంజాయి మొక్కలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఈ కేసు దర్యాప్తు, తదుపరి విచారణ నిమిత్తం శనివారం ఉదయం పోలీసులు వాయిపేటకు వెళ్లగా, విచారణ సమయంలో పోలీసులకు, గ్రామస్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ఆగ్రహంతో రగిలిపోయిన గ్రామస్తులు పోలీసులపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో ఇచ్చోడ సీఐ, ఇచ్చోడ ఎస్ఐ, సిరికొండ ఎస్ఐలతో పాటు మరో ఇద్దరు పోలీస్ సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన పోలీసు అధికారులను, సిబ్బందిని తక్షణ చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించారు.

గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చేందుకు పోలీసు ఉన్నతాధికారులు అదనపు బలగాలను భారీగా మోహరించారు. అలాగే గ్రామంలో ముందస్తు జాగ్రత్తగా 144 సెక్షన్ (నిషేధాజ్ఞలు) అమలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



వరి పంట రక్షణకు పొలమంతా వలను పరిచిన దృశ్యం

# పంట రక్షణకు చేపల వల!

## పక్షుల బారి నుంచి వరిని కాపాడుకునేందుకు రైతు వినూత్న ప్రయత్నం

**దిలావర్‌పూర్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** పంటను ఏపుగా పెంచి, ఎంతో ఆశగా దిగుబడి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో పక్షుల బారి నుంచి కాపాడుకునేందుకు ఓ యువరైతు వినూత్న ఆలోచనతో ముందుకు వచ్చాడు. దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన యువరైతు మారుపాకుల శ్రీనివాస్ సాగు చేసిన రెండెకరాల వరి పంట ప్రస్తుతం పూర్తిగా కంకి దశకు చేరుకుంది. సాగు ప్రారంభం నుంచి ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర నీటి ఎద్దడి, మరోవైపు వరుస చీడపీడలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పంటను కాపాడుకున్నాడు. కాగా, ప్రస్తుతం వరి కంకులు పూర్తిగా బయటకు వచ్చి ధాన్యం ఊరుతుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పిట్టలు, పక్షుల గుంపులు వచ్చి ధాన్యాన్ని తినేస్తున్నాయి. దీంతో పక్షుల నుంచి పంటను కాపాడుకునేందుకు సదరు రైతు తన పొలం చుట్టూ చేపల వలను వినూత్నంగా ఏర్పాటు చేశాడు. దీంతో పక్షుల ముప్పు తప్పి పంట సురక్షితంగా ఉంటుందని రైతు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

# విదేశాలకు కూడా సన్నబియ్యం ఎగుమతులు





ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో జరుగుతున్న ఇంటర్నేషనల్ వరల్డ్ రైస్ కాన్ఫ రెన్స్-2026లో తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణరైతు భారతదేశానికే కాకుండా, ప్రపంచానికే అన్నదాత వెలుగొందుతున్నాడనీ తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. స్టీఫెన్ రవీంద్ర కితాబు ఇచ్చారు. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో జరుగుతున్న ఇంటర్నేషనల్ వరల్డ్ రైస్ కాన్ఫరెన్స్ 2026లో ప్రపంచ వ్యవసాయ రంగ ప్రముఖులను ఉద్దేశించి స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ రంగంలో సాధించిన పురోగతి, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతుల పంటసాగు చేసి గత సీజన్‌లో తెలంగాణ 18.5 మిలియన్ టన్నుల బియ్యం ఉత్పత్తి చేశారని వివరించారు.

అంతర్జాతీయ బియ్యం కొనుగోలు దారులు, వ్యాపార సంస్థలు తెలంగాణతో నేరుగా భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. దేశంలోని మొత్తం బియ్యం ఉత్పత్తిలో తెలంగాణ రైతు దిగుబడి దాదాపు 12 శాతమనీ చెప్పారు. దేశంలోని బియ్యం సాగు విస్తీర్ణంలో తెలంగాణ వాటా కేవలం 10 శాతం మాత్రమే ఉన్నప్పటికీ ఈ స్థాయిలో ఉత్పత్తి సాధించిందనీ స్పోత్కర్షలు చెప్పుకొన్నారు. ఇప్పటివరకు అవసరాలకంటే అధికంగా ఉన్న నిల్వ చేసి భవిష్యత్ అవసరాలకు బియ్యాన్ని నిర్వహించడంపై ప్రధానంగా దృష్టి పెట్టిన పౌరసరఫరాల శాఖ తన వైఖరి మార్చుకొందని ఇప్పుడు తెలంగాణ బియ్యానికి ప్రపంచ మార్కెట్లో ఎక్కువ విలువ తీసుకొని రావడానికి పూనుకొందని చెప్పారు. అంతర్జాతీయ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన సన్న రకం, సూపర్‌ఫైన్ రకం బియ్యాన్ని ప్రోత్సహిస్తోందనీ చెప్పారు.

అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ బియ్యానికి బలమైన గుర్తింపు తీసుకు రావా లని లక్ష్యంగా పెట్టుకుందనీ తెలిపారు.2025లో ఫిలిప్పీ న్స్‌కు 30,000 టన్నుల బియ్యాన్ని విజయవంతంగా ఎగుమతి చేసిన తెలంగాణ, ఇప్పుడు ఆసియా, ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవాలని చూస్తోందనీ అన్నారు.

తెలంగాణ నుంచి నాణ్యమైన సన్న బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు అంతర్జాతీయ కొనుగోలుదారులు, రిటైలర్లు, ఫుడ్ కంపెనీలు, ఎగుమతిదారులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. తెలంగాణను కేవలం బియ్యం సరఫరా చేసే రాష్ట్రంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయి ప్రమా ణాలతో నమ్మకమైన, బ్రాండెడ్ బియ్యం ఎగుమతి దారుగా మార్చేందుకు పౌరసరఫరాల శాఖ కృషి చేస్తోందనీ భరోసా రవీంద్ర ఇచ్చారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా, అవసరానికి తగ్గ సరఫరా, ఉత్పత్తి ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునే విధంగా పారదర్శకమైన సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటోందనీ స్టీఫెన్ వివరించారు. ప్రపంచ మార్కెట్లతో పారదర్శకమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణలో ఉన్న బియ్యం మిగులుకు మరింత విలువ తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందనీ తెలిపారు అదే సమయంలో, మన రాష్ట్ర ప్రజల ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటూనే, అంతర్జా తీయ మార్కెట్లో తెలంగాణ బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయాలని భావిస్తోందనీ అన్నారు.

### నీటి దుర్వియోగం అడ్డుకట్టకు జలమండలి దృష్టి

వర్షాభావ పరిస్థితులతో హైదరాబాద్‌కు ప్రధాన దిక్కైన నాగార్జున సాగర్, గోదావరి పంపింగ్ పాయింట్ల వద్ద నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయనీ నగర ప్రజలు అర్థం చేసుకొని నీటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని జలమండలి ప్రజలను చైతన్యం చేసే దిశగా అడుగు వేసింది. ఒక హోటల్ నీటిని దుర్వినియోగం చేయడంతో 20వేల పెనాల్టీ జలమండలి ఎండి అశోక్‌రెడ్డి వేశారు. కోటిన్నరకుపైగా జనాభా ఉన్న భాగ్యనగరానికి కృష్ణా, గోదావరి జలాలతోపాటు సింగూరు, మంజీరా, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ దాహం తీరుస్తున్నాయి. అధికారుల అంచనా ప్రకారం ప్రస్తుత నీటినిల్వలు రానున్నమూడు నెలలకే సరిపోతాయని భావిస్తున్నారు. మరోవైపు శివారుమున్సిపాలిటీలను గ్రేటర్‌లో కలపడంతో వాటికి నీళ్లుఇచ్చే బాధ్యతను ప్రభు



త్వం జలమండలికే అప్పగించింది. కోర్ సిటీలోనే అరకొరగా నీటినిఅందిస్తోన్న జలమండలికి శివారుప్రాంతాలకు నీరు అందించడం సవాలుగా మారింది. ఆలోటును భర్తీ చేసేందుకు అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నా సాధ్యమైన త్వరగా ఆచరణలోకిరావడంలేదు. చాలా ప్రాంతాలకు తాగునీటి ఇక్కట్లు తప్పడంలేదు. హైదరాబాద్‌లో నీటి డిమాండ్ 700-750 ఎంజిడి ఉంటే సరఫరా చేస్తున్న 600ఎంపిడి మాత్రమే ఆనీరు నగరానికి సరిపోవాలి. కానీ జనవరి నుంచి జూన్, జులైఇలా మెల్లగా భూగర్భజలాలుతగ్గిపోతున్నాయి. ఇది ఎండాకాలంలో ఇబ్బందికరంగా మారుతుంది. రాజధానిలోని పలు బస్తీలు, శివారు ప్రాంతాలు నీటికోసం ఇక్కట్లు పడుతున్నాయి.

# తెలుగునేలపై కరవు కరాళ నృత్యం

**భాగ్యనగర్ భాస్కర్‌కుమార్**

'నీళ్లులేని ఎడారిలో కన్నీళ్ళైనా తాగి బతుకాలి' సినారె పాటను స్ఫూర్తిగా తీసుకొని గాడ్జిల్లా ఎల్‌నీనో కఠిన పరిస్థితులను ప్రజలు ఎదుర్కొనడానికి సన్నద్ధం కావాల్సి ఉంటుంది. తెలుగురాష్ట్రాలలో కరవు కోరలు చాపుతూ బుసకొడతోన్నది. బియ్యం ధరలు పెరిగాయి, పప్పులు కూరగాయల ధరలు ఇంకా పెరుగుతాయి. ఎటుచూసినా కరవు తాండవిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 21 జిల్లాల్లోని 388 కరవు మండలాలుగా అధికారికంగా ప్రకటించి నివారణ చర్యలు చేపట్టింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం 18జిల్లాలోని 320 మండలాలలో తీవ్ర కరవు పరిస్థితి ఏర్పడినట్లు గుర్తించింది. ఆంధ్రప్రదేశ్‌లో నదులు ఎత్తులో పారుతాయి. దీనికి తగ్గట్టు అనేక రిజర్వాయర్లు అభివృద్ధి చేసుకోవడంతో కరవు ప్రభావం ఉన్నా కనీసం తాగునీటికి మాత్రం ఢోకాలేని పరిస్థితి ఉంది. గోదావరి, కృష్ణా నదుల కంటే తెలంగాణ భూమి ఎత్తులో ఉండటంతో గోదావరి కృష్ణా నదుల వరదను ఎత్తిపోసుకొంటేకాని తడవని దైన్యం నెలకొంది. తెలంగాణలో ఎల్‌నినో పంజా విప్పడంతో సాగునీటికే కాదు తాగునీటికి తీవ్ర కరవు వచ్చే పరిస్థితి నెలకొంది. గోదావరి, కృష్ణా నదుల్లోని ప్రధాన రిజర్వాయర్‌లో నీటినిల్వలు అక్టోబరు రెండో వారంలోనే ప్రమాదఘంటికలు మ్రోగిస్తున్నాయి. శ్రీశైలంలో రిజర్వాయర్‌లోకి ఈయేడు 219టిఎంసిల వరద ఎగువ నుంచి రాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నుంచి అభిలాషణీయమైన స్థాయిలో తరలించి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో భద్రపరచకొంది. పెన్నార్ బేసిన్‌లో కూడా వెలుగోడు రిజర్వాయర్‌లో 16.95 టిఎంసిలకుగాను ప్రస్తుతం 8.497టిఎంసిల నీరు నిలిచి ఉంది. సోమశిలలో 19.4టిఎంసిలు, కండలేరులో 17 టిఎంసిల నీరు ఆంధ్రప్రదేశ్ పాలకులు ఈ కరవులో కూడా ఒడిసి పట్టారు. వంశధార ఇతర బెసిన్‌లోని ఏలేరులో కూడా 17 టిఎంసిల నీరు అందుబాటులోఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ నుంచి నీటిని కావేరి పెన్నా బేసిన్‌వరకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటిని ఒడిసిపట్టుకోవడంలో కొంత మేరకు సఫలమైంది. అన్ని ప్రాజెక్టులలో సగానికి పైగా నీరు సగటున ఉంది. ప్రస్తుతం శ్రీశైలంలో 73.53 టిఎంసిల నీరు నిల్వఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగార్జునసాగర్‌లో వరుణయాగం చేసినా వానదేవుడు కనికరం చూపలేదు. జూరాలకు కృష్ణానది 250 టిఎంసి వరద నీరు తీసుకొచ్చినా రామన్‌పాడు, గోపల్‌దిన్నె, రేలపాడు, గూడెం దొడ్డి, గట్టునెట్టంపాడు, కోయిలసాగర్, భీమా వంటి బాలెన్సింగ్ రిజర్వాయర్లు ఎత్తిపోతల పథకాలలో నీటి కరవునెలకొంది. తెలంగాణ రిజర్వాయర్లు లేకపోవడంతో శ్రీశైలంనుంచి



ఆంధ్రప్రదేశ్ తరహాలో నీటిని భద్రపరచుకొలేక విఫలమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నీరు లేక పంటలు ఎండిపోయాయి. జూరాలకు మూడు టిఎంసిల నీరు ఇవ్వాలని మంత్రులు జూపల్లికృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు సెప్టెంబరు23న కర్ణాటకకు వెళ్ళి అభ్యర్థించినా ఇప్పటికి నీరు విడుదలచేయలేదు. గోదావరి పరిస్థితి మరీ దారుణంగాఉంది. ఎగువన బాబ్లీ దాటి 42.38టిఎంసిలనీరు మాత్రమే వరద రూపంలో ఎస్సారెస్పీకి చేరింది. ప్రస్తుతం అందులో 45.76 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోయడంతో ప్రస్తుతం మధ్యమానేరు రిజర్వాయర్‌లో 23.51టిఎంసిల నీరుఉంది. శ్రీపాద ఎల్లంపల్లిలో 18.26 టిఎంసిల నీరు ప్రస్తుతం ఉంది. గోదావరికి వచ్చే వరద అత్యధికంగా ప్రాణహిత నుంచి మొదలవుతోంది. ఈ సంవత్సరం కూడా ఒక దశలో ఎనిమిదిలక్షల కూసెక్కుల వరదనీరు మేడిగడ్డ నుంచి వెళ్ళిన అనుభవం ఉంది. మేడిగడ్డ నుంచి దిగువకు 750 టిఎంసిలు దిగువకు వెళ్ళిపోయాయి. కాళేశ్వరం ఎత్తిపోతలపథకంలో కీలకమైన మేడిగడ్డ బ్యారేజ్ ఎగువ కన్నెపల్లి పంపులను ఆన్‌చేస్తే ప్రాణహిత జలాలను ఒడిసిపట్టి ఉంటే ఉత్తర తెలంగాణలోని సుమారు పదివేల చెరువుల్లో, రిజర్వాయర్‌లలో 100 టిఎంసిలు అందుబాటులో ఉండేవి. మేడిగడ్డ నుంచి అన్నారం, అన్నారం నుంచి సుందిళ్ల, సుందిళ్ల నుంచి ప్రధాన గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించుకోచ్చు. ఎల్లంపల్లి నుంచి నంది మేడారం, నందిమేడరారం నుంచి లక్ష్మీపూర్, లక్ష్మీపూర్‌నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా రాజరాజేశ్వర జలాశయం, ఆపై అక్కడి నుంచి అంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్‌కు అక్కడి నుంచి రంగనాయకసాగర్‌కు, తద్వారా కొమురవెల్లి మల్లన్నసాగర్, అక్కడి నుంచి కొండపోచమ్మ సాగర్, బస్వాపుర్ రిజర్వాయర్ వరకు జలాలను తరలించుకోచ్చు. వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీకి, మల్లన్నసాగర్ నుంచి కూడవెల్లి వాగులోకి జలాలను విడుదల చేసి ఎగువ మానేరుకు, కొండపోచమ్మ సాగర్ ద్వారా హల్దీవాగులోకి జలాలను విడుదల చేస్తే నిజాం సాగర్‌కు పారే అవకాశం ఉండేది. అందుకు కావాల్సిన నీటి సరఫరా వ్యవస్థ మొత్తం సంసిద్ధంగా ఉన్నది. సాగుకు భరోసా దక్కేది. అదేవిధంగా దేవాదుల పంపులను కూడా గరిష్టరీతిలో వినియోగించి ఎత్తిపోస్తే జనగామ ఎత్తు ప్రాంతాలకు నీటి వసతి ఉండేది. నైరుతి కాలం ముగింపు దశలో వానలు తగ్గుముఖం పట్టిన తరువాత కూడా గోదావరిలో ప్రాణహిత నుంచి మేడిగడ్డ మీదుగా సెప్టెంబర్ 29న లక్షా 22వేల క్యూసెక్కులు 30న లక్ష క్యూసెక్కులు వెళ్ళాయిజ ఇప్పటికి ఇరువై ముప్పై క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతున్నది. అక్టోబరు మొదటి వారం వరకు సగటున రోజుకు 9టిఎంసిల నీరు జలాలు దిగువకు పోయాయి. గోదావరి ప్రవాహ మట్టం జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలో 95 మీటర్ల ఎత్తున ఉండటంతో మేడిగడ్డ బరాజ్ గేట్లు మూయాల్సిన అవసరం లేకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద మోటర్లను ఆన్ చేసినా ప్రాణహిత జలాలను ఎత్తిపోసుకోవచ్చు, ఉత్తర తెలంగాణను కరవు బారినుంచి రక్షించుకోవచ్చు. అంతేకాదు హైదరాబాద్‌కు నీటి ఎద్దడి లేకుండా చేసుకోవచ్చని అని విశ్రాంత ఇంజనీరు శ్యాం ప్రసాదరెడ్డి ప్రభుత్వానికి సలహా కూడా ఇచ్చారు. నీటి నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఎన్‌డిఎస్‌ఎ, సిడబ్ల్యుసి కూడా సన్నాయి నొక్కులు నొక్కినా ప్రభుత్వం చేసిన ఆలస్యం కారణంగా తాగునీటికి సైతం సంకట పరిస్థితులు ఏర్పడే ప్రమాదం పొంచి ఉన్నది. మేడిగడ్డకు ఎగువన గోదావరి, మంజీరాలో పెద్దగా ప్రవాహాలు రాలేదు. ప్రభుత్వం మేజర్ ప్రాజెక్టుల దిగువన క్రాప్ హాలిడే ప్రకటించాల్సి వచ్చింది. కాళేశ్వరం నీటి వనరు పొందే అవకాశం ఉన్న దాదాపు సుమారు పది వేల చెరువులు, చెక్‌డ్యామ్‌లను నింపే అవకాశం జారవిడుచుకొన్నట్లైంది. గుడ్డిలో మెల్ల అన్నట్లు ఎల్లంపల్లి నుంచి ఇప్పటి వరకు 21 టిఎంసిల నీటిని మిడ్ మానేరుకు ఎత్తి పోశారు. గాయత్రి, నంది పంప్‌హౌస్‌ల ద్వారా జలాలను తరలించారు. అవి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించినవే. ఇటీవల రంగనాయకసాగర్‌కు సైతం జలాలను ఎత్తి పోశారు. ప్రాజెక్టులో భాగమైన ఇతర వ్యవస్థలను వినియోగిస్తున్నట్లే ఆ మూడు బ్యారేజిలను వినియోగించితే బాగుండేది. ఎగువన అన్నారం, సుందిళ్ల బ్యారేజిలల్లో మేడిగడ్డ తరహా ఎలాంటి కుంగుబాట్లు లేవు. సిపేజి సమస్యలు రాగా, గతంలోనే వాటిని పునరుద్ధరించారు. వాటిని వినియోగించుకున్నా 2027జూలై వరకు తాగునీటి అవసరాలను తీర్చుకునే అవకాశం లభించేది. వచ్చేఏడాది ఆగస్టు నాటికి తాగడానికి సుమారు 39.12 టిఎంసిల నీరుకావాలి. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఎండలు పెరిగే ప్రమాదం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేస్తున్నది. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మరోవైపు భూగర్భజలాలు సైతం నెలకు మీటరు చొప్పున లోతుకు పడిపోతున్నాయి. గతంలో ఇదే సమయంలో రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం 6.22 మీటర్లు. కానీ ప్రస్తుతం 10నుంచి 11మీటర్లకు పడిపోయింది. దాదాపు మూడు నుంచి నాలుగు మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ●

# 'అదృశ్య' దీదీ!

రాష్ట్రం — పశ్చిమ బెంగాల్

**ఎ.వి.వి ప్రసాద్**

తాడి తన్నే వాడికి తలదన్నే వాడుంటాడంటారు. పశ్చిమ బెంగాల్‌లో మాజీ సిఎం మమతా బెనర్జీకి ఈ విషయం ఇప్పుడు బాగా అర్థమవుతోంది. మూడు దశాబ్దాలు పైగా రాష్ట్రాన్ని తమ గుప్పిట్లో ఉంచుకొన్న వామ పక్షాలను మమత తరిమి కొడితే, మూడు పర్యాయాలు సిఎంగా ఉన్న ఆమెను ఐదు నెలల క్రితం బిజెపి అథఃపాతాళానికి తోసేసింది. తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లో ఆమె తృణమూల్‌కాంగ్రెస్ పార్టీ కనీసం సోదిలోకి రాని పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం వచ్చిన ఫలితాలను చూస్తే తృణమూల్ పేరు లేకుండానే ఫలితాలు కనిపించాయి. నందిగ్రామ్, రెజీనగర్ రెండింటిలోను తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పోటీ చేయనే లేదు. నందిగ్రామ్‌లో వరుసగా మూడోసారి గెలిచి బిజెపి హ్యాట్రిక్ విజయం సాధించడమే గాక రెజీనగర్‌లో ప్రముఖ ముస్లిం నాయకుడు, హుమాయూన్ కబీర్ నాయకత్వంలోని ఎజెయుపిని ఓడించి మైనారిటీల కోటలో విజయ ఢంకా మోగించింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి తన రెండో సీటు అయిన నందిగ్రామ్‌ను ఖాళీ చేస్తే, కబీర్ తన రెండో సీటు అయిన రెజీనగర్‌ను ఖాళీ చేశారు. సహజంగానే నందిగ్రామ్‌లో బిజెపి గెలిస్తే రెజీనగర్‌లో ఎజెయుపి ఓటమి పాలయింది. రెండు చోట్ల కాంగ్రెస్‌కు తృణమూల్ పార్టీ మద్దతు ఇచ్చింది కానీ ఫలితం లేకపోయింది. రెజీనగర్‌లో ముస్లిం ఓటర్ల ఆధిక్యం ఎక్కువ. దాదాపు 70శాతం ముస్లింలుఉన్న ఆ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి షఖరోవ్ సర్కార్ 75వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అక్కడి ఎజెయుపి అభ్యర్థి కబీర్ తనయుడైన గోలం నబీ ఆజాద్ అయినా గెలవలేకపోయారు. కబీర్‌కు ఆ నియోజకవర్గంలో నూరు శాతం మైనారిటీల మద్దతు ఉందంటారు. అటువంటి చోట ఓటర్లు బిజెపికి పట్టం కట్టారంటే గత ఐదు నెలలుగా అమలవుతున్న సంక్షేమ పథకాల ప్రభావమే కారణం కావచ్చు. మమత పార్టీ గత ఐదు నెలల్లో ముక్కలు చెక్కలవడం, ఆమె కాంగ్రెస్ పంచన చేరడం ముస్లింలను దూరం చేసి ఉండవచ్చు. నిజానికి టిఎంసికే గతంలో అక్కడ మెజారిటీ వచ్చింది. ఇప్పుడు పూర్తిగా అదృశ్యమైంది. అక్కడ రెండో స్థానంలో కబీర్ పార్టీ ఉండగా, మమత మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ మూడో స్థానంలోకి వెళ్లింది. దీనిని బట్టి చూస్తే మమత పార్టీ ఇప్పట్లో అక్కడ కోలుకోలేదనే అనిపిస్తుంది. ఇక నందిగ్రామ్‌లో ఓటర్లు ఒకప్పుడు మమతా బెనర్జీకి బ్రహ్మరథం పట్టారు. అప్పట్లో మమత నాయకత్వంలో జరిగిన భూసేకరణ వ్యతిరేకోద్యమానికి నందిగ్రామ్ కేంద్ర బిందువైంది. అటువంటి చోట 2021, 26లో రెండు సార్లు సువేందు అధికారి మమతపైవిజయం సాధించారు. ఇప్పుడు అదే చోట జరిగిన ఉప ఎన్నికలో వరుసగా మూడోసారి బిజెపి గెలుపొందడమే గాక పార్టీ అభ్యర్థి హాసి రాణి రథ్ గతంలో సువేందుకు సైతంరానంత అత్యధిక మెజారిటీతో గెలుపొందడం విశేషం.



మమతా బెనర్జీ

ఈ నియోజక వర్గంలో సువేందు 2021లో 1956 ఓట్ల ఆధిక్యంతో మాత్రమే గెలవగా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 2665 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అంటే ఆయన కంటే కూడా ఎక్కువ మద్దతుతో హాసి రాణి రథ్ గెలిచారంటే బిజెపి ప్రభావం పశ్చిమ బెంగాల్‌లో ఎంత బలంగా ఉన్నదో స్పష్టమవుతుంది. రెజీనగర్‌లోనే గాక మిగిలిన ప్రాంతాల్లో కూడా ప్రజలు బిజెపి పట్ల ఎక్కువగా ఆకర్షితులవుతున్నారనీ, వచ్చే ఎన్నికల నాటికి ఈ ఓటు బ్యాంకు మరింత పటిష్టమవుతుందనీ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే మైనారిటీ ఓటర్లలో వచ్చిన మార్పు తాత్కాలికమా, దీర్ఘకాలికమా అనేది ఇంకా తేలవలసి ఉంది. ఐదు నెలలక్రితం బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన తొలి ఉప ఎన్నికల్లో మమత పార్టీ తొలిసారి పూర్తిగా ఉనికిని కోల్పోయినట్లేనని చెప్పాలి. అసెంబ్లీలో 80 సీట్లకే పరిమితమైన టిఎంసికి ఉప ఎన్నికల ఫలితాలు కొత్త సవాలువిసిరాయి. ఇంతకాలం ఆ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న మైనారిటీలు ఇప్పుడు మమతను మరింత సంకటస్థితిలోకి నెట్టివేశారు. మమత వర్గానికి, రితబ్రత బెనర్జి నాయకత్వంలోని చీలిక వర్గానికి (డెమొక్రటిక్ తృణమూల్) మధ్య విభేదాలు ఉప ఎన్నికలతో మరింత అధికమయ్యాయి. రెండువర్గాలు వేర్వేరుగా బరిలోకి దిగడంతో ఓట్లు బాగా చీలిపోయాయి. రెజీనగర్‌లో మమత వర్గానికి3847 ఓట్లు రాగా, రితబ్రత వర్గానికి 2044 ఓట్లు మాత్రమే లభించాయి. దీనిని బట్టిచూస్తే తర్వాత ఏ ఎన్నికలు జరిగినా ఇదే విధమైన చీలిక కనిపించవచ్చు. గత తృణమూల్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల వివాదాన్ని ఎక్కువగా ఎదుర్కొంది. ఉపాధి కోసం బెంగాల్ నుంచి వలసలు అధికమయ్యాయి. అయితే మహిళల సంక్షేమానికి సువేందు ప్రభుత్వం ఎక్కువ కార్యక్రమాలు చేపట్టడంతో వాటి ప్రభావం ఉప ఎన్నికలపై ఎక్కువ కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంసికి సీట్లు బాగా తగ్గినా, ఇంకా 40శాతం ఓట్ల బలంఉంది. బిజెపికి 46 శాతం దాకా ఉంది. ఈ శాతాల్లో ఏ కొంచెం తేడావచ్చినా జాతకాలు మారిపోతాయి. బిజెపి ఈ విషయం మరచిపోకుండా అడుగులు వేయవలసి ఉంటుంది. ఉపఎన్నికలనుంచి తృణమూల్ కాంగ్రెస్ నేర్చుకోవలసిన పాఠాలు కూడా చాలాఉన్నాయి. తృణమూల్ చీలిక వర్గంతో తలెత్తిన విభేదాలను పరిష్కరించుకొనే అంశానికి కూడా మమతాబెనర్జీ ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంది. ఉపఎన్నికల్లో ఓట్లు చీలినందు వల్ల ఎక్కువ ప్రమాదం లేకపోయినా, అసెంబ్లీ ఎన్నికలు వచ్చినపుడు నష్టం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ముందు ముందు దీదీ ఆచితూచి అడుగులు వేయవలసి ఉంటుంది. రేటింగ్ అట్టడుగుకు చేరిన కాంగ్రెస్‌వల్ల తృణమూల్‌కు కలిగే ప్రయోజనమేదీ ఉండకపోవచ్చు. ఎన్నికల్లో పోటీ చేయకుండా ఓటర్లకు దూరం కావడం మంచిది కాదనే విషయం గ్రహించాలి. ఓటర్లకు అలా దూరమైతే పార్టీ పూర్తిగా అదృశ్యమయ్యే ప్రమాదంలో పడుతుంది. ●

# ఫ్చ్...మళ్లీ నిరాశే..!

దేశం — అమెరికా

**గన్ని మోహన్**

నోబెల్ శాంతి బహుమతి తనకు దక్కకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర నిరాశానిస్పృహలకు లోనయ్యారు. ఎనిమిది యుద్ధాలను నిలువరించానని, 50మిలియన్ ప్రజలు ప్రాణాలు కాపాడానని పదేపదే చెపుతూ వచ్చిన ట్రంప్ నోబెల్ శాంతి పురస్కారం అంటూవస్తే ఈప్రపంచంలో తనకంటూ ఎవ్వరూ అర్హులులేరని కూడా చెప్పుకున్నారు. గతఏడాది కూడా ఇలాగే నోబెల్ కమిటీపై తీవ్రఆగ్రహం వ్యక్తంచేసారు. ఒక ప్రాతిపదిక అంటూ ఏదీలేదా అంటూ తన అక్కసు వెళ్లగక్కారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరగకుండా అడ్డుకోవడం ద్వారా ఐదుకోట్ల మంది ప్రాణాలను కాపాడానని కూడా చెప్పుకున్నారు. అమెరికా అధ్యక్షుడిగా తనకు నోబెల్ శాంతి బహుమతి దక్కాల్సి ఉందని, అయితే అది జరగకపోవడం నార్వేకు, ఆ నిర్ణయం తీసుకున్న వారికి చెరగని మచ్చ అని ట్రంప్ పరుష వ్యాఖ్యలుచేసారు. ఈ పురస్కారం తనకు రాకపోవడంతో నోబెల్ శాంతి బహుమతి ఎంపిక ప్రక్రియ విశ్వసనీయతను కోల్పోయిందని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉండే కొందరు తీవ్రవాదభావజాలం కలిగిన వ్యక్తుల కారణంగా ఈ పురస్కారం తన ప్రతిష్ఠను కోల్పోయిందని చేసిన ఆరోపణలు ఆయనలోని అక్కసును బయటపెట్టాయి. బహుమతి ఇవ్వని విషయాన్ని అమెరికా మర్చిపోదని నార్వేను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి దక్షిణాఫ్రికాకు చెందిన, ఐక్యరాజ్యసమితి మాజీ మానవ హక్కుల ఉన్నతాధికారిణి నవి పిళ్లేను వరించిన సంగతి తెలిసిందే. ఈ ఎంపికపై ట్రంప్ మరింత అసంతృప్తి వ్యక్తం చేశారు. అవార్డు గ్రహీత గురించి తనకు ఇంతకుముందు తెలియదని వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితిలో పనిచేసే ఓ ఉదారవాదవ్యక్తికి బహుమతి ఇచ్చారని, ఆమెగురించి ఎవరూ వినలేదని తాను కూడా వినలేదని ట్రంప్ పేర్కొంటూ, అయినప్పటికీ తన అభినందనలు అంటూ నోరుపారేసుకున్నారు. తాను పరిష్కరించినట్లు చెబుతున్న ఎనిమిది యుద్ధాల గురించి ప్రస్తావించిన ట్రంప్ ఇరాన్‌కు సంబంధించిన సంఘర్షణతో పాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్నిముగించేందుకు కూడా కృషి చేస్తున్నానని చెప్పడం చూస్తుంటే అసలు నోబెల్ తనకు రాకుండా వేరొకరికి వెళ్లే ప్రసక్తేలేదన్న ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతియుద్ధానికి ఒక్కో నోబెల్ బహుమతి చొప్పున మొత్తం ఎనిమిది బహుమతులు రావాల్సి ఉందని అన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా అడ్డుకున్నానని, తద్వారా మధ్యప్రాచ్యంతో పాటు యూరప్, అమెరికా వరకు విస్తరించే ప్రమాదాన్ని నివారించానని ట్రంప్ చెప్పుకున్నారు. చరిత్రలో మరెవరూ కాపాడనంత మంది ప్రాణాలను తాను కాపాడానని పేర్కొన్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని నివారించడం లోనూ తన పాత్రఉందని ట్రంప్ మరోసారి చెప్పుకున్నారు. తాను పరిష్కరించిన యుద్ధాల సంఖ్య, కాపాడిన ప్రాణాలగురించి



ట్రంప్

ఆయన చేసిన వ్యాఖ్యలు స్వయంగా ఆయన చేసినవాదనలు మాత్రమే. నోబెల్ శాంతి బహుమతి తనకు దక్కకపోవడంపై ట్రంప్ గతంలోనూ పలుమార్లు అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు 2009లో, ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన తొలిఏడాదిలోనే ఈపురస్కారం లభించడంపై ట్రంప్ తరచూ విమర్శలు గుప్పించారు. అమెరికా అధ్యక్షుల్లో థియోడర్ రూజ్‌వెల్ట్, వుడ్రో విల్సన్, జిమ్మీ కార్టర్, బరాక్ ఒబామా నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారు. ఒబామాకు ఈ గౌరవం దక్కడం ట్రంప్‌కు ప్రత్యేకంగా అసంతృప్తి కలిగించిన అంశంగా నిలిచింది. తన దృష్టిలో పెద్దగా సాధించకపోయినా ఒబామాకు ఈ పురస్కారం లభించిందని ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. గత ఏడాదే డొనాల్డ్ ట్రంప్‌నకు శాంతిపురస్కారం ఇవ్వాలంటూ ఏడుదేశాల అధ్యక్షులు ప్రధానమంత్రులు తమ దేశం తరపున ఎండార్స్‌మెంట్లు కూడా ఇచ్చారు. అర్మేనియా, అజర్‌బైజాన్, కాంబోడియా, గాబన్, రువాండా దేశాలతోపాటు పాకిస్థాన్, ఇజ్రాయెల్ దేశాలు కూడా ఉన్నాయి. ప్రధానంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, పాక్‌ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు శాంతిపురస్కారానికి ట్రంప్ అన్నివిధాలా అర్హులు అనిపదేపదే చెప్పుకుంటూ వచ్చారు. అయితే ట్రంప్ ఆశించినట్లు ఎనిమిది సార్లు కాదు కదా కనీసం ఒక్కసారి కూడా ఆయన్ను 'శాంతి' పురస్కారం వరించలేదు. ఇకపై నోబెల్ కమిటీ, నార్వే పని పడతామని కూడా ట్రంప్‌చెప్పడం చూస్తుంటే బెదిరించో, భయపెట్టో కూడా ఈ పురస్కారం దక్కించుకోఎ లన్న బలమైన ధృఢ సంకల్పం ఆయనలో గూడుకట్టుకుని ఉన్నట్లు స్పష్టం అవుతోంది. ఈసారి శాంతి పురస్కారానికి 286 నామినేషన్లు వెళ్లాయి. అయితే వీరిలో ట్రంప్ పేరుకూడా లేకపోలేదు. కానీ ఈసారి భారతీయ మూలా లున్న దక్షిణాఫ్రికా మహిళకు రావడం ట్రంప్ జీర్ణించుకోలేకుండా ఉన్నారు. నిజానికి అందిన నామినేషన్లన్నింటినీ 50 ఏళ్లపాటు నోబెల్ కమిటీ భద్రపరుస్తుంది. ప్రతిఏటా జనవరి 31వ తేదీ డెడ్‌లైన్ ఉంటుంది. ఆ తర్వాత పరిశీలనచేసి ఫిబ్రవరి కల్లా నోబెల్ కమిటీకి జాబితా ఇస్తారు. ముందు 30మందితో కూడిన జాబితా వెళుతుంది. అనేక తర్జనభర్జనల తర్వాత నోబెల్ కమిటీ ఒక్కోసారి ఇద్దరిపేర్లను కూడా సిఫారసు చేస్తుంది. ఒక్కోసారి ఏకాభిప్రా యంలేదా మెజార్టీ ఓటింగ్‌తోను ఈ పురస్కారం ఎంపిక అవుతుంది. అక్టోబరునాటికి శాంతిపుర స్కార గ్రహీతను ఎంపిక చేస్తారు. ప్రతి ఏటా డిసెంబరు10వ తేదీ నోబెల్ వ్యవస్థాపకుడు ఆల్ ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజున నార్వేలోని ఓస్లోలో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ట్రంప్‌నకు తెలియంది కాదు. అయినాసరే తనకే రావాలని మారాంచేస్తు వస్తుండటచూస్తే అయితే తనకే రావాలి మరెవ్వరికీ వెళ్లడానికి వీలులేదన్నధోరణి ట్రంప్‌లో కనిపిస్తోందన్న వాదనకు ట్రంప్ వ్యాఖ్యలు మరింత బలం చేకూరుస్తున్నాయి. ●

# సమాజంలో లింగ వివక్షత ఆటవికం

**సుంకవల్లి సత్తిరాజు**

పూర్వ కాలంలో కొనసాగిన లింగ వివక్షత ఆధునిక యుగంలో కూడా ఇంకా కొనసాగడం అనాగరికం. బాలికల విషయంలో ఒకప్పుడు విధించబడిన నిర్బంధాలు నేడు పెద్దగా లేకపోయినా, ఇంకా కొన్ని దేశాలు ఆడపిల్లల చదువు విషయంలోను, వారి హక్కుల విషయంలోను కఠినంగా ప్రవర్తించడం దారుణం. నేటి బాలికలే రేపటి జగతిని శాసించే మగువలుగా అభివర్ణించడంలో అతిశయోక్తిలేదు. పువ్వు పుట్టగానే పరిమళించునన్న చందంగా ఇప్పటితరం బాలల్లో చిన్న వయసులోనే తెలివితేటలు అధికంగా ఉంటున్నాయి. వర్తమానంలో బాలికలు చదువుల్లో బాగా రాణిస్తున్నారు. అయితే ఆర్థిక, సామాజిక పరిస్థితుల వలన బాలికలు పలు విషయాల్లో వెనుకంజ వేస్తున్నారు. 5-14 సంవత్సరాల మధ్యగల బాలికల్లో అధికశాతం మంది ఇంటి పనులకే పరిమితమైపోతున్నారు. ప్రపంచంలో పలు చోట్ల బాలికలు వేధింపులు, లైంగిక హింసకు బలైపోతున్నారు. తినడానికి సరైన తిండి లేక, ఆర్థిక స్థితిగతులు సరిగా లేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. పాకిస్థాన్‌కు చెందిన మలాలా యూజఫ్ జాయ్ ఉగ్రవాదుల బెదిరింపులకు సైతం లొంగక పాక్‌లో బాలికల విద్య కోసం విశేషంగా కృషి చేసి బాల్యదశలోనే నోబెల్ బహుమతి పొంది, చరిత్రకెక్కిన విషయం గమనార్హం. ఆడపిల్లల ప్రగతికి కృషిచేసిన వారిలో చాలామందే ఉన్నారు. ఆఫ్ఘన్‌లో తాలిబాన్లు బాలికల విషయంలో దుర్మార్గంగా ప్రవర్తించిన సంగతి మరచిపోలేము. ఇరాన్‌లో కూడా బాలికల పట్ల తీవ్రమైన వివక్ష కొనసాగుతున్నది. ఈ కారణంగానే అయతుల్లా ఖొమైనీ హత్య తదనంతరం పలువురు మహిళలు, బాలికలు వీధుల్లోకి వచ్చి తమ ఆనందం వ్యక్తం చేసారు. పలు మత ఛాందస వాద దేశాల్లో బాలికలపట్ల కొనసాగుతున్న హింసను అరికట్టడంలో ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ సమాజం ఘోరవైఫల్యం చెందడం ఆందోళనకరం. విద్య, వైద్య, ఆరోగ్య సంబంధిత విషయాల్లో అడుగడుగునా బాలికల పట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టి, బాలికల పట్ల సానుకూల దృక్పథం ప్రదర్శించడానికి ప్రతీ ఏటా అక్టోబర్ 11వ తేదీన 'అంతర్జాతీయ బాలికల దినోత్సవం' (గర్ల్ చైల్డ్ డే) జరుగుతున్నది. తల్లిదండ్రుల, పెద్దల సహకారంతో బాలికలు నిర్మాణాత్మక పంథాలో పయనించడానికి, సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా జీవించడానికి వివిధరకాల దోపిడీల నుండి కాపాడబడడానికి, ఇతరులతో సమానంగా, మరింత ఉన్నతంగా జీవించడానికి తగినఏర్పాట్లు చేయడం, ఈ విషయంలో బాలికలకు అవగాహన కలిగించడం బాలికా దినోత్సవ ప్రధాన లక్ష్యం. ఇప్పటికే వివిధ రకాల పథకాల ద్వారా బాలికల స్థితిగతులను మెరుగుపరచడం జరుగుతున్నది. కొన్ని దేశాలు మినహా దాదాపు ప్రపంచ వ్యాప్తంగా బాలికా విద్యకు అనుకూలత లభిస్తున్నది. ఆడపిల్లల అక్షరాస్యత విషయంలో ఇంకా పురోగతి సాధించాలి. సమాజంలో బాలికలకు ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించి, లింగ సమానత్వం సాధించడంతో మరింత కృషి జరగాలి. బాలురతో పాటు, బాలికలకు కూడా సమాన విద్యావకాశాలను అందించడంతో కొంత వరకు బాలికల పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఇటీవల భారత ప్రభుత్వం ఆడపిల్లల వివాహ వయోపరిమితిని 18 నుంచి 21 సంవత్సరాలకు పెంచడం జరిగింది. అయితే దీనికి చట్టబద్ధత రావాలి. ఆడవారి వివాహ వయోపరిమితి పెంచడం వలన వారు వివాహాల చెరనుండి విముక్తి పొంది ఉన్నత విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు పొందడానికి వీలు కలుగుతుంది. ఇదే సందర్భంలో ఎన్నికల్లో పోటీ చేసే వయసును కూడా తగ్గించాలి. ఏది ఏమైనప్పటికి బాలికల తల్లిదండ్రుల్లోను, సమాజంలోను బాలికల అభివృద్ధి పట్ల సరైన అవగాహన కలగాలి. లేకపోతే ఎన్నిచట్టాలు తెచ్చినా, ఎన్ని సంస్కరణలు చేపట్టినా ఫలితం శూన్యం. సమానత్వం జన్మతఃప్రాప్తించిన సహజ సిద్ధమైన ప్రాథమిక హక్కు. ఇది ఎవరూ కాదనలేని సత్యం. అయితే సమాజం ఏర్పాటు చేసుకున్న కట్టుబాట్లు, నియమ నిబంధనలు, కుల, మత పరమైన విశ్వాసాలు, అనాదిగా పాటిస్తున్న ఆచార వ్యవహారాలు, ఆధిపత్య భావ



జాలం వంటి అంశాలు లింగ వివక్షతకు బీజంవేసాయి. స్త్రీ, పురుషుల్లో నెలకొన్న సహజ సిద్ధమైన మానసిక, శారీరక పరిణామాలను ఆసరాగా తీసుకుని, ఆధిపత్యం చెలాయించాలనే ఆరాటం తలెత్తడం, నాటికాలంలో నెలకొన్న సామాజిక రుగ్మతలు, కట్టుకథలు స్త్రీని మానసికంగా హింసించి, అబలగా చిత్రీకరించి, కేవలం వంటింటికే పరిమితం చేసేందుకు దోహదపడ్డాయి. మూఢవిశ్వాసాలు, నిరక్షరాస్యత ఆడపిల్లల పాలిట శాపంలా తయారైన నేపథ్యంలో భారతదేశంలోని పలువురు సంఘసంస్కర్తలు తమ ఉద్యమాల ద్వారా, ప్రసంగాల ద్వారా, రచనల ద్వారా స్త్రీ స్వేచ్ఛకు ఊపిరి పోయడానికి శతవిధాలా ప్రయత్నించి, కొంతమేరకు సఫలీకృతులైనారు. బెంగాల్‌కు చెందిన రాజా రామ్మోహన్ రాయ్ సతీసహగమన దురాచారంపై పోరాడి, వితంతు వివాహాలను ప్రోత్సాహించాడు. బాలికల విద్య కోసం విశేష కృషి చేసాడు. రాజా రామ్మోహన్ రాయ్ అభ్యుదయ భావాలు బ్రహ్మ సమాజానికే కాకుండా, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పునాది వేసాయి. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ స్త్రీల జీవన స్థితిగతులను మెరుగు పరచడానికి విశేష కృషిచేసారు. బహు భార్యత్వానికి వ్యతిరేకంగా, వితంతు వివాహాలకు, బాలికల విద్యకు అనుకూలంగా ఉద్యమించారు. జ్యోతి రావు ఫూలే, సావిత్రి భాయ్ ఫూలే 19వ శతాబ్ధంలో బాలికల విద్య కోసం నిర్విరామ కృషి చేయడం జరిగింది. స్వామి వివేకానంద శిష్యురాలు సోదరి నివేదిత వివేకానంద ప్రేరణతో ఐర్లాండ్ నుంచి భారత దేశానికి వచ్చి బాలికల విద్య కోసం ఎంతగానో పాటు పడింది. గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం ద్వారా సామాజిక పరివర్తనకు ప్రయత్నించాడు. కందుకూరి వీరేశలింగం స్త్రీ విద్య కోసం, చిన్న వయసులోనే భర్తలను కోల్పోయి, వితంతువులుగా మారిన బాలికల కోసం వితంతు వివాహాలను ప్రోత్సాహించారు. ఇలా ఎంతో మంది మహనీయులు, సంఘసంస్కర్తలు అణగద్రొక్క బడుతున్న ఆడజాతికి పురుషులతో పాటు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించడానికి ఇతోధిక సహాయం చేసారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పట్లో ఎన్టీరామారావు ప్రభుత్వం మహిళలకు తండ్రి ఆస్తిలో సమాన వాటా కల్పించింది. మహిళలకు రిజర్వేషన్ల విషయంలోను, సమాజంలో వారికి తగిన గౌరవం కల్పించడంలోను ఎన్టీరామారావు చూపిన చొరవ అభినందనీయం. పెరిగిన అక్షరాస్యత వలన, ఉన్నత చదువులవలన ఆడవారిని గౌరవించే సంస్కృతి కూడా పెరిగింది. అయినప్పటికీ ఇంకా పలుచోట్ల అర్థం లేని చాంధస భావాలు బాలికలను విద్యావకాశాలకు, అభివృద్ధికి దూరం చేయడం సిగ్గుచేటు. ఆధునిక కాలంలో కూడా పాతకాలపు భావజాలం కొనసాగడం అవాంఛనీయం. గతంలో సమాజంలో అక్షరాస్యత లేక, మంచి చెడుల విచక్షణ తెలియక మూర్ఖంగా ప్రవర్తించే పరిస్థితులుండేవి. ఒకవైపు కన్యాశుల్కం, మరోవైపు బాలికలపై లైంగిక హింస, బాల్య వివాహాలు ఒకటేమిటి ఎన్నో దురాచారాలకు బాలికలను బలితీసుకునే నాటి కాలం నాటి పరిస్థితులు వర్తమానంలో పెద్దగా అగుపించకపోయినాఇంకా పలు రుగ్మతలు ఆడపిల్లల వికాసానికి ప్రతిబంధకాలుగా తయారైనాయి. వరకట్న సమస్య ఇంకా కొనసాగుతూనే ఉంది. బాలికలు చదువుకోవడానికి అనువైన పూర్తిస్థాయి వాతావరణం ఇంకా ఏర్పడలేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి విద్య ఏదోలా పూర్తిచేసినా, కళాశాల విద్య ఆడపిల్లలకు గగన కుసుమంలా మారింది. ఆర్థిక అవాంతరాలు దాటి, చదువుకోవాలన్నా ఆడపిల్లలను భయాందోళనలకు గురి చేసే అనేక సంఘటనలు నేటి వ్యవస్థలో కొనసాగుతున్నాయి. బాలికలపై లైంగిక హింస అప్రతిహతంగా కొనసాగుతున్నది. బాలికలను వేధించి, మానసికంగా, శారీరకంగా హింసించి, హతమార్చడం వంటి దుష్కృత్యాలు కొనసాగడం అత్యంత దారుణం. మానసిక పరిపక్వత లేని వయసులో కొనసాగే ప్రేమాయణాలు నిండు నూరేళ్ళ జీవితాలను బుగ్గి పాలు చేస్తున్నాయి. ఇకనైనా ఈ అనైతిక స్వప్న జగత్తులో జీవించడం మాని, మానసిక వికాసంతో, వ్యక్తిత్వ వికాసంతో అభివృద్ధికి బాటలు వేసుకోవాలి. బాలికలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి. ●

# భారీ భూకంపంతో వణికిన పనామా

**7.7 తీవ్రతతో ప్రకంపనలు**

**కూలిన భవనాలు, రహదారులు మూసివేత**

**సునామీ హెచ్చరిక జారీ చేసి ఉపసంహరణ**





**పనామాసిటీ, అక్టోబరు 10:** మధ్య అమెరికా దేశమైన పనామాలో శుక్రవారం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 7.7 తీవ్రత నమోదైంది. భూకంప ధాటికి దేశంలోని పలు ప్రాంతాల్లో భవనాలు, రహదారులు కూలిపోయాయి. తక్షణమే ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం అందలేదు. దేశవ్యాప్తంగా సుమారు 45 లక్షల మంది ప్రజలు ఈ భూకంప ప్రకంపనలను చవిచూసినట్లు జాతీయ పౌరరక్షణ వ్యవస్థ వెల్లడించింది. దాదాపు ఒక నిమిషంపాటు భూమి కంపించినట్లు తెలిపింది. భూకంప కేంద్రానికి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న పనామా నగరంలో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి, ఆకాశహర్మ్యాల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంపం తర్వాత వచ్చిన ప్రకంపనల నేపథ్యంలో తాను నివసిస్తున్న 15 అంతస్తుల భవనం నుంచి రెండోసారి బయటకు వచ్చినట్లు 46 ఏళ్ల సాలమన్ ఆండియన్ తెలిపారు."భూమి చాలా బలంగా, ఎక్కువసేపు కంపించడంతో భయమేసింది. బీరువాలు, మంచం, వంటగదిలోని వస్తువులు సైతం ఊగిపోయాయి అని ఆయన ఏఎఫ్‌పీ వార్తా సంస్థకు వివరించారు. 20 అంతస్తులకు పైగా ఉన్న ఓ భవనం పైకప్పుపై ఉన్న స్విమ్మింగ్ పూల్ నుంచి నీరు కిందకు పారుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించాయి. పనామా కాలువపై ఉన్న ఓ వంతెన వాహనాలు వెళ్తుండగానే తీవ్రంగా కంపించినప్పటికీ కూలిపోకుండా నిలిచినట్లు మరో వీడియోలో కనిపించింది. పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టరమనం ఒక భారీ విపత్తును ఎదుర్కొంటున్నాం. కొన్ని రహదారులు పూర్తిగా కూలిపోయాయి" అని పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తెలిపారు. దేశంలోని మధ్య ప్రాంతమైన కోక్లే ప్రావిన్స్‌లోని పెనోనోమే నగరంలో భూకంప తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఇంతకుముందెన్నడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదు. భయంకరంగా ఉంది. నా కుమార్తె పాఠశాలలో చిక్కుకుపోయిందని అక్కడి ఓ దుకాణంలో క్యాషియర్‌గా పనిచేస్తున్న 38 ఏళ్ల జువానా అల్వియో ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా భూగర్భ సర్వే సంస్థ ప్రకారం, గ్రీన్‌విచ్ కాలమానం ప్రకారం శుక్రవారం 17:56 గంటలకు భూకంపం సంభవించింది. మధ్య ప్రాంతంలోని హెరేరా ప్రావిన్స్‌లో పిటాలోజా అర్రిబా పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. తొలుత తీవ్రత 8.0గా అంచనా వేసిన యూఎస్‌జీఎస్ అనంతరం దాన్ని 7.7గా సవరించింది. తూర్పు పసిఫిక్ సముద్ర ప్రాంతానికి సునామీ హెచ్చరిక జారీ చేసినప్పటికీ, తర్వాత దాన్ని ఉపసంహరించారు. పసిఫిక్, అట్లాంటిక్ మహాసముద్రాలను కలిపే పనామా కాలువలో నౌకల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదని, కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయని కాలువ అధికారులు వెల్లడించారు. విపత్తు సహాయక చర్యలను సమన్వయం చేసేందుకు అధ్యక్షుడు ములినో పెనోనోమేకు వెళ్లారు. హెరేరా, కోక్లే, ఆగ్నేయ ప్రాంతంలోని లాస్ శాంటోస్ ప్రావిన్సులు అత్యధికంగా ప్రభావితమైనట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఫెర్నాండో బోయిడ్ తెలిపారు. లాస్ శాంటోస్‌లోని టోనోసీ పట్టణానికి భూకంపం కారణంగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని ఆయన చెప్పారు. భూమార్గంలో అక్కడికి చేరుకోవడం అసాధ్యం. విమాన మార్గంలో ఎలా చేరుకోవాలో ప్రయత్నిస్తున్నామని వివరించారు. ప్రాంతీయంగా కీలకమైన పనామా నగర అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ముందు జాగ్రత్త చర్యగా పలు విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించినట్లు పౌర విమానయాన సంస్థ తెలిపింది. కొలంబియా, ఈక్వెడార్, గ్వాటెమాలా దేశాధినేతలు పనామాకు సంఘీభావం ప్రకటించడంతో పాటు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. పనామాలో సాధారణంగా భూకంపాలు అరుదుగా సంభవిస్తుంటాయి. కోస్టారికా సరిహద్దులోని పశ్చిమ చిరికీ ప్రావిన్స్‌లో ఎక్కువగా భూకంపాలు నమోదవుతుంటాయి. మాజీ అధ్యక్షుడు రికార్డో మార్టినెల్లి వెరాగ్వాస్ ప్రావిన్స్‌లోని సోనా పట్టణంలో తన ఇల్లు కూలిపోయిన దృశ్యాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. పెనోనోమేలోని ఓ చర్చి, హోటల్ కూడా తీవ్రంగా దెబ్బతిన్నట్లు స్థానిక మీడియా ప్రచురించిన చిత్రాలు వెల్లడించాయి. స్థానిక సీస్మోలజీ కేంద్రం 808 పైగా అనంతర ప్రకంపనలను నమోదు చేసింది. వీటిలో ఒకటి 6.0కు పైగా తీవ్రతతో నమోదైంది. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని అధ్యక్షుడు ములినో ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. జరిగిన ఘటనను ఉపయోగించుకొని ప్రజల్లో భయాందోళనలు, గందరగోళం సృష్టించకూడదని పేర్కొన్నారు. నష్టంపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పాఠశాలల్లో తరగతులను నిలిపివేస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది.



## 8 యుద్ధాలను ఆపాను.. 8 నోబెల్ ప్రైజులివ్వాలి

**నాకు 'శాంతి' ఇవ్వకుండా నోబెల్ కమిటీ తప్పు చేసింది..**

**నవీ పిళ్లై పేరే వినలేదు: ట్రంప్ అసహనం**

**వాషింగ్టన్, అక్టోబరు 10:** ఈ ఏడాది కూడా తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సిరాక్యూస్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడిన ఆయన.. నోబెల్ కమిటీని, నార్వేని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. తాను ఇప్పటివరకు ఎనిమిది యుద్ధాలను ఆపానని, పరిష్కరించిన ప్రతి యుద్ధానికి ఒక నోబెల్ బహుమతి చొప్పున తనకు మొత్తం ఎనిమిదిసార్లు నోబెల్ పురస్కారం రావాల్సిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి దక్షిణాఫ్రికాకు చెందిన ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మాజీ కమిషనర్ నవీపిళ్లైకి దక్కిన నేపథ్యంలో ట్రంప్‌లో అసహనం పెరిగిపోయింది. అమెరికా అధ్యక్షుడిగా తాను నోబెల్ శాంతి బహుమతి పొందాల్సింది తానే ఇవ్వలేదని, ఇది నార్వేకు శాశ్వత మచ్చ అని విమర్శించారు. నోబెల్ ఎవరికి ఇవ్వాలనే విషయంలో నిర్ణయం తీసుకున్న వ్యక్తులు అమెరికాను ద్వేషించే వారని ట్రంప్ మండిపడ్డారు. నోబెల్ కమిటీని 'రాడికల్ ఐడియాలజిస్టులు, ప్రజాస్వామ్య వ్యతిరేకులు'గా ఆయన అభివర్ణించారు. పురస్కార గ్రహీత నవీ పిళ్లైని ఉద్దేశిస్తూ ఆమె పేరు తాను ఎప్పుడూ వినలేదని, యుఎన్‌లో పనిచేసే ఒక లిబరల్ వ్యక్తికి బహుమతి ఇచ్చారని విమర్శించారు. ఆమె మాట ఎవరూ వినరని అంటూనే, అయినా అధినేతలను తెలియజేస్తున్నారని వ్యంగ్యంగా అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎనిమిది యుద్ధాలను ఆపానని ట్రంప్ చెప్పుకొచ్చారు. భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధం జరగకుండా నివారించి సుమారు 5కోట్లమంది ప్రాణాలను కాపాడానని వ్యాఖ్యానించారు. అలాగే ఇరాన్ అణుబాంబు సంపాదించకుండా అడ్డుకున్నానని, తద్వారా పశ్చిమాసియా, యూరప్, అమెరికాకు పెను ప్రమాదాన్ని తప్పించానని ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలను కూడా త్వరలో ముగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గతంలో నలుగురు అమెరికా అధ్యక్షులు థియోడర్‌రూజ్‌వెల్ట్, వుడ్రోవిల్సన్, జిమ్మీ కార్టర్, బరాక్ ఒబామాలకు నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. ఒబామా అధ్యక్షుడిగా తొలి యేడాదిలోనే పురస్కారాన్ని పొందడాన్ని ట్రంప్ తరచూ విమర్శిస్తూ ఆయనకు ఏమీ చేయకుండానే బహుమతి ఇచ్చారని వ్యాఖ్యానించడం గమనార్హం.

## ఎనిమిదోసారి ప్రధాని మోడీ బహుమతుల వేలం

**ఎపికి చెందినవే 18వరకూ ఉన్నాయి..**



**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** ప్రధాని నరేంద్ర మోడీ వివిధ పర్యటనల సందర్భంగా అందుకున్న బహుమతులు, జ్ఞాపికలను కేంద్ర ప్రభుత్వం మరోసారి వేలానికి ఉంచింది. ఈసారి వేలంలో ఏపీకి చెందిన 18 ప్రత్యేక బహుమతులు కూడా ఉండటం విశేషం. ఈ వేలం ద్వారా సమీ కరించిన నిధులను గంగానది ప్రక్షాళన కోసం చేపట్టిన ప్రతిష్ఠాత్మక నమామి గంగే కార్యక్రమానికి విరాళంగా ఇవ్వనున్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఈ వేలం ప్రక్రియను నిర్వహిస్తోంది. ప్రధాని మోడీ తన ఏపీ పర్యటనల సమయంలో పలువురు ప్ర ముఖులు, సంస్థల నుంచి ఎన్నో కానుకలు స్వీ కరించారు. వీటిలో ప్రధాని ఫొటోతో రూపొందించిన ప్రత్యేకమైన కలంకారీ వస్త్రం, శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తికేంద్రం అందించిన జ్ఞాపిక, గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే కళాఖండం, తెలుగు సంస్కృతికి ప్రతీకగా నిలిచే కొండపల్లి ఎద్దులబండి బొమ్మ వంటివిఉన్నాయి. ఈ బహు మతులను దక్కించుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేయవచ్చు. ఇది పీఎం మెమెంటోస్ 8వ విడత వేలంకాగా, ప్రజల నుంచి వస్తున్న స్పందన దృష్ట్యా గడువును అక్టోబరు 31వరకు పొడిగించారు. ఈ వేలంలో దేశవి దేశాల నుంచి అందిన సుమారు 30రకాల జ్ఞాపికలున్నాయి. వీటిలో కొన్నింటికి భారీ ధర పలుకుతోంది. తెలంగాణకు చెందిన కాకతీయ కళాతోరణం వెండి నమూనా ప్రాథమిక ధరను రూ.10 లక్షలుగా నిర్ణయించారు. అలాగే, జగన్నాథ పరివార రథం ప్రతిమ బేస్ ప్రైస్ రూ.21లక్షలు కాగా, కర్ణాటకకు చెందిన శ్రీరాముడి వెండి విగ్రహానికి రూ.13.50 లక్షల ప్రాథమిక ధరఉంది. వీటితో పాటు వివిధ ఆలయాలు, చారిత్రక ప్రదేశాల నమూనాలు, సంప్రదాయ చేతివృత్తుల కళారూపాలు, చిత్రాలు, పెయింటింగులు, విగ్రహాలు, శాలువాలు వంటి ఎన్నోఅమూల్యమైన వస్తు వులు ఈ వేలంలో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్న వారు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ పీఎం మెమొంటోస్ డాట్‌జీవోవి డాట్ ఇన్ ద్వారా తమకు నచ్చిన వస్తువుపై బిడ్‌వేసి దక్కించుకోవచ్చని సాంస్కృతికశాఖ అధికారులు తెలిపారు.

## కేఫ్‌లో రాహుల్, సిఎం విజయ్‌ల సుదీర్ఘ భేటీ



**చెన్నై, అక్టోబరు 10:** తమిళనాడు రాజకీయాల్లో శనివారం ఓ ఆసక్తికరమైన సన్నివేశం ఆవిష్కృతమైంది. క్యాపిచినో, టిరమిసు, కుకీస్ వీటికి రాజకీయ చర్చలు తోడైతే ఆ వాతావరణం ఎలా ఉంటుందో చెన్నై నగరం ప్రత్యక్షంగా వీక్షించింది. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ మధ్య జరిగిన ఈ భేటీ, ఇరు నేతల మధ్య బలపడుతున్న స్నేహ బంధానికి, రాజకీయ సమన్వయానికి అద్దం పట్టింది. శనివారం ఉదయం చెన్నై శివార్లలోని నీలంకరైలో గల తన నివాసానికి విచ్చేసిన రాహుల్ గాంధీకి సీఎం విజయ్ సాదర స్వాగతం పలికారు. ఇరువురు నేతలు సుమారు గంటపాటు సమావేశమై సమకాలీన రాజకీయ పరిణామాలపై చర్చించారు. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, వారి మధ్య నెలకొన్న స్నేహపూర్వక వాతావరణం అందరి దృష్టినీ ఆకర్షించింది. తూర్పు తీర రహదారి వెంట ప్రశాంతంగా ఉండే నీలంకరై ప్రాంతంలో ప్రారంభమైన ఈ భేటీ, అనంతరం సమీపంలోని ఒక కేఫ్‌కు మారింది. అక్కడ ఇద్దరు నేతలు క్యాపిచినో, టిరమిసు, కుకీలు ఆస్వాదిస్తూ సాధారణ రాజకీయ సమావేశాలకు భిన్నమైన వాతావరణంలో గడిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో కేఫ్ వద్దకు చేరుకున్నారు. రాహుల్, విజయ్ వారితో సరదాగా ముచ్చటించి సెల్ఫీలు దిగారు. వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కేఫ్ నుంచి నిష్క్రమించిన అనంతరం రాహుల్ గాంధీ నగరంలోని ఓ హోటల్‌కు చేరుకున్నారు. యువత కోసంఉద్దేశించిన ఛాత్రోన్‌కీ గూంజ్ తాజా ఎడిషన్‌లో పాల్గొనేందుకు ఆయన చెన్నై పర్యటనకు వచ్చారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు వ్యాప్తం గాలక్షమందికి పైగావిద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## ఉప ఎన్నికల్లో గెలిచినా మెజార్టీ మార్కుకు దూరంగానే...

**తమిళనాడు సిఎం విజయ్ సర్కారుపై అంచనాలు**

**చెన్నై, అక్టోబరు 10:** తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఉపఎన్నికల్లో ఊరట లభించింది. ధారాపురం, మధురాంతకం అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉపఎన్నికల్లో టీవీకే అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ గెలుపుతో 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో టీవీకే బలం 107 నుంచి 109కి పెరిగింది. అయితే, ప్రభుత్వం నిలబడటానికి అవసరమైన సాధారణ మెజారిటీ మార్కు 118కి ఇంకా 9 స్థానాల దూరంలోనే ఉంది. దీంతో విజయ్ సర్కార్ స్థిరత్వానికి కాంగ్రెస్‌పార్టీ మద్దతు కీలకంగా కొనసాగుతోంది. గతంలో అన్నాడీఎంకే తరఫున గెలిచిన మరగతం కుమారవేల్ (మధురాంతకం), పి.సత్యభామ (ధారాపురం) తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. తాజాగా జరిగిన ఉపఎన్నికల్లో వీరే టీవీకే గుర్తు విజిల్‌పై పోటీ చేసి మళ్లీ గెలిచారు. మధురాంతకంలో మరగతం కుమారవేల్ సమీప డీఎంకే అభ్యర్థిపై 20,040 ఓట్ల మెజారిటీతో గెలవగా, ధారాపురంలో సత్యభామ 9,471 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఈ రెండు చోట్లా అధికార కూటమికి ప్రధాన ప్రత్యర్థిగా భావించిన ఏఐఏడీఎంకే మూడో స్థానానికి పరిమితం కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లతో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. సీఎం విజయ్ రెండు స్థానాల్లో గెలిచి, ఒకదానికి రాజీనామా చేయడంతో పార్టీ బలం 107కి తగ్గింది. ప్రస్తుతం కాంగ్రెస్ (5), వీసీకే, ఐయూఎంఎల్, వామపక్షాల మద్దతుతో టీవీకే మైనారిటీ ప్రభుత్వాన్ని నడుపుతోంది. కోర్టు కేసుల కారణంగా మరో ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆ ఐదింటినీ టీవీకే గెలుచుకున్నా, పార్టీ బలం 114కు మాత్రమే చేరుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మనుగడకు మిత్రపక్షాల మద్దతు, ముఖ్యంగా కాంగ్రెస్ సహకారం తప్పనిసరి. ఈ ఉపఎన్నికల ఫలితాలపై నేతలు భిన్నంగా స్పందించారు. ఇది సీఎం విజయ్ నాలుగు నెలల పాలనకు ప్రజలు ఇచ్చిన సర్టిఫికెట్ అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మాణికం ఠాగోర్ వ్యాఖ్యానించారు. అయితే, ఇది ద్రోహంతో సాధించిన తాత్కాలిక విజయమని డీఎంకే అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ విమర్శించారు. డబ్బుబలానికి, వ్యక్తిగత విమర్శలకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదని సీఎం విజయ్ పేర్కొన్నారు. తాజా విజయాలతో టీవీకే బలం పెరిగినప్పటికీ, ప్రభుత్వ స్థిరత్వం మాత్రం మిత్రపక్షాలతో సత్సంబంధాలపైనే ఆధారపడి ఉంది.

## మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ ఇతర విపక్ష ఎంపిల అరెస్టులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** రాజధాని ఢిల్లీలో శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, దోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు.

## ఢిల్లీలో అప్రకటిత 'ఎమర్జెన్సీ': శశిథరూర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. శనివారం ఢిల్లీలో కాక్‌రోచ్ జనతాపార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనను అడ్డుకునేందుకు విధించిన కఠినమైన భద్రతా ఆంక్షలను ఆయన తప్పుబట్టారు. ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులు అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నాయని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వ్యాఖ్యానించారు. తాను తెల్లవారుజామున 2 గంటలకు ఢిల్లీకి తిరిగి వచ్చానని, ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ చూడలేదని థరూర్ పేర్కొన్నారు. కొన్ని వందల మీటర్లకే చెక్‌పోస్టులు, రోడ్లపై కాంక్రీట్ బారికేడ్లు, స్పైక్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. నగరం అంతటా 22,000 మంది పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించడం యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోందన్నారు. సుమారు 250 రైళ్లు రద్దు కావడం, 45 మెట్రో స్టేషన్లు మూసి వేయడం, రాజధాని నడిబొడ్డున ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం వంటి చర్యలు తిరోగమనానికి సంకేతమని విమర్శించారు.

## ఎన్ని వేలమందినైనా పెట్టుకోండి..

**మేం చుట్టుముడుతూనే ఉంటాం: రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దశాబ్దకాలంగా తాను మోడీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. మోడీ గారూ మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడచిన 10-15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.





## సిజెపి ఆందోళనతో రాష్ట్రాలను అలర్ట్ చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** రాజధాని నగరంలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసన నేపథ్యంలో కేంద్ర హోం శాఖ అప్రమత్తమైంది. దేశ రాజధానికి నిరసనకారులు చేరుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఢిల్లీ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించింది. అనుమతి లేకుండా ఢిల్లీలోకి ప్రవేశించే ప్రయత్నాలను అడ్డుకోవాలని స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ శనివారం జంతర్‌మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో ఈ ఆందోళన చేపట్టాలని నిర్ణయించింది. ఈ నిరసనకు అనుమతి నిరాకరించినట్లు కేంద్ర హోం శాఖ తన లేఖలో పేర్కొంది. అయినప్పటికీ వివిధ రాష్ట్రాల నుంచి సీజేపీ మద్దతుదారులు ఢిల్లీకి చేరుకునే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించినట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు ఉన్నతాధికారులకు కేంద్ర హోంశాఖ ఈ మేరకు లేఖ రాసింది. రాష్ట్రాల నిఘా విభాగాలు, సరిహద్దు అధికారులు, రవాణా విభాగాలు, ఢిల్లీ పోలీసుల మధ్య నిరంతరం సమాచార మార్పిడి జరగాలని సూచించింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చట్ట పరిధిలో తక్షణ నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. నిరసన పేరుతో గతంలో జరిగిన కార్యక్రమాల్లో సీజేపీ మద్దతుదారులు అధికారుల ఆదేశాలను ఉల్లంఘించినట్లు హోం శాఖ ఆరోపించింది. వివిధ రాష్ట్రాల నుంచి ఢిల్లీకి వచ్చిన ఆందోళనకారుల కారణంగా గతంలో ప్రజా జీవనానికి అంతరాయం కలిగిందని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లిందని లేఖలో పేర్కొంది. ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేసింది. 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా కేంద్ర హోంశాఖ ప్రస్తావించింది. నిరసనల కోసం నిర్దేశించిన ప్రాంతాల్లో సభలు, సమావేశాల నిర్వహణకుసంబంధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపింది. శాంతి భద్రతల పరిరక్షణ, చట్టాల అమలు అధికారుల బాధ్యతని స్పష్టం చేసింది. మరోవైపు, నిరసన నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. భద్రతా ఏర్పాట్ల కారణంగా పలు రైళ్లను రద్దుచేశారు. దీంతో శనివారం వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. కొందరు చివరి నిమిషంలో తమ ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాల్సి వచ్చింది.

## అజింక్య షిండే పర్యవేక్షణలో సిజెపి నిరసనలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేతో పాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉద్యమ బాధ్యతలు అజింక్య షిండే చేతికి వచ్చాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ చేపట్టిన నిరసనలను ఇకపై ఆయనే నడిపించనున్నారు. మహారాష్ట్రకు చెందిన షిండే. దిప్కేకు అత్యంత సన్నిహితుడు. తనను, సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను పోలీసులు అరెస్టు చేస్తే ఉద్యమాన్ని షిండే ముందుకు తీసుకెళ్తారని దిప్కే ఓ వీడియోలో ప్రకటించారు. ఆయన సూచనల మేరకు షిండే నిరసన కారులకు పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్ చేరుకోవాలని, పోలీసులు ఎక్కడ అడ్డుకున్నా అక్కడే నిరసన కొనసాగించాలని కోరారు. తమ ఐక్యతను చూసి ప్రభుత్వం భయపడుతోందని వ్యాఖ్యానించారు. మహారాష్ట్రకు చెందిన అజింక్య షిండే వయసు 35 ఏళ్లు. కంప్యూటర్ సైన్స్‌లో పట్టా పొందిన ఆయన పుణెలోని ఓ అంతర్జాతీయ ఐటీ సంస్థలో పనిచేశారు. ఆ తర్వాత ఉద్యోగాన్ని వదిలి ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్)లో పూర్తిస్థాయి కార్యకర్తగా చేరారు. ఆయన తల్లిదండ్రులు తొలుత అలీబాగ్‌లో వ్యవసాయంచేసేవారని, తర్వాత లాతూర్‌కు వెళ్లి స్థిరపడ్డారని కథనాల ద్వారా తెలుస్తోంది.

# సంక్షిప్త వార్తలు

## భారతీయ సిబ్బంది ఉన్న చమురు ట్యాంకర్‌పై డ్రోన్ దాడి



**షార్జా, అక్టోబరు 10:** షార్జా తీరంలో పనామాకు చెందిన ఒక క్రూడాయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో నౌకలో ఉన్న 22 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. ఎంటి జిఇఎం నెం.2 అనే చమురు ట్యాంకర్ యుఎఇ, షార్జా తీరంలో లంగరువేసే ప్రాంతంలో ఉంది. ఈ నౌకలో 22 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. ఈ నెల 9న ఈ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. అయితే, ఈ దాడి ఘటనలో 22 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా ఉన్నారు.

## మిస్సిసాగా నగర మేయర్‌గా ఎపి మూలాలున్న దీపికా దామెర్ల పోటీ



**టొరంటో, అక్టోబరు 10:** కెనడాలోని మిస్సిసాగా నగర మేయర్ పదవికి జరుగుతున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ మూలాలున్న దీపికా దామెర్ల తన ప్రచారంతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆమె ఎంచుకున్న మార్గం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రముఖ హిందీ సినిమాపాటను తన ఎన్నికల హామీకి అనుగుణంగా మార్చి పాడి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. క్యా హువా తేరా వాదా అనే ఎవర్‌గ్రీన్‌బాలీవుడ్ పాటకు కొత్త సాహిత్యం జోడించి, తాను మేయర్‌గా గెలిస్తే ఆస్తి పన్నులు పెంచ బోనని దీపిక హామీ ఇచ్చారు.

## సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ధృవ్‌రాఠీ అరెస్టు

**బెంగళూరు, అక్టోబరు 10:** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనకు సిద్ధమవుతున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు ఈ మేరకు అరెస్ట్ చేసినట్లు కాక్రోచ్ జనతా పార్టీ ఖాతాలో పేర్కొంది. ఆయనను అదుపులోకి తీసుకోవడానికి గల కారణాలపై స్పష్టత లేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సీజేపీ జంతర్‌మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాఠీ సిద్ధమయ్యారు.

## ఎలాన్‌మస్క్ వ్యాఖ్యలకు కమల్‌హాసన్ కౌంటర్



**చెన్నై, అక్టోబరు 10:** టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలపై ప్రముఖ సినీనటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ తీవ్రంగా స్పందించారు. దేశవిధానాలను ఏ బిలియనీర్ నిర్దేశించలేరని స్పష్టంచేశారు. కమల్ వ్యాఖ్యలకు నటి, ఎంపీ కంగనా రనౌత్ మద్దతు తెలిపారు. భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు లైసెన్సింగ్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ఎలాన్‌మస్క్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, భారత ప్రధాని అం బానీనా?అంటూ సెటైరిక్‌గా ట్వీట్ చేశారు. దీనిపై కమల్‌హాసన్ దీటుగా బదులిచ్చారు. ఏ బిలి యనీర్ అయినా, అది భారతీయుడయినా, అమెరికన్ అయినా దేశ విధానాలను నిర్దేశించలేరు. ప్రతి దేశం తన సొంత ప్రయో జనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుంది' అని ఆయన పేర్కొన్నారు.

## ఐసిసి ఒక రోగ్ కోర్టు: మార్కో రూబియో



**వాషింగ్టన్, అక్టోబరు 10:** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం శుక్రవారం విస్తృత ఆంక్షలు విధించింది. అమెరికాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలతో ఈచర్యలు చేపట్టింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కోరూబియో వీడియో సందేశం ద్వారా ఆంక్షలను ప్రకటించారు. ఐసీసీని ఆయన రోగ్ కోర్టు (బాధ్యతారహిత న్యాయస్థానం)గా అభివర్ణించారు. ఐసీసీ రాజకీయ ప్రభావాలకు లోనైందని, యుద్ధ నేరాల విష యంలో ఇజ్రాయెల్ పౌరులు, అమెరికన్లపై చట్ట విరుద్ధంగా, అన్యాయంగా విచారణ జరిపేందుకు ప్రయత్నిస్తోందని అమెరికా ఆరోపించింది.

## సిజెపి నిరసనకారులున్న బస్సుపై రాళ్లు..

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసన కార్యక్రమం ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళనకారులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలో అరెస్ట్ చేసిన నిరసనకారులను తరలిస్తున్న బస్సుపై జన్‌దేవాలన్ ప్రాంతంలో కొందరు రాళ్లదాడికి పాల్పడటం కలకలంరేపింది. అధికారులు తెలిపిన వివరాలప్రకారం, అదుపులోకి తీసుకున్న కొందరు కార్యకర్తలను పోలీసులు బస్సులో తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

# నిమ్స్‌లో ఉచితంగా రూ.5 లక్షల ఖరీదైన వెన్నెముక శస్త్రచికిత్స

## అత్యాధునిక ఎండోస్కోపిక్ విధానంలో సంక్లిష్ట సమస్యలకు చెక్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 10,ప్రభాతవార్త:** నడకను ప్రభావితం చేస్తూ, తీవ్రస్థాయికి చేరితే పక్షవాతానికి దారితీసే సంక్లిష్ట వెన్నెముక సమస్యలకు నిమ్స్‌లో అత్యాధునిక ఎండోస్కోపిక్ శస్త్రచికిత్సల ద్వారా చికిత్స అందిస్తున్నారు. చిన్న కోతలతో నిర్వహించే ఈ విధానం ద్వారా వెన్నుపాముపై ఒత్తిడిని తగ్గించి, కండరాలకు తక్కువ నష్టం కలిగేలా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. దీంతో రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని నిమ్స్ వైద్యులు తెలిపారు. న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా. యెర్రమనేని వంశీకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మరియం అఫీఫా నేతృత్వంలోని వైద్య బృందం ఈ చికిత్సలను అందిస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ తరహా సంక్లిష్ట శస్త్రచికిత్సలకు సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుండగా, నిమ్స్‌లో అర్హులైన రోగులు ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా చికిత్స పొందవచ్చని వెల్లడించారు. బీహెచ్ఈఎల్, రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సన్‌షైన్ విరాళంగా అందించిన అత్యాధునిక పరికరాలతో ప్రభుత్వ వైద్యరంగంలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.

# రాజ్యాంగ రక్షణలతో గిరిజన హక్కుల పరిరక్షణ

## మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** రాజ్యాంగపరమైన రక్షణలతో గిరిజనుల హక్కులు, భూములను, జీవనోపాధి అవకాశాలను, గిరిజనుల సంస్కృతి గుర్తింపు వంటి కీలక అంశాలను కాపాడేందుకు ప్రభుత్వాలు, న్యాయ సంస్థలు, పౌర సమాజం, గిరిజన నాయకత్వం సమన్వయంతో కూడిన కార్యాచరణను రూపొందిచాల్సి అవసరం ఉందని మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు తెలుగు రాష్ట్రాల్లోని షెడ్యూల్డ్ తెగల రాజ్యాంగ భద్రతలపై రౌండ్ టేబుల్ సమావేశం శనివారం హైదరాబాద్ లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో సెస్ డైరెక్టర్ డాక్టర్ ఇ.రేవతి అధ్యక్షతన జరిగింది.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన గిరిజన హక్కుల కార్యకర్తలు, న్యాయ నిపుణులు, గిరిజన నాయకులు, మాజీ అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణలో గిరిజనుల భూమి అన్యాక్రాంతం, జీవనోపాధి అభద్రతను ఆయన వివరించి ఖచ్చితమైన పరిష్కారాలకు పిలుపునిచ్చారు. గిర్గ్లానీ కమీషన్ నివేదిక,2005లో ఏర్పాటైన కోనేరు రంగారావు ల్యాండ్ కమిటీ సిఫార్సుల ఆధారంగా గిరిజన హక్కులను బలోపేతం చేసే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారు.గిరిజన హక్కుల కార్యకర్త,ప్రాముఖ్యతను న్యాయవాది డాక్టర్ పల్లా త్రినాధరావు మాట్లా డుతూ 1970 రెగ్యులేషన్ 1 ద్వారా సవరించబడిన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్, 1959 యొక్క రాజ్యాంగ, చారిత్రక విశిష్టత వివరించారు. ఏకలవ్య ఫౌండేషన్‌కు చెందిన పి. వేణుగోపాల్‌రెడ్డి, ఎం. భరత్‌భూషణ్, లక్ష్మణ్ రావు, ఆధార్ సొసైటీకి చెం దిన జి. వెంకటరమణ. గిరిజననాయకులు, మాజీ అధికారులు పాల్గొన్నారు.

# అపోలో మెడికల్ కాలేజీ యుజి, పిజి వైద్య విద్యార్థులకు డా. బి.సోమరాజుచే పట్టాలు ప్రదానం

## 97 మందికి ఎంబిబిఎస్, 44 మందికి ఎండి, ఎంఎస్ డిగ్రీలు అందజేత

**హైదారబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్, హైదరాబాద్ (ఎఐఎంఎస్ఆర్) అండర్ గ్రాడ్యుయేట్ బ్యాచ్ 2020, పోస్ట్ గ్రాడ్యుయేట్ బ్యాచ్ 2022 విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ వేడుకను జూబ్లీహిల్స్‌లోని డా. బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, భవనం వెంకట్రాం ఆడిటోరియంలో ఘనంగా నిర్వ హిం చారు. ముఖ్యఅతిథిగా పద్మశ్రీ డాక్టర్ బి.సోమరాజు, ప్రఖ్యాత కార్డి యాల జిస్ట్, కేర్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, సింధు హాస్పిటల్స్ కార్డియాలజీ కన్సల్టెంట్, మెంటార్ డైరెక్టర్ హాజరయ్యారు. డీన్ డాక్టర్ కె. మనోహర్ విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు, ఎఐఎంఎస్ఆర్ సిఒఒ అపర్ణారెడ్డి సభకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 97 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 44 మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్లు డిగ్రీలను అందుకున్నారు. 2012లో ప్రారంభమైనప్పటి నుండి అపోలో మెడికల్ కాలేజ్, హైదరా బాద్ నుండి 700 మందికిపైగా విద్యార్థులు పట్టభద్రులయ్యారు. కళాశాల పూర్వ విద్యార్థుల్లో 90కంటే ఎక్కువ మంది దేశంలోని వివిధ వైద్యకళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు, విదేశాల్లో రెసిడెన్సీ ప్రోగ్రామ్‌లను పొందారు. ప్రతిష్టాత్మక ఛైర్మన్ మెడల్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి గోల్డ్ మెడల్ ఉత్తమ ఎంబిబిఎస్ విద్యార్థిగా 2020 బ్యాచ్‌కి చెందిన మాయాదేవి కొచ్చెర్ల, ఉత్తమ పిజి విద్యార్థిగా జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన డా.సముద్రాల కావ్యకు ప్రదానం చేశారు.




గాంధీభవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

# ఎమర్జెన్సీలో ఇందిర కంటే.. మోడీ వ్యవహార శైలి ఘోరం

## ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదారబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** ఎమర్జెన్సీ లో ఇందిరాగాంధీని అప్రతిష్ఠ పాలు చేశారని మోడీ ఇప్పుడు ఎమర్జెన్సీ కంటే ఘోరంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు ఆరోపించారు. గాంధీభవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో నాలుగు రోజులు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నాయకత్వంలో ఉద్యమాలు చేస్తున్నా కేంద్రం స్పందించకపోగా పోలీసులతో అణిచివేతకు పాల్పడుతోందని విమర్శించారు. దేశంలో 13 కోట్ల ఓట్ల ను రద్దు చేసారని ఎన్నికల కమిషనర్ ను కలవాలని పోతే కలవలేదనీ ఆయన తెలిపారు.ఎంపి లను కక్రోచ్ జనతా దళ్ పార్టీ నాయకులను అరెస్ట్ చేసి గుర్తుతెలియని ప్రాంతాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు.రైళ్లలో పోతున్న వారిని కూడా అరెస్ట్ చేస్తున్నారనీ ఆవేదన చెందారు. మోడీ నాలుగోసారి గెలవడానికి నాటకాలు చేస్తున్నారనీ ఆరోపించారు..ఓట్ల తొలగింపు సవరణ చేయమంటే అరెస్టులు చేస్తున్నారనీ, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారి ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇంత నియంత పాలన ఎక్కడా చూడలేదనీ ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ను ఇసికి తొలగించే హక్కులేదని అన్నారు.రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లు రోడ్ల మీదకు వచ్చి కొట్లాడుతున్నారనీ ప్రజలు వారి ఓటు కోసం పోరాటం చేస్తున్న కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వాలనీ కోరారు.ఎన్టీఆర్ బిసి కోసం పని చేసారనీ, చంద్రబాబునాయుడు బిసిలకు అన్యాయం చేస్తున్నారనీ అన్నారు. కేంద్రంలో మీ పార్టీ మద్దతుతోనే మోడీ ప్రభుత్వం నడుస్తుందనీబిసి లకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు బాబు కృషి చేయాలనీ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వంద రోజులు బిసి ఉద్యమం నడుస్తుందనీ ఒబిసి ఉద్యమాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్ళుతం వచ్చే తరాల కోసం బిసిలు ప్రాణ త్యాగాలు చేసి అయిన రిజర్వేషన్లు సాధిం చాలి, ఢిల్లీలో మోడీ తలుపులు తట్టాలి అని పిలుపునిచ్చారు.

# తెలంగాణ ఆడబిడ్డల అనాది పండుగ బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్, జి.వి.వెన్నెల, వాణీదేవి తదితర రవీంద్రభారతి మహిళా సిబ్బంది

## సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 10, ప్రభాతవార్త :** బతుకమ్మ పండుగనేది తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆలోచనా విధానాలు, అందరూ కలిసిమెలిసుండే ఆత్మీయ తకు ప్రతీకగా ప్రకృతిని ఆరాధిస్తూ భక్తిశ్రద్ధలతో పూజించే అనాదిగా వస్తున్న తెలంగాణ ఆడబిడ్డల పండుగ బతుకమ్మ అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

బతుకమ్మ పండు గంటే మన బతు కును తీర్చిదిద్దే అమ్మని, ఈ రెండింటినీ కలిసి ఆత్మీయంగా బతు కమ్మ ఆరాధిస్తున్నామని చెప్పా రు. వర్షాకాలం ముగిశాక చెరువులు, గుంటలు నీళ్లతో కళకళలా డుతుంటే ఈ ప్రకృతిలో పూసే రకరకాల రంగు రంగుల పూలను ఒకచోట అందం గా తీర్చిదిద్దితూ మన కుటుంబాలు కళా కాంతులు విరిసిల్లేలా కాపాడుకుంటూ మహి ళలు ఆర్థికంగా బలోపేతమై సాధికారత సాధించాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టరు డా. ఏనుగు నరసిం హారెడ్డి నేతృత్వంలో జరుగుతున్న బతుకమ్మ సంబురాల తొలిరోజు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు, విశిష్ట అతిథులు మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ సాంస్కృతిక సారథి అధ్యక్షురాలు డా. జి.వి.వెన్నల, సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి బతుకమ్మ సంబరాలను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. మహిళలను గౌరవించుకోవడం, పూజించుకోవడం వంటి మన గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను, సంఘటిత శక్తిని భావితరాలకు అందిస్తూ, యావత్ ప్రపంచానికి చాటిచెప్పే మహోన్నత పండుగ బతుకమ్మ అన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బతుకమ్మగా గౌరీమాతను రంగురంగుల పూలతో అలంకరించుకుని కోలాహలంగాసాగే బతుకమ్మ ఆటాపాటలు మహిళలకు శక్తినిచ్చే పండుగని, ప్రజలందరికీ పర్యావరణాన్ని కాపాడుకోవాలని సందేశాన్నిచ్చే సంబరాలని అభివర్ణించారు. ఈ వేడుకలకు దేశంలో ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించి బతుకమ్మ పండుగ గొప్పదనాన్ని జాతీయ అంతర్జాతీయంగా చాటిచెప్పాలని పొన్నం సూచించారు. అనంతరం డా. జి.వి. వెన్నెల రవీంద్రభారతి మహిళా సిబ్బంది, విచ్చేసిన చిన్నా రులు, మహిళాప్రేక్షకులతో కలిసి బతుకమ్మలు ఆటాపాటలతో హోరెత్తించారు.

# రాష్ట్రానికి రూ.5 వేల కోట్ల రుణం

## మౌలిక సదుపాయాల పెంపుదల ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం

**హైదారబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పట్టణ మౌలిక సదు పాయాల ప్రాజెక్టుల కోసం జర్మన్ అభివృద్ధి బ్యాంకు కెఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ. 5,000 కోట్ల బాహ్య సహాయం పొందేందుకు తెలంగాణ చేసిన ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారవర్గాలు శనివారం వెల్లడించిన వివరాలు ప్రకారం మురుగునీటి పారుదల, నీటి సరఫరా, వర్షపునీటి నిర్వహణ మరియు ఇతర మౌలిక సదుపాయాలను కవర్ చేసే రూ. 7,143 కోట్ల కార్యక్రమమైన తెలంగాణ వాతావరణ స్థితిస్థాపక పట్టణ పరివర్తన కార్యక్రమంలో ఈ నిధులు ఒక భాగంగా ఉంటాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక వ్యవహారాల విభాగం పరిధిలోని స్క్రీనింగ్ కమిటీ ఈ ప్రతిపాదనను ఆమోదించింది. మిగిలిన రూ.2,143 కోట్లను తెలంగాణ ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ కార్యక్రమంలో అతిపెద్ద భాగం గ్రేటర్ వరంగల్ సమగ్ర మురుగునీటి, వ్యర్థజల నిర్వహణ పరివర్తన ప్రాజెక్ట్, దీని కోసం రూ. 5,257 కోట్లు ప్రతిపాదించబడ్డాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతం అంతటా మురుగునీటి కనెక్షన్లను విస్తరించడం, వ్యర్థజల శుద్ధి సౌకర్యాలను ఉన్నతీకరించడం మరియు శుద్ధి చేసిన వ్యర్థజలాల పునర్వినియోగాన్ని ప్రోత్సహించడం దీని లక్ష్యంగా అధికారవర్గాలు వెల్లడించాయి.

దీనికి గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నోడల్ మంత్రిత్వ శాఖగా వ్యవహరించగా, తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి, దాని లక్ష్యాలు, ప్రాధాన్యతా పెట్టుబడులు, అమలు చట్రాన్ని వివరిస్తూ ఈ ప్రతిపాదనను ఆర్థిక వ్యవహారాల విభాగానికి సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెట్టుబడులను పట్టణ పరిపాలన సంస్కరణలతో అనుసంధానించాలని సిఫార్సు చేస్తూ, గృహ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్ ఈ ప్రతిపాదనకు మద్దతు తెలిపాయి. రుణ ఒప్పందంపై సంతకం చేయడానికి ముందు, ప్రాజెక్టుల వారీగా వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేసి, సాంకేతిక మూల్యాంకనం కోసం సమర్పిం చాలని కూడా గృహ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సూచనలను అంగీకరించింది.

# ఎంఎస్‌ఎంఇల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఎల్‌యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

## సమస్యల పరిష్కారానికి నెలకోసారి గ్రీవెన్స్ డే

## నగరంలోని పారిశ్రామికవాడల అభివృద్ధికి చర్యలు

## ఎల్‌యుబి ఎంఎస్‌ఎంఇ సౌత్ ఇండియా సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహాపరిశ్రమల (ఎంఎస్ ఎంఈ)ను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ విశ్వవ్యాప్తమయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు, పెట్టుబడుల అనుసంధానం తదితర అంశాల్లో ఎంఎస్ఎంఇలకు మార్గనిర్దేశం చేస్తామన్నారు. లఘు ఉద్యోగ్ భారతి (తెలంగాణ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఒక హోటల్‌లో నిర్వహించిన 'ఎల్‌యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్'ను ఆయన లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లా డుతూ.. ఎంఎస్ఎంఇలు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తూ పారిశ్రామికాభి వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

దేశంలోనే తొలిసారిగా ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. క్షేత్రస్థాయిలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు చూపించేందుకు నెలకోసారి ప్రత్యేకంగా గ్రీవెన్స్‌డే ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామ న్నా రు. హైదరాబాద్తో పాటు శివారు ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడల అభివృద్ధికి చర్యలు తీసుకుం టున్నామన్నారు. తెలంగాణ ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మారుతున్న మార్కెట్ అవ సరాలకు అనుగుణంగా నాణ్యత, సాంకేతికత, నైపు ణ్యాభివృద్ధి, ఉత్పత్తి సామర్థం పెంపుపై ఎం ఎస్ఎంఈలు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ ఎండీ రామ్మోహన్ రావు, లఘు ఉద్యోగ్ భారతి(తెలంగాణ) ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్ దత్, ఓం అనూజ్ ఖదేల్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ గుర్తింపు సంఘంగా ఇయు

## కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

## 17న తుది ఫలితాల ప్రకటన

**హైదారాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భంగపాటు ఎదురైంది. పార్టీ అనుబంధ యూనియన్‌ను కాదని మద్దతు పలికిన టీడబ్ల్యూయూకు ఎదురుదెబ్బ తగిలింది. ఆర్టీసీ గుర్తింపు సంఘంగా ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) కూటమి ఘన విజయం సాధించింది. దాదాపు పదేండ్ల తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో ఏఐటీయూసీ మద్దతునిచ్చిన ఎంప్లాయీస్ యూనియన్ (బస్సు గుర్తు) రాష్ట్రస్థాయి గుర్తింపు సంఘంగా అవతరించింది. ప్రత్యర్థి కూటమిపై దాదాపు 6 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందింది.

రాష్ట్రవ్యాప్తంగా 93 డిపోల్లో జరిగిన పోలింగ్ 98 శాతం మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈనెల 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌లో 980 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అనంతరం, ఈనెల 17న తుది ఎన్నికల ఫలితా లను అధికారికంగా ప్రకటిస్తారు. కాగా, ఈ ఎన్నికల్లో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎమ్‌యు), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎమ్‌యు) ఒక కూటమిగా బరిలో నిలిస్తే, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూయు), స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) మరో కూటమిగా పోటీ చేశాయి. ఇక జిల్లాల్లో టీడబ్ల్యూయూ కూటమి పైచేయి సాధిస్తే, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈయూ వియం సాధించింది.

గ్రేటర్ జోన్ హైదరాబాద్ సికింద్రాబాద్ రీజియన్‌లో 26 బస్ డిపోలు ఉండగా 23 స్థానాల్లో ఈయూ, మూడు చోట్ల టీడబ్ల్యూయూ ముందంజలో నిలిచాయి. అలాగే కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉండగా, కరీంనగర్1, హుజూరాబాద్, సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, గోదావరిఖని, మంథనిల్లో టీఎంయూ విజయం సాధించింది. కరీంనగర్2, మెట్‌పల్లి, హుస్నాబాద్ డిపోల్లో కాంగ్రెస్ కూటమి గెలుపొందింది. జోనల్ వర్క్‌షాప్‌తో పాటు, ఆర్ఎం కార్యాలయంలో టీడబ్ల్యూయూ విజయం సాధించింది.

# నవంబరు 19 నుండి రైతు బీమా

## ఇందిరాగాంధీ జయంతినాడు ప్రారంభం

## ఇప్పటికే పెండింగ్‌లో 2,597 పాత దరఖాస్తులు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణ రైతు కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచిన రైతు బీమా నిలిచిపోవడంతో అన్నదాతలు ఆందోళనలోఉన్న నేపథ్యంలో ఇందిరమ్మ బీమా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బిగ్ అప్ డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి నవంబరు 19న రూ.5 లక్షల బీమా పథకం ఇందిరమ్మ బీమాను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురాబోతున్నట్లు తెలిపింది. మరోపక్క నెలల తరబడి ఈ పథకం నిలిచిపోవడంతో బీమా పరిహారం రాక మృతి చెందిన రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దరఖాస్తులు చేసుకుని నెలల తరబడి అయినా వాటికి దిక్కుమొక్కు లే కుండా పోయా యి. రాష్ట్ర ప్రభు త్వం గత నెలలో రైతు బీమా పథ కాన్ని నిలిపి వేసినప్పటికీ, అంతకు ముందు రైతుల కుటుంబాలు దాఖలు చేసిన వేలాది క్లెయిమ్ దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి.

రైతు బీమీ పథకాన్ని నిలిపివేసే సమయానికి ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీకి ముందు వచ్చిన వేల దరఖాస్తులు పరిష్కారానికి నోచు కోకుండా ఉండిపోయాయి. ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా రైతు బీమాకు సంబంధించి 2,587 దరఖస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 413 దరఖాస్తులను వివిధ కారణాలు చూపుతూ తిరస్కరించింది. కాగా రైతు బీమా పథకం కింద, రైతులు మరణించిన పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం వారికి రూ.5 లక్షల బీమా కవరేజీని అందిస్తుంది. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం దాదాపు రూ. 1,350 కోట్ల ప్రీమియం చెల్లిస్తోంది. జీవిత బీమా సంస్థకు ప్రీమియం చెల్లించడానికి ఈ ఏడాది ఆగస్టు 14. చివరి తేదీ, అయినా రైతులకు భీమా కవరేజీని విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించకుండా నిలిపివేసింది. అయితే అంతకు ముందు వరకూ బీమా దరఖాస్తులకు మాత్రం పరిహారం ఇవ్వడం జరుగుతుందని ప్రకటించింది. కానీ వాటిని ఇప్పటి వరకూ పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచినట్లు పలు రైతు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఇదే సమయంలో బీమా పథకాన్ని నిలిపివేయడంతో అగస్టు 14 తర్వాత మరణించిన రైతులకు పరిహారం రాక సంబంధిత కుటుంబాలు ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ పరిస్థితిలో తాజాగా రైతు బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటన పెద్ద ఊరట నిచ్చినట్లయింది.



శనివారం హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్ వేదికగా విజేతలకు అవార్డులు అందజేస్తున్న డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

# కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో క్రీడలకు పెద్దపీట

## గోల్ఫ్ అభివృద్ధికి 16 ఎకరాల భూకేటాయింపు

## ఎన్‌డిటివి ఆధ్వర్యంలో జరిగిన ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 10,ప్రభాతవార్త:** హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్ అభివృద్ధి ప్రభుత్వం 16 ఎకరాల భూమిని కేటాయించిందని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ప్రసిద్ధ హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్ వేదికగా జరిగిన ఇండియన్ గోల్డ్ ప్రీమియర్ లీగ్ అవార్డుల ప్రదానోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోల్ఫ్ క్రీడకు క్రీడాకారులకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతతో, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సహకారంతో భవిష్యత్తులో గుజరాత్ లోని మోదీ స్టేడియంను తలపించేలా అత్యుత్తమ స్టేడియాన్ని ఫ్యూచర్ సిటీలో నిర్మించనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా, ఇప్పటికే హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా గుర్తుచేశారు.క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వ పరంగా అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని వక్తలు హామీనిచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజేతలకు అవార్డులు ఇచ్చారు. గోల్ఫ్ క్రీడాకారులు, నిర్వాహకులు, స్పాన్సర్ ఈ ఈవెంట్ హైదరాబాద్ లో నిర్వహించి, విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫహీం ఖురేషి,ఎన్‌డిటివి సీఈఓ భాస్కర్ రెడ్డి, ఎడిటర్ రాహుల్ కృనాల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# జ్ఞానేశ్‌ను తొలగించి ఓటర్ల హక్కులకు రక్షణ కల్పించాలి: మంత్రి పొన్నం

**హైదరాబాద్,అక్టోబరు10,ప్రభాతవార్త:** ఢిల్లీలో ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయంటూ, ఓటర్ల జాబితాలో అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, విద్యార్థులను అడ్డుకోవడం, అరెస్టులు చేయడంపై రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఆ హక్కును కాలరాసే విధంగా వ్యవహరించడం సరికాదని అన్నారు.

ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని, మరోవైపు దొంగ ఓట్ల నమోదుకు అవకాశం కల్పిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం పారదర్శకంగా స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈ అంశాలపై స్పష్టత ఇవ్వాలని, ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు వస్తున్న వారిని అడ్డుకోవడం, విద్యార్థులను ఎక్కడికక్కడ నిర్బంధించడం, రవాణా మరియు ప్రజా సేవలకు సంబంధించి ఆంక్షలు విధిస్తున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇంటర్నెట్, రైళ్లు, బస్సులు, మెట్రో సేవల నిలిపివేతపై వస్తున్న సమాచారంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.

నిరసనలను ఎదుర్కోవడానికి నిర్బంధమే మార్గంగా భావించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఖాళీ చేసిన సీటు ఓడిపోయిన నుండి, కేంద్ర మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినప్పటి నుండి ఓటు దొంగతనం చేసినప్పటి నుండి బీజేపీ కి తిరోగమనం ప్రారంభమైంది. స్వతంత్రం కోసం ఎలా కొట్లాడారు ఈరోజు రాజ్యాంగాన్ని కాపాడడానికి యువత విద్యార్థులు పోరాడుతున్నారు. బిజెపి మెడలు వంచాల్సిందే ప్రజల అభిప్రాయానికి తల వంచి జ్ఞానేశ్వర్ కుమార్ ను తొలగించాలని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వంటి నాయకులపై పోలీసులు దాడులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం, నిరసనకారులను అరెస్టు చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయలేరని స్పష్టం చేశారు.నిరసనకారులను అడ్డుకునేందుకు బీజేపీ, సంఘ్ పరివార్‌కు చెందిన కార్యకర్తలను సమీకరిస్తున్నారన్న ఆరోపణలపైనా స్పష్టత ఇవ్వాలని మంత్రి డిమాండ్ చేశారు.

నిరసనకారులు, ఇతర వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు, ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శాంతియుత నిరసనలకు అవకాశం కల్పించకుండా ఉద్రిక్తతలకు దారితీసే పరిస్థితులు సృష్టించడం దేశ ప్రయోజనాలకు మంచిది కాదన్నారు.

గతంలో రైతులు తమ హక్కుల కోసం ఉద్యమించినప్పుడు వారిపై తీవ్ర విమర్శలు చేసి, ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నాలు జరిగాయని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు విద్యార్థులు, ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రశ్నిస్తుంటే వారిని నిర్బంధించడం సరికాదన్నారు. ప్రజల గొంతుకను వినడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు.

# రైతుల పట్ల ఇలాగేనా ప్రవర్తించేది..

## గజ్వేల్ ఎమ్మార్వోపై కెటిఆర్ ఆగ్రహం

**హైదరాబాద్, అక్టోబరు10, పభాతవార్త:** వ్యవసాయ భూమి సమస్యను పరిష్కరించాలని తన కార్యాలయానికి వచ్చిన ఓ రైతన్నను గజ్వేల్ ఎమ్మార్వో స్వామి నువ్వు ఇంకా బ్రతికే ఉన్నావా.. పురుగుల మందు తాగలేదా..? అని నవ్వుతూ మాట్లాడి హేళన చేసిన విషయం తెలిసిందే. సదరు రైతు నా పరిస్థితి చూస్తే మీకు నవ్వు వస్తుందా అని అడిగితే ఆ ఎమ్మార్వో అహంకారంగా అవును వస్తది బరాబర్ వస్తది అని సమాధానం చెబుతున్న వీడియో నెట్టింట రౌండప్ చేస్తోంది.ఈ వీడియోపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఓ బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న ఎమ్మార్వో అన్నదాతను అవహేళన చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మనకు అన్నం పెట్టే రైతుల పట్ల ఇలాగేనా ప్రవర్తించేది.. అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఒక తోటి మనిషి (రైతు) పట్ల ఆ అధికారి ప్రవర్తించిన తీరు చూస్తుంటే.. వారికి మానసిక సమతుల్యత లోపించిందని చెప్పక తప్పడం లేదు. రైతు పట్ల ఎమ్మార్వో వ్యవహరించిన తీరు అత్యంత సిగ్గు చేటు. ఏమాత్రం ఆమోదయోగ్యం కాని విషయ మన్నారు. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఓ రైతు ఒక సమస్య వల్ల తన వ్యవసాయ భూమి, తన బ్రతుకుతెరువును కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆశ్రయిస్తే ఎమ్మార్వో అవహేళనగా నవ్వుతూ మాట్లాడుతూ తహసీల్దార్ స్వామి వ్యవహరించిన తీరుపై తీవ్రవిమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మార్వో వ్యవహారంపై సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.




# రియాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో మళ్లీ దాడులు

**రియాద్, అక్టోబరు 10:** సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని విమానాశ్రయం దగ్గర మరోసారి భారీ శబ్దం వినిపించడంతో కలకలం నెలకొంది. ఈ ఘటన నేపథ్యంలో విమానాశ్రయంలో అప్రమత్తత ప్రకటించి, ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. కొన్ని విమానాలను ఇతర విమానాశ్రయాలకు దారి మళ్లించినట్లు తెలుస్తోంది. భారీ శబ్దం వినిపించడంతో విమానాశ్రయ అధికారులు, భద్రతా సిబ్బంది అప్రమత్తమైనట్లు సమాచారం. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వారిని అక్కడి నుంచి తరలించినట్లు నివేదికలు వెల్లడించాయి. విమానాల రాకపోకలపైనా ప్రభావం పడినట్లు తెలుస్తోంది. అయితే భారీ శబ్దం ఎందుకు వినిపించింది దాని వెనుక పేలుడు ఉందా లేక మరేదైనా కారణమా అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఘటనకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడైతేనే అసలు కారణం తెలిసే అవకాశం ఉంది. గత కొద్దిరోజులుగా సౌదీ లక్ష్యంగా హౌతీలు దాడులు చేస్తున్నారు. సౌదీ ఎదురు దాడి చేస్తున్నా.. హౌతీలు మాత్రం దూసుకొస్తున్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్‌అమెరికా యుద్ధంతో చమురు, గ్యాస్ సంక్షోభం కొనసాగుతుండగా ఇప్పుడు కొత్తగా సౌదీహౌతీల ఘర్షణతో ఏం తలనొప్పి రానుందోనని భయాందోళన చెందుతున్నారు.

# సింగరేణి కార్మికులకు దసరా అడ్వాన్స్ రూ.25వేలు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** సింగరేణి కార్మికులకు దసరా పండుగ అడ్వాన్స్ కింద రూ.25 వేల చొప్పున చెల్లిస్తున్నట్లు సంస్థ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది. ఈ నెల 15న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో ఈ డబ్బు జమ చేయనున్నట్టు తెలిపింది. అర్హులైన జాతీయ బొగ్గు వేతన ఒప్పందం (ఎన్సీడబ్ల్యూఏ) ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులకు రూ.25,000 అడ్వాన్స్ అందిస్తారు. అలాగా ట్రైనీలు / తాత్కాలిక ఉద్యోగులకు సంబంధించి కూడా స్పష్టత ఇచ్చింది.. పర్మనెంట్ కాని ట్రెయినీలు మరియు తాత్కాలిక కార్మికులకు రూ.12,500 అడ్వాన్స్ అందిస్తారు. ఈ అడ్వాన్స్ సొమ్మును 10 నెలల్లో తిరిగి కార్మికుల వేతనాల నుంచి రికవరీ చేస్తారు.

# గరుడ సేవకు భారీ ఏర్పాట్లు

## తిరుమలకు వాహనాల అనుమతి రద్దు

**తిరుమల,అక్టోబరు 10ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తిరు మల సిద్ధమైంది. ఇందులో భాగంగా బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు జరిగే ప్రధానమైన గరుడసేవకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలోనే తమిళభక్తులకు పవిత్రమైన పెరటాసి మాసం కూడా రావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా ఉంటుందని టిటిడి అధికారులు అం చనా వేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు 16వ తేదీ శుక్రవారం రాత్రికి జరిగే విశేషమైన గరుడ సేవకు నలుమూలల నుండి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. గరుడ సేవ జరిగే రోజు శుక్రవారం తిరుమల కొండపైకి ప్రైవేటు వాహనాలని పూర్తిగా రద్దు చేసింది.

## తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీ రద్దు

**తిరుమల,అక్టోబరు 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అశేషంగా భక్తులు తరలివస్తున్నందున సామాన్యభక్తులకు ఇబ్బంది లేకుండా ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో జారీచేసే టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లును టిటిడి రద్దుచేసింది. ఈ టోకెన్ల జారీని శనివారం నుండి నిలుపుదలచేశారు. ఈ కారణంగా తిరుపతిలో జారీ చేసే ఎస్ఎస్‌డి స్లాటెడ్ సర్వ దర్శనం, దివ్య దర్శనం ఆఫ్‌లైన్ టోకెన్ల జారీని టిటిడి ఈనెల 20వరకు రద్దు చేసింది. 19వతేదీ వరకు టోకెన్ల జారీ ఉండదు. అక్టోబర్ 20వ తేదీ అక్టోబర్ 21 దర్శనం కోసం తిరిగి టోకెన్లు జారీ చేయబడతాయి.




వివరాలను వెల్లడిస్తున్న గోల్కొండ ఏసిపి సయ్యద్ ఫయాజ్.

## టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో రేప్, పోక్సో, అనైతిక రవాణా నిరోధక చట్టం కేసు

### 8 మంది నిందితుల అరెస్ట్

**హైదరాబాద్ (మెహిదీపట్నం), అక్టోబరు 10, ప్రభాతవార్త :** రేప్ పోక్సో, ఐటీపీఏ కేసును 24 గంటల్లోనే ఛేదించి 8 మందిని అరెస్టు చేసిన సంఘటన టోలిచౌకి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గోల్కొండ ఏసిపి సయ్యద్ ఫయాజ్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత నెల 2న ఆతిఫ్ అనే వ్యక్తి ఒక బాలికను ఆటో (టీ ఎస్ 30 టీ 8350) లో టోలిచౌకి నుండి అపహరించి, పథకం ప్రకారం అత్తాపూర్ వద్దకు తీసుకెళ్లి సనా, సమ్రీన్ అనే ఇద్దరు మహిళలకు అప్పగించాడు. ఆ ఇద్దరు మహిళలు బాలికకు మంచి ఆహారం, వసతి కల్పిస్తామని నమ్మబలికి, బలవంతంగా అత్తాపూర్ పిల్లర్ నంబర్ 200 సమీపంలో వ్యభిచార గృహం నడుపుతున్న హాజీమియా భార్య సబియా బేగంకు అప్పగించి రూ.30వేలు తీసుకున్నారు. ఆ మొత్తాన్ని ఆతిఫ్, సనా, సమ్రీన్ పంచుకున్నారు. అనంతరం సబియా బేగం ఆ బాలికతో బలవంతంగా వ్యభిచారం చేయించడం ప్రారంభించింది. బాలిక తనను విడిచిపెట్టమని వేడుకోగా, ఆతిఫ్, సనా, సమ్రీన్ లు డబ్బులు తీసుకుని నిన్ను ఇక్కడకు పంపారని చెబుతూ పలువురితో వ్యభిచారం చేయించింది. మిగతా నిందితులు ఎండి. నదీమ్, ఎండి. కైఫుద్దీన్, అలీ బిన్ అక్రమ్ లు కస్టమర్లను తీసుకురావడం, లైంగిక వృత్తిలో ఉన్నవారికి వసతులు కల్పించడంలో సహకరించేవారు. అయితే ఈ నెల 5వ తేదీన తేదీ సదరు బాలిక ఆ వ్యభిచార గృహం నుండి ఎట్టకేలకు తప్పించుకుని ఇంటికి చేరుకుంది. కుటుంబ సభ్యులకు జరిగిన దారుణాన్ని వివరించడంతో వారు టోలిచౌకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు 8 మంది నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుల వద్ద నుండి 6 మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ఒక ఆటో ను స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ జోన్ డిసిపి జె. రాఘవేందర్ రెడ్డి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. టోలిచౌకి ఇన్‌స్పెక్టర్ ఎల్. రమేష్ నాయక్, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జి. బలరాజ్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్, సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి 24 గంటల్లోనే కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారు.

# హైదరాబాద్ నుంచి 3 హైస్పీడ్ ట్రైన్ మార్గాలు

## అలైన్‌మెంట్‌పై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, అశ్వినీవైష్ణవ్ భేటీ

**హైదరాబాద్,అక్టోబరు10,ప్రభాతవార్త:** తెలంగాణలో హైస్పీడ్ ట్రైన్ కారిడార్ల కోసం భూసేకరణపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె-ముంబయి హైస్పీడ్ రైలు కారిడార్లకు సంబంధించి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలకు భూసేకరణ ప్రతిపాదనలు పంపలేదని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మూడు మార్గాలకు సంబంధించిన అలైన్‌మెంట్లపై ప్రస్తుతం అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఢిల్లీలోని రైల్ భవన్‌లో రెండు రోజుల క్రితం కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా హైస్పీడ్ రైలు కారిడార్ల ప్రతిపాదనలు, అలైన్‌మెంట్ అధ్యయనాల పురోగతి, తెలంగాణలో రైతులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలపై చర్చించారు. సమావేశానికి సంబంధించిన వివరాలను కిషన్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే తమ అధికారిక ఎక్స్ ఖాతాల్లో వేర్వేరుగా వెల్లడించారు. హైస్పీడ్ ట్రైన్ మార్గాల కోసం తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో మార్కింగ్ పనులు చేపట్టడంతో రైతుల్లో ఆందోళన నెలకొందని కిషన్‌రెడ్డి రైల్వే మంత్రికి వివరించినట్లు తెలిపారు. భూములు కోల్పోతామనే భయంతో పలువురు రైతులు తనను కలిసి సమస్యలను వివరించారని పేర్కొన్నారు. ప్రాథమికంగా రూపొందించిన అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను కూడా చేర్చినప్పటికీ.. అనంతరం మార్పులు చోటుచేసుకున్నాయని, తమ ప్రాంతం మీదుగా కూడా హైస్పీడ్ రైలు నడపాలని కోరుతూ సూర్యాపేటకు చెందిన ప్రజలు తనను సంప్రదిస్తున్నారని వివరించారు.

మరోవైపు, భూసేకరణపై నెలకొన్న ఆందోళనలు క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయని కిషన్ రెడ్డి ప్రస్తావించారు. ఈ క్రమంలో ఓ పోలీసు అధికారిపై కారంపొడి చల్లిన ఘటన కూడా చోటుచేసుకున్నట్లు తెలిపారు. అలైన్‌మెంట్ ఖరారు కాకముందే భూముల గుర్తింపు, మార్కింగ్ ప్రక్రియపై స్పష్టత లేకపోవడం రైతుల్లో అనుమానాలకు కారణమవుతోందన్న అంశం ఈ సమావేశంలో ప్రాధాన్యం సంతరించుకుంది. మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల అలైన్‌మెంట్లపై అధ్యయనాలు కొనసాగుతున్నాయని, మార్గాలు ఖరారైన తర్వాతే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు, రైతులకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి స్పష్టం చేసినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం అధికారికంగా నిర్ణయం తీసుకోకముందే భూసేకరణ చేపడితే అది చట్టవిరుద్ధమవుతుందని తెలిపారు.

కాగా, హైస్పీడ్ రైలు కారిడార్లు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణె, ముంబయి వంటి ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్టులు అలైన్‌మెంట్ అధ్యయన దశలోనే ఉన్నందున.. తుది మార్గం, భూసేకరణ పరిధి, నిర్మాణ కాలపట్టికపై అధికారిక నిర్ణయాల కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

## కాంగ్రెస్ ఎంపి లైంగిక వేధింపులకు నిరసనగా

# బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో గాంధీభవన్ ముట్టడి

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పర్యటిస్తూ స్మాష్ ది పేట్రియార్కీ, మహిళా సాధికారత అంటూ కల్లబొల్లి నీతులు వల్లించే రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అసలు స్వరూపం మరోసారి బట్టబయలైందని బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఢిల్లీలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యూ)లో 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు తేలడంతో, ఆ పార్టీకి చెందిన ఇన్నర్ మణిపూర్ ఎంపి డా. అంగోమ్‌చా బిమోల్ అకోయిజంను అక్టోబర్ 9న జేఎన్‌యూ సర్వీస్ నుంచి డిస్మిస్ చేసిందని గుర్తుచేశారు. దాదాపు నాలుగు నెలల క్రితం బాధితులు ఫిర్యాదు చేసి, ఇంటర్నల్ కమిటీ విచారణలో లైంగిక వేధింపుల ఆరోపణలు రుజువై జేఎన్‌యూ కఠిన చర్యలు తీసుకుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆ ఎంపిపై ఇప్పటివరకు ఎలాంటి క్రిమినల్ లేదా క్రమశిక్షణా చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఈ దారుణానికి నిరసనగా డా. మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది మహిళా కార్యకర్తలు, నాయకురాళ్లు కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయం గాంధీ భవన్‌ను ముట్టడించారు. బాధిత విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు తగ్గేదే లేదని గళమెత్తిన మహిళలను కాంగ్రెస్ అనుకూల పోలీసు యంత్రాంగం దౌర్జన్యంగా అడ్డుకోవడం, అరెస్టులు చేయడాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. న్యాయం కోరి ప్రజా స్వామ్యబద్ధంగా గాంధీ భవన్‌కు వెళ్తే, అక్రమంగా నిర్బంధించి పోలీసుల చాటున దాక్కోవడం కాంగ్రెస్ పిరికితనానికి నిదర్శనమని ఫైరయ్యా రు. ఢిల్లీ వీధుల్లో నిరసనల పేరుతో స్వయంగా మహిళా పోలీసులపై చేయి చేసుకునే సంస్కృతి ఉన్న రాహుల్ గాంధీకి మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హతే లేదని శిల్పారెడ్డి మండిపడ్డారు. స్వయానా తమ పార్టీ ఎంపీ అమాయక విద్యార్థినుల జీవితాలతో చెలగాటమాడితే, ఆ ఎంపిపై కేవలం వేటు పడటం సరిపోదని, అతన్ని తక్షణమే పార్లమెంట్ సభ్యత్వంతో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి శాశ్వతంగా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయనపై తక్షణమే కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసే కాంగ్రెస్ డీఎన్ఏలోనే స్త్రీ గౌరవానికి తావులేదని, ఇలాంటి వరుస ఘటనలు ఆ పార్టీ అసలు నైజాన్ని నిరూపిస్తున్నాయని హెచ్చరించారు. బాధిత అమ్మాయిలకు న్యాయం జరిగేంత వరకు, కాంగ్రెస్ ఎంపి కటకటాలపాలయ్యే వరకు భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా పోరాటం ఆగదని హెచ్చరించారు.



శనివారం గాంధీభవన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా నాయకులు

# దక్షిణాఫ్రికా బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క

## తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ ఆడి, పాడారు

## సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

**హైదరాబాద్,అక్టోబరు10,ప్రభాతవార్త:** దక్షిణాఫ్రికాలో సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికాలో నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి ఆమె బతుకమ్మ ఆడి, పాడారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటలతో వేడుకల్లో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీ గడ్డపై సైతం ఘనంగా చాటుతున్న ప్రవాస తెలంగాణ మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. జోహాన్నెస్‌బర్గ్ నగరంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దేశ సరిహద్దులు దాటి విదేశాల్లోనూ ఘనంగా నిర్వహించడం పట్ల మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆడబిడ్డలు ఎక్కడ ఉన్నా తమ మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోకుండా బతుకమ్మ వంటి పండుగలను జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు ప్రవాస తెలంగాణ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క వెంట వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి పాల్గొన్నారు. సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రవాస తెలంగాణ మహిళలు, ఇతర సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



# నేటి నుంచి దసరా ఉత్సవాలు

## 20న విజయదశమితో ముగింపు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** ఈ యేడాది దసరా ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో భిన్న సంస్కృతుల మధ్య కొనసాగే ఈ ఉత్సవాలు అక్టోబరు 20వ తేదీన విజయదశమి రోజున ముగుస్తాయి. దేశంలో దసరా నవ రాత్రులకు ప్రత్యేక స్థానం వుండడం తెలిసిందే. ఒక్కో రోజు ఒక్కో రీతిన అమ్మవారిని అలంకరించి పూజలు చేయడం ఇందులో ప్రత్యేకత. దస రా ఉత్సవాలలో మొదటి రోజున అంటే ఆదివారం నాడు స్వర్ణ కవచం, పులగంతో అమ్మవారికి నైవేద్యం సమర్పించాలని ఆగమన పండితులు చెబుతున్నారు. రెండవ రోజున అంటే సోమవారం నాడు బాలా త్రిపుర సుందరి రూపంలో అమ్మవారిని అలంకరిస్తారు. ఈ రోజున అమ్మవారికి ఇష్టమైన పాయసం, పులిహోర నైవేద్యంగా సమర్పించాలని పండితులు చెబుతున్నారు. మూడవ రోజున అంటే మంగళవారం నాడు గాయత్రీ దేవి రూపంలో అమ్మవారిని పూజిస్తారు. ఆ రోజున గారెలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించాలి. అక్టోబరు 14వ తేదీన అమ్మవారిని అన్న పూర్ణాదేవిగా అలంకరిస్తారు. ఆ రోజున క్షీరాన్నాన్ని నైవేద్యంగా సమర్పించాలి. దీంతో పాటు అన్న పూర్ణాదేవ పూర్ణాష్టకం చదవాలని పండితు లు చెబుతున్నారు. అక్టోబరు 15వ తేదీన అమ్మవారిని లలితా దేవి రూపంలో అలంకరిస్తారు. ఆ రోజున అమ్మవారికి ఎంతో ఇష్టమైన బొబ్బట్ల ను నైవేద్యంగా సమర్పిస్తారు. అక్టోబరు 16వ తేదీన అమ్మవారు మహాలక్ష్మీ రూపంలో భక్తులకు కరుణిస్తారు. ఆ రోజున అమ్మవారికి పులిహోర నైవేద్యంగా సమర్పిస్తారు. 17వ తేదీన అమ్మవారు చదువుల తల్లి సరస్వతి దేవి రూపంలో దర్శనమిస్తారు. ఆ రోజున అమ్మవారికి దద్ధోజనం నై వేద్యంగా సమర్పిస్తారు.

# 'సర్'పై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పిలుపు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇటీవల పూర్తయిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆల్ సెల్స్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా బోగస్ ఓట్లను తొలగించి పారదర్శకంగా జాబితాను రూపొందిస్తే, వరుస ఎన్నికల ఓటములతో భయపడిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న "ఓట్ చోరీ" నాటకాలను ఎండగడుతూ, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల ప్రజాస్వామ్యానికి చేకూరే ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పచ్చి అబద్ధాలతో ఒక ఫాల్స్ నెరేటివ్‌ను సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తుందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై వీళ్లు సాగిస్తున్న దుష్ప్రచారానికి హద్దు, అదుపు లేకుండా పోయింది. అబద్ధాలు ఆడినా కనీసం అతికేటట్లు ఉండాలి కానీ, కాంగ్రెస్ నాయకులు ఆ విచక్షణను కూడా కోల్పోయారు. నిన్న కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్రపతిని కలిసిన తర్వాత, బయటకు వచ్చిన రాహుల్ గాంధీ మీడియా ముందు ఇంకో కొత్త నాటకానికి తెరలేపారు. తాము చెప్పిన ఆరోపణలకు రాష్ట్రపతి ఆధారాలు అడిగారని స్వయంగా రాహుల్ గాంధీయే చెప్పారు. తీరా చూస్తే వాళ్ల దగ్గర సమర్పించడానికి ఎలాంటి ప్రూఫ్స్ లేవు. చేతిలో ఒక్క ఆధారం కూడా లేకపోయినా, చివరకు దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్రపతి ఓటు చోరీని ఒప్పుకున్నారంటూ సిగ్గులేకుండా ప్రచారం మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా మొత్తం 95 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉంటే, అందులో 82 కోట్ల మంది స్వయంగా తమ ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇచ్చారు. ఫారమ్6లో క్షేత్రస్థాయి పరిశీలన కోసం డి ఎనెక్సషన్ కోడ్ జోడిస్తే, దానిపై కాంగ్రెస్ సుప్రీంకోర్టు దాకా వెళ్లి అడ్డగోలు పిటిషన్లు వేసింది. తీరా సుప్రీంకోర్టు ఎస్ఐఆర్ ప్రక్రియను ఎక్కడా తప్పుపట్టకపోయినా, కోర్టు ఏదో మొట్టికాయలు వేసినట్లు కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలు మొదలుపెట్టింది. అంతటితో ఆగకుండా, ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయంటూ మరో పచ్చి అబద్ధాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు.




శనివారం హైటెక్‌సిటీలోని ఆస్పత్రిలో నిర్వహించిన ఆరో ప్రపంచ సమగ్ర క్రిటికల్ కేర్ సదస్సులో పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

# వైద్య సేవల్లో మానవీయతకు ప్రాధాన్యం

## డబ్ల్యు4సి-2026 సదస్సులో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్,అక్టోబరు10,ప్రభాతవార్త:** వైద్య సేవలు వ్యాధుల చికిత్సకే పరిమితం కాకుండా.. రోగులు, వారి కుటుంబాల పట్ల విశ్వాసం, గౌరవం, ఆత్మీయతతో కూడి ఉండాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. వైద్యులు రోగుల భావోద్వేగాలు, కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకుంటూ సేవా భావంతో చికిత్స అందించాలని సూచించారు. శనివారం హైటెక్ సిటీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నిర్వహించిన ఆరో ప్రపంచ సమగ్ర క్రిటికల్ కేర్ సదస్సు (డబ్ల్యు4సి 2026)లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైద్య పరిజ్ఞానంతో పాటు మానవీయ దృక్పథం కూడా వైద్యుడి గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. క్యాన్సర్ రోగులకు ఖరీదైన మందులను చౌకగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని గవర్నర్ అన్నారు. వీటితో రోగులు, వారి కుటుంబాలకు ఆర్థికంగా ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. ఔషధ రంగం, సమాజం, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి అంశాలపై సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.

### సేవతోనే ప్రజలతో అనుబంధం

రాజకీయాలతో పాటు సమాజ సేవలోనూ భాగస్వాములు కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపును గవర్నర్ ప్రస్తావించారు. పదవులు శాశ్వతం కాకపోయినా. సేవ ద్వారా ప్రజలతో ఏర్పడే అనుబంధం చిరకాలం నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ సహకారం, ఆధునిక పరిశోధనలతో భారతీయ పరిస్థితులకు అనుగుణమైన చికిత్సా విధానాలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. సమర్థమైన వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. డబ్ల్యు4సి 2026 సదస్సు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగుల చికిత్సలో సానుకూల మార్పులకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సును నిర్వహించిన యశోద ఆసుపత్రులు, ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అంతకుముందు లోక్‌భవన్‌లోతెలంగాణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలు, విజయాలపై పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు డా. నవీన్ నికోలస్ గవర్నర్‌ను కలిసి వివరించారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహించిన కార్యక్రమాలు, చేపట్టిన సేవా కార్యక్రమాలు, సాధించిన విజయాలను గవర్నర్‌కు వివరించారు.




# నేడు భూమిని తాకనున్న సౌర తుఫాన్

**న్యూయార్కు, అక్టోబరు 10:** శక్తివంతమైన సౌర తుఫాన్ ఆదివారం భూమిని తాకనుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. సూర్యుడి నుంచి వెలువడిన రెండు భారీ ఉద్గారాలు భూమివైపు దూసుకొస్తున్నాయని తెలిపారు. వీటి ప్రభావంతో అక్టోబర్ 11న భూమి అయస్కాంత క్షేత్రంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా. అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ ఈ నేపథ్యంలో మధ్యస్థ స్థాయి జి2 జియోమాగ్నెటిక్ తుఫానుపై హెచ్చరిక జారీ చేసింది.

ఈ సౌర తుఫాను ప్రభావం ఉపగ్రహాలు, రేడియో సమాచార వ్యవస్థలు, నావిగేషన్ సేవలపై కొంతమేర ఉండవచ్చని అంచనా వేశారు. సూర్యుడి నుంచి వస్తున్న పదార్థం భూమి అయస్కాంత క్షేత్రంతో ఎలా పరస్పర చర్య జరుపుతుందనే దానిపై వాస్తవ ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. నోవా స్పేస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ ప్రకారం. ఈనెల 7, 8 తేదీల్లో సూర్యుడి నుంచి వెలువడిన రెండు ఉద్గారాలు భూమివైపు వస్తున్నాయి. రెండో ఉద్గారం మొదటిదానికంటే వేగంగా కదులుతోంది. భూమిని చేరేలోపు ఈ రెండూ కలిసిపోయే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ పదార్థం భూమికి దగ్గరయ్యే కొద్దీ దాని వేగం, అయస్కాంత లక్షణాలను పరిశీలించి తుఫాను తీవ్రతపై మరింత స్పష్టత వస్తుంది. ప్రస్తుతం ఉన్న అంచనా ప్రకారం మధ్యస్థ స్థాయి ప్రభావాలు ఉండవచ్చని భావిస్తున్నారు. జి2 స్థాయి సౌర తుఫాను ప్రభావాలు సాధారణంగా అధిక అక్షాంశ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థల్లో వోల్టేజ్ హెచ్చుతగ్గులు సంభవించే అవకాశం ఉంది. ఉపగ్రహాల నిర్వహణలో మార్పులు చేయాల్సి రావచ్చు. కొన్ని ప్రాంతాల్లో రేడియో సిగ్నళ్ల బలం తగ్గడం, ఉపగ్రహ నావిగేషన్ ఖచ్చితత్వంలో తాత్కాలిక మార్పులు చోటుచేసుకోవడం సాధ్యమే. అయితే ఇవన్నీ సంభవించే అవకాశాలే. ప్రతి జి2 తుఫాను వల్ల తప్పనిసరిగా అంతరాయాలు ఏర్పడతాయని చెప్పలేం. సౌర తుఫానుల సమయంలో ఆకాశంలో అరోరాలు అనే రంగురంగుల వెలుగులు కనిపించవచ్చు. సూర్యుడి నుంచి వచ్చిన విద్యుత్‌ప్రభావిత కణాలు భూమిపై వాతావరణంలోని వాయువులతో పరస్పర చర్య జరిపినప్పుడు ఈ కాంతి దృశ్యాలు ఏర్పడతాయి. సాధారణంగా ధ్రువ ప్రాంతాలకు సమీపంలో కనిపించే అరోరాలు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉన్నప్పుడు సాధారణం కంటే తక్కువ అక్షాంశాలున్న ప్రాంతాల్లోనూ కనిపించే అవకాశం ఉంటుంది. అయితే ఈసారి ఎక్కడెక్కడ అరోరాలు కనిపిస్తాయన్నది తుఫాను తీవ్రత, ఇతర అంతరిక్ష వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. సూర్యుడి నుంచి వచ్చిన పదార్థం భూమి అయస్కాంత క్షేత్రంతో ఎలా స్పందిస్తుందో స్పష్టమైన తర్వాతే సౌర తుఫాను వాస్తవ తీవ్రతపై పూర్తి అవగాహన వస్తుంది.

# 24 గంటల్లో అరెస్టు చేసిన సిజెపినేతలందరినీ వదిలేయాలి

## లేదంటే నిరవధిక దీక్ష చేస్తా: సోనమ్ వాంగ్‌ఛుక్

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** సర్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్న సిజెపినేతల నిర్బంధంపై ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్పందించారు. అరెస్టైన సీజేపీ నేతల్ని 24 గంటల్లో విడుదల చేయకపోతే, తాను నిరాహార దీక్ష చేపడుతానని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. అవసరమైనే పాదయాత్ర ద్వారా కూడా నిరసన తెలిపే అవకాశం ఉందని చెప్పారు. దేశంలో 'అప్రకటిత ఎమర్జెన్సీ' వంటి పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఊహించలేదని అన్నారు. ఈ ఉద్యమానికి చాలా మంది నాయకత్వం వహించేందుకు ముందుకు రావడాన్ని చూసి సంతోషించానని, అయితే వారందర్ని అరెస్ట్ చేయడం చూసి ఆందోళనకు గురయ్యానని అన్నారు. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. జంతర్ మంతర్ వైపు వెళ్తు నేతల్ని, నిరసనకారుల్ని అరెస్ట్ చేశారు. మరోవైపు, ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, సీజేపీ లీగల్ హెడ్ రత్నా సింగ్‌లను శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే, ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో వచ్చిన సీజేపీ కన్వీనర్ అభిజిత్ దీప్కే, కోకన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను విమానంలోని పోలీసులు అరెస్ట్ చేసి, రహస్య ప్రాంతానికి తరలించారు. 2000 మందికి పైగా సీజేపీ, లెఫ్ట్ పార్టీల కార్యకర్తల్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

# ఓటర్ల తొలగింపుపై హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ

● ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్



శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద భారీ నిరసన ర్యాలీ నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి అక్టోబర్ 10 ( ప్రభాతవార్త ) :** ప్రత్యేక తీవ్ర సమీక్ష ప్రక్రియ పేరుతో పెద్దఎత్తున ఓట్లను తొలగించడాన్ని ఖండిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి అశోక్ నగర్ వరకు ఈ మార్చ్ సాగింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న పౌరుల అక్రమ నిర్బంధాన్ని తక్షణమే నిలిపివేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగరంలోని న్యాయ ప్రేమికులు, సామాజిక కార్యకర్తలు, భగత్ సింగ్ జన్ అధికార్ యాత్ర ప్రచార బృందం ప్రతినిధులు, దిశ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, నౌజవాన్ భారత్ సభ, మజ్దూర్ బిగుల్ వంటి వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నౌజవాన్ భారత్ సభకు చెందిన భగత్ సింగ్ జన్ అధికార్ యాత్ర వాలంటీర్ భార్గవి మాట్లాడుతూ ప్రస్తుతం సాగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ కొత్త ఓటర్ల నమోదు కంటే ఓట్ల తొలగింపుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. దశాబ్దాల క్రితం నాటి తండ్రి లేదా తాతల ఓటింగ్ రికార్డులను ఫారం6 ద్వారా అడుగుతూ కఠినమైన నిబంధనలు విధిస్తున్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ప్రామాణిక గుర్తింపు కార్డులను తిరస్కరిస్తూ ప్రజలను ఓటు హక్కుకు దూరం చేస్తున్నారు" అని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు దూరమయ్యారని, ఓటమి భయంతోనే పేదలు, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, వలస కార్మికులు, మహిళల ఓట్లను ఎస్.ఐ.ఆర్ మెకానిజం ద్వారా తొలగిస్తున్నారని విమర్శించారు. గతంలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో గెలుపొందిన మెజారిటీ కంటే తొలగించిన ఓట్ల సంఖ్యే ఎక్కువగా ఉందనే విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ఒక్క ఓటును అక్రమంగా తొలగించినా అది కళంకమేనని, తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కాపాడుకోవడానికి ప్రజలందరూ వీధుల్లోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు.

# ఎస్సీ, ఎస్టీ, బిసి జడ్జిలను నియమించాలి

● కొలిజియంను రద్దు చేసి, జాతీయ స్థాయిలో జ్యూడిషియల్ కమిషన్‌ను నియమించాలి:ఆర్.కృష్ణయ్య డిమాండ్



**సైఫాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** జనాభా ప్రాతిపదికన హైకోర్టులు, సుప్రీంకోర్టులో ఎస్సీ, ఎస్టీ, బిసిలను జడ్జిలుగా నియమించాలని రాజ్య సభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తంతరాలుగా ఎస్సీ, ఎస్టీ, బిసి న్యాయవాదులకు అన్యాయం జరుగుతున్నదని, న్యాయ వ్యవస్థలో అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని అడ్డుకోవడానికి బహుజన న్యాయవాదులు కృషి చేయాల్సిన అవసరం ఉందని, కొలిజియంను అడ్డుపెట్టుకుని మొత్తం అగ్రకులాల వారిని హైకోర్టులు, సుప్రీంకోర్టులలో జడ్జిలుగా నియమించుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే కొలిజియంను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ బిసి లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'ఉన్నత న్యాయ వ్యవస్థలో సామాజిక న్యాయం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ స్థాయిలో జ్యూడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, జడ్జిల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్‌లు కేటాయించాలని కోరారు. కోర్టులు సైతం బిసిలకు వ్యతిరేకంగా తీర్పులు ఇస్తున్నాయని, ఇటీవల ఎపి ప్రభుత్వం బిసిలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి న్యాయవాదుల్లో తెగింపు ఉండాలని, పోరాటాలకు, ఉద్యమాలకు వెనకాడరాదని, అవసరమైతే ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ బిసి, ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులకు హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియామకాలలో రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. అలాగే ఐఎఎస్, ఐపిఎస్ తదితర ఉన్నతాధికారుల ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్‌లు అమలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, న్యాయ వ్యవస్థలో ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తలకొక్కుల రాజు, పొన్నం దేవరాజుగౌడ్ మాట్లాడుతూ యుపిఎస్సీ తరహాలో ప్రత్యేకంగా జుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి జడ్జిల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. 1950 నుంచి 2022 వరకు సుప్రీంకోరుట నియామకాల్లో హైదరాబాద్ స్టేట్, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ హైకోర్టుల నుంచి ప్రమోట్ అయిన 16 మంది సుప్రీంకోర్టు జడ్జిల 16 మందిలో 7 రెడ్లు, 3 కమ్మలు, 3 బ్రాహ్మణులు, 2 ఇతరులు ఉన్నారని, ఎస్సీ, ఎస్టీ, బిసిలు ఎవరూ లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సుప్రీంకోర్టులో ఒక్క ఎస్టీ కూడా న్యాయమూర్తి పదవిని అధిష్టించలేదన్నారు. సదస్సులో విశ్రాంతి ఐఎస్ అధికారి టి.చిరంజీవులు, విజిఆర్ నారగోని, సీనియర్ డాక్టర్ వినయ్‌కుమార్, బార్ కౌన్సిల్ సభ్యుడు రఘునాథ్, న్యాయవాదులు, చిక్కుడు ప్రభాకర్, అలేటి యాదగిరి, సామల రవీందర్, కొమ్ము ప్రవీణ్‌కుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం నేత గఫూర్ కుమారుడు కిరణ్ మృతిపై జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,అక్టోబరు 10.ప్రభాతవార్తప్రతినిధి:** సీపీఎం నేత గఫూర్ కుమారుడు కిరణ్ మృతిపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఉన్నత విద్యను అభ్యసించి.. కాలిఫోర్నియాలో సీనియర్ డేటా సైంటిస్ట్‌గా పనిచేస్తూ.. మంచి భవిష్యత్తు కలిగిన కిరణ్ అకాల మరణం అత్యంత బాధాకరమన్నారు. కన్నకొడుకును కోల్పోయిన ఎం.ఎ. అబ్దుల్ గఫూర్, పి. నిర్మల గార్ల దుఃఖం వర్ణనాతీతం. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారికి, కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలన్న వైఎస్ జగన్.. కిరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా. కిరణ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఆర్టీసీలో ఎంప్లాయిస్ యూనియన్ విజయం

## ఎఐటియుసి వద్ద ఉత్సవం

**సైఫాబాద్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్టీసీ పనిచేస్తున్న కార్మికుల చిరకాల కోరిక ప్రభుత్వంలో విలీనం విషయంలో ఏలాంటి రాజీ పడకుండా ఎంప్లాయిస్ యూనియన్ కృషి చేయాలని సిపిఐ సీనియర్ నాయకుడు డా.కె. నారాయణ పిలుపునిచ్చారు. కార్మికులను మోసం చేసేందుకు ప్రభుత్వాలు చేసిన కుట్రలను కార్మిక వర్గం విజ్ఞతతో తిప్పి కొట్టిందన్నారు. ఆర్టీసీలో ఎంప్లాయిస్ యూనియన్ విజయం సాధించడం పట్ల శనివారం హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయం వద్ద ఎఐటియుసి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణి చేసి బాణా సంచాను కాల్చి పెద్ద ఎత్తున ఉత్సవం జరుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికుల డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, రాబోయే రోజుల్లో కార్మికుల పక్షాన పోరాటాలు చేసి హక్కులను సాధిస్తామని చెప్పారు. ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, ఎండి యూసఫ్, వాసిరెడ్డి సీతారామయ్య, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటేశం, ఎం.నర్సింహ్మా, యూనియన్ నాయకులు డి.గోపాల్, ప్రసాద్‌రెడ్డి, ఎం.ఎస్.మూర్తి, ప్రవీణ్‌కుమార్, ఆటో యూనియన్ నాయకులు బిక్షపతియాదవ్, ఉమర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# బార్ యజమానుల సమస్యలు పరిష్కరించాలి

● తెలంగాణ రెస్టారెంట్ అండ్ బార్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష మద్దతు తెలిపిన పలు సంఘాల నేతలు



**ధర్నాచౌక్, అక్టోబర్ 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బార్ యజమానుల సమస్యలు పరిష్కరించాలని బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్, తెలంగాణ రెస్టారెంట్ అండ్ బార్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.దామోదర్‌గౌడ్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాన రెస్టారెంట్ అండ్ బార్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్‌లను కాపాడి జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ ధర్నాకు పలు సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బార్‌లపై విధించిన ప్రివిలేజ్ ఫీజు జీవోను తక్షణమే రద్దు చేయాలని, నిబంధనలు 25, 26 ప్రకారం వైన్ షాపులలో పర్మిట్ రూములను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బార్ పరిసర ప్రాంతాలలో బెల్ట్ షాపులు నిషేధించి, తమ వ్యాపారాలను, జీవనోపాధిని కాపాడాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. వైన్‌షాపు పర్మిట్‌రూం ప్రభుత్వం అమలుచేసిన రూల్స్‌కు విరుద్ధంగా వైన్‌షాపుల యాజమానులు నిర్వహిస్తున్నారని, దీనివల్ల అనేక సంవత్సరాలుగా బార్ అండ్ రెస్టారెంట్‌లలో పనిచేస్తున్న కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి వీధిన బెల్ట్ షాపులకు ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వటం వల్ల బార్‌ల అద్దెలు చెల్లించలేక, కార్మికులకు వేతనాలు ఇవ్వలేక, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, బార్ యజమానులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షా కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రాజుగౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణ, మోహన్‌గౌడ్, కార్యదర్శులు పి.నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌గుప్తా, లక్ష్మీకాంత్, లక్ష్మీ నారాయణతో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైం పోలీసుల అంతరాష్ట్ర దాడులు...

● 23 కేసులకు సంబంధించి 35 మంది నిందితుల అరెస్టు

● రూ.88.48 లక్షలు బాధితులకు అందజేత

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త:** అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు దేశ వ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాలలో నిర్వహించిన దాడుల్లో 23 కేసులకు సంబంధించి 35 మంది పట్టుబడ్డారు. ఈ సందర్భంగా 88 లక్షల 48 వేల 134 రూపాయలను బాధితులకు అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలను అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) ఎం.శ్రీనివాస్ శనివారం మీడియాకు వెల్లడించారు. నేషనల్ సైబర్ క్రైం పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) లో గత సెప్టెంబరులో నమోదైన 83 కేసుల ఆధారంగా సైబర్ క్రైం పోలీసులు వారం రోజుల పాటు ఈ దాడులు నిర్వహించారు. పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ వారిలో సోషల్ మీడియా నేరాలకు సంబంధించి తొమ్మిది మంది, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసుల్లో ఏడుగురు, డిజిటల్ అరెస్టు కేసుల్లో ఆరుగురు, ట్రేడింగ్ ఫ్రాడ్ కేసుల్లో ఐదుగురు, అడ్వర్టయిజ్‌మెంట్ ఫ్రాడ్ కేసుల్లో ముగ్గురు, ఇతర నేరాల్లో ఐదుగురు వున్నారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు పది మంది, ఎపి నుంచి తొమ్మిది మంది, మహారాష్ట్ర నుంచి ఆరుగురు, కేరళ నుంచి ముగ్గురు, యుపి నుంచి ముగ్గురు, బిహార్, హరియాణా, పంజాబ్, రాజస్తాన్‌ల నుంచి నలుగురు వున్నారు. నిందితుల వద్ద పది సెల్‌ఫోన్లు, ఏడు చెక్ బుక్కులు, ఒక షెల్ కంపెనీ రబ్బర్ స్టాంప్ పట్టుబడ్డాయి. కాగా ఈ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసుల్లో 17 నేరాలకుగానూ ఏడు కోట్ల 68 లక్షల 42 వేల 420 రూపాయలు దోచుకోగా ఇందులో తొమ్మిది లక్షల 20 వేల 201 రూపాయలను జప్తు చేశారు. ఇతర కేసుల్లోనూ ఇదేరీతిన జప్తు చేశారు. సైబర్ నేరాల విషయంలో అందరు అప్రమత్తంగా వుండాలని అదనపు పోలీసు కమిషనర్ శ్రీనివాస్ కోరారు. ఈ తరహా నేరాలపై 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

# ఇజ్రాయెల్ సింగర్ నోట హనుమాన్ చాలీసా..

## స్మిత్ మచ్చర్ కోసమేనంటూ పోస్ట్

**టెల్‌అవీవ్, అక్టోబరు 10:** ఫ్లైదుబాయ్ విమానంలో తీవ్ర గాయాలతోనూ వీరోచితంగా పోరాడి.. ఎంతోమంది ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవు తున్నాయి. తాజాగా ఇజ్రాయెల్‌కు చెందిన గాయకుడు బెన్ రైవిట్జ్ హనుమాన్ చాలీసా పఠిస్తూ స్మిత్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇందుకు సంబంధించిన విడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విపత్కర పరిస్థితుల్లో విమానాన్ని కూలకుండా నియంత్రిస్తూ.. ధైర్యం కోసం మచ్చర్ హనుమాన్ చాలీసా పఠించినట్లు తెలుసుకున్న బెన్ రైవిట్జ్ ఎంతగానో చలించిపోయారు. ఈ క్రమంలో ఆయన స్వయంగా హనుమాన్ చాలీసాను ఆలపించి, ఆ విడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఈ విడియోను కెప్టెన్‌కు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. స్మిత్‌ను భారత్ హీరోగా అభివర్ణిస్తూ, ఆయన పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బెన్‌రైవిట్జ్ చేసిన ఈ ప్రయత్నానికి సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. సంగీతానికి, మానవత్వానికి దేశాల సరిహద్దులు అడ్డుకావని ఈ ఘటన మరోసారి చాటిచెబుతోందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# రైల్వేలో భారీగా పరిశుభ్రత కార్యక్రమాలు

## 3,730 యూనిట్లలో స్వచ్ఛతా హి సేవా ప్రచారంలో 21,458 మంది భాగస్వామ్యం



**తార్నాక, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** భారతీయ రైల్వే చేపట్టిన "స్వచ్ఛతా హి సేవా ప్రచారంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని 3,730 రైల్వే యూనిట్లలో విస్తృతంగా పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మొత్తం 21,458 మంది పాల్గొని స్వచ్ఛ భారత్ మిషన్‌కు తమ వంతు సహకారం అందించారు. స్వచ్ఛతా మే సహభాగ్ – స్వచ్ఛ భారత్, వికసిత భారత్ అనే ఇతివృత్తంతో భారతీయ రైల్వే 2026 సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు "స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని రైల్వే స్టేషన్లు, రైళ్లు, కార్యాలయాలు, రైల్వే కాలనీలు, ఆరోగ్య కేంద్రాలు, వర్క్‌షాపులు, మెయింటెనెన్స్ డిపోలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. రైల్వే బోర్డు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమిస్తూ సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లతో పాటు వివిధ వర్క్‌షాపుల పరిధిలో 3,730 పారిశుద్ధ్య యూనిట్లను గుర్తించి పరిశుభ్రతను మెరుగుపరిచారు. ఈ ప్రచారంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంతో పాటు రైల్వే ప్రాంగణాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా మొత్తం 20 సఫాయి కార్యక్రమాలను నిర్వహించారు. ........ 813 మంది కాంట్రాక్టు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ దక్షిణ మధ్య రైల్వే వ్యాప్తంగా మిత్ర సురక్షా శిబిరాలు (ఆరోగ్య శిబిరాలు) నిర్వహించారు. వీటి ద్వారా 813 మంది కాంట్రాక్టు సిబ్బంది ప్రయోజనం పొందారు. ఈ శిబిరాల్లో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు, రక్తపోటు, రక్తహీనత, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. లాలాగూడలోని కేంద్రీయ ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేపట్టారు.

ఈ ప్రచారంలో భాగంగా పారిశుద్ధ్య లక్ష్యయూనిట్ల గుర్తింపు, బహిరంగ ప్రదేశాల శుభ్రత, స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్మికుల భద్రత, సేవలు, గౌరవానికి సంబంధించిన ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. పరిశుభ్రతా కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు స్వచ్ఛతతో సమృద్ధి, రైల్వే స్టేషన్లు, రైళ్లు, బహిరంగ ప్రదేశాల పరిశుభ్రత, పర్యాటక మరియు చారిత్రక ప్రాధాన్యమున్న రైల్వే ప్రాంతాల శుభ్రతకు ప్రాధాన్యమిచ్చారు.

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అక్టోబర్ 1 నుంచి 15 వరకు స్వచ్ఛత పక్షోత్సవం నిర్వహిస్తున్నారు. రైల్వే ప్రాంగణాల్లో పరిశుభ్రతను మరింత మెరుగుపరచడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్ (ఒక రోజు – ఒక గంట – అందరం కలిసి), ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరు మీద ఒక మొక్క), ప్లాస్టిక్‌కు నో చెప్పండి వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఫ్లాష్‌మాబ్‌లు, వీధి నాటకాల ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. వర్క్‌షాపులు, రైల్వే కాలనీలు, డిపోలు, గూడ్స్ షెడ్లలో ప్రత్యేక శుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైల్వే ట్రాక్‌లపై పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రమైన రైల్వే పరిసరాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు.

# సిపిఎం నాయకుల అక్రమ అరెస్టు దుర్మార్గం

● సిఇసి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

● ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో సిపిఐ భారీ నిరసన



**చిక్కడపల్లి అక్టోబర్ 10 ( ప్రభాతవార్త ) :** ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎమ్) అఖిలభారత, వివిధ రాష్ట్రాల నాయకులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని సీపీఎమ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఢిల్లీలో ప్రదర్శనగా వెళ్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, ఆర్. అరుణకుమార్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు టి. జ్యోతితో పాటు ఇతర సీనియర్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తప్పుపట్టింది. అంతేకాకుండా, ఢిల్లీలోని సీపీఐ(ఎమ్) కేంద్ర కార్యాలయాలైన సుర్జిత్ భవన్, ఏకేజీ భవన్‌లపై పోలీసులు దాడి చేసి, నాయకులను, కార్యకర్తలను నిర్బంధించడాన్ని నిరసించింది. ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లో హోరెత్తిన నిరసనకేంద్ర ప్రభుత్వ నిర్బంధ వైఖరి, అక్రమ అరెస్టులకు నిరసనగా శనివారం హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా బయలుదేరి ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎమ్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య మాట్లాడుతూ "ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రధాని మోడీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన 18 సంవత్సరాల వయోపరిమితి సూత్రాన్ని విస్మరించి, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారనే నెపంతో ముస్లింలు, క్రిస్టియన్లు, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ఓట్లను తొలగిస్తూ దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లను రద్దు చేశారు. "ప్రజా ఉద్యమాలతో మెడలు వంచుతాం ప్రజలు, ప్రతిపక్షాలు, విద్యార్థియువజన సంఘాల తీవ్ర ఒత్తిడికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం తక్షణమే జ్ఞానేష్ కుమార్‌తో రాజీనామా చేయించాలని నాగయ్య డిమాండ్ చేశారు.

# భక్తుల అరచేతిలో తిరుమల సకల సమాచారం

● 'వేంకటాద్రియాప్'తో సులభంగా గమ్యస్థానం చేరుకునే సౌలభ్యం

● ఆఫ్‌లైన్‌లోనూ సేవలందించేలా ఆవిష్కరణ




**తిరుమల,అక్టోబరు 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఇప్పుడు సామాన్య భక్తులకు తిరుమలలో మరింత సులభంగా సకల సమాచారం తెలుసుకునే యాప్‌ను రూపొందించారు. "వేంకటాద్రి"పేరుతో నూతనంగా రూపొందించిన ఈ యాప్ సామాన్యభక్తులు కూడా ఆఫ్‌లైన్‌లో సులభంగా చేరుకోవాల్సిన గమ్యస్థానాలకు ఎటు వెళ్ళాలి, ఎంత దూరంలో ఉంది..అక్కడ అందు బాటులో ఉన్న కాటేజీ గదులు, సేవలు,కల్యాణకట్ట, అన్నప్రసాదంభవనం,ఉచిత బస్సులు(ధర్మరథాలు) సమయం వంటి సమగ్ర వివరాలు అరచేతిలోనే తెలుసుకునేలా ఈ యాప్‌ను తీర్చిదిద్దారు. వేంకటాద్రి పేరుతో అందుబాటులోకి వస్తున్న ఈ కొత్త యాప్ ఇంటర్నెట్ లేకపోయినా వాయిస్‌తో చెబితే వెంటనే అడిగిన సమాచారం ఇట్టే భక్తులకు తెలిసిపోతుంది.

ఎక్కడెక్కడ నుండో తిరుమలకు వస్తున్న యాత్రికులకు ఇప్పటికీ చేరుకోవాల్సిన ప్రాంతాలు తెలియక ఇబ్బంది పడుతుంటారు. కొండపై భక్తులు ఆయాప్రాంతాలకు సులభంగా వెళ్ళేందుకు వేంకటాద్రియాప్‌తో చేరుకోవాల్సిన చోటుకు సులభంగా వెళ్ళొచ్చు. తిరుమలలో దాదాపు వందకుపైగా ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ యాప్ సాయ పడుతుంది. ఈ యాప్‌లో భక్తులకు 24 గంటలు సేవలు అందించేందుకు ఎఐ టెక్నాలజీతో గోవింద పేరుతో వాయిస్ అసిస్టెంట్ కూడా అందుబాటులో ఉంటుంది. ఈ వాయిస్ అసిస్టెంట్ ద్వారా మనం ఎక్కడికి వెళ్లాలో ఆ ప్రాంతం గురించి అడిగితే బదులు వస్తుంది. ఎన్ఆర్ఐ దాత జయప్రకాశ్ బృందం సహకారంతో ఈ యాప్‌ను రూపొందించారు.

# ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలుపరచాలి

● అజాద్ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతల డిమాండ్



**ధర్నాచౌక్, అక్టోబర్ 10, ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రభుత్వం తక్షణమే అమలుపరచాలని అజాద్ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు షేక్ మజీద్, జి.మల్లేష్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి వారు మాటాడుతూ మీటర్ చార్జీల జీవో నెంబర్ 46ను సవరించి, కిలో మీటర్‌కు 18 రూపాయలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌లో తగిన పర్మిట్లు లేకుండా తిరుగుతున్న జిల్లా ఆటోలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాణిజ్య రిజిస్ట్రేషన్, పర్మిట్ నిబంధనలు మరియు సరైన నెంబర్ ప్లేట్లతో బైక్ ట్యాక్సీలను నియంత్రిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయినప్పటికీ వైట్ ప్లేట్ బైక్ ట్యాక్సీలు అక్రమ కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నాయని, చట్టాన్ని కఠినంగా అములచేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల ప్రతినిధులతో రవాణా శాఖా మంత్రి మరోసారి చర్చలు జరిపి, తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆటోడ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిపక్షం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు మహ్మద్ అల్లాబక్, ఉస్మాన్ బిన్ అవాల్గి, సయ్యద్ ఓమర్, సాయి కిరణ్ మరియు ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

# సమస్యల్లో బిసి గురుకులాలు కనీస సౌకర్యాలు కరువు

● మరుగుదొడ్లు, ఫర్నిచర్, ప్రహారీలు లేక అవస్థలు

**హైదరాబాద్, అక్టోబరు 10, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని బీసీ గురుకులాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ బీసీ గురుకులాల్లో ప్రధానంగా వసతుల లేమి సమస్య విద్యార్థుల పాలిట శాపంగా పరిణమిస్తోంది. రాష్ట్రంలో 325 బీసీ కాలేజీ హాస్టళ్లు, 320 బీసీ గురుకులాలు ఉన్నప్పటికీ చాలా వాటికి సొంత భవనాలు లేకుండా పోయాయి. ఏటా అద్దెల కోసం కోట్ల రూపాయలు ఖర్చవుతున్నా, అద్దె భవనాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 300 ప్రాంతాల్లో 327 గురుకులాలు ఉండగా 59 చోట్ల ప్రహారీలు లేవు. 27 పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. 157 ప్రాంతాల్లో సరిపడా డైనింగ్ టేబుల్స్ లేవు. హాస్టళ్లలో రాత్రి పడుకోవడానికి మంచాలు సైతం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే 204 గురుకులాల్లో ట్రూబైర్ మంచాల కొరత ఉంది. మరో 39 చోట్ల డిజిటల్ టీవీలు అందుబాటులో లేవు. తరగతి గదుల్లో కూర్చోవడానికి కుర్చీలు, బల్లలు సరిపోక 136 చోట్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉండే గురుకులాల్లో మరుగుదొడ్ల సమస్య ఉంది. 83 ప్రాంతాల్లో టాయిలెట్ సౌకర్యాలు సరిగా లేవు. 37 ప్రాంతాల్లో ఇప్పటికీ ఆర్వో తాగునీటి ప్లాంట్లు, 91 చోట్ల ప్రత్యేక గ్రంథాలయాలు లేవు. అన్ని వసతులతో సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ ఉంది. మరోపక్క గురుకులాల్లో ఫీజు బకాయిలు రూ.8,500 కోట్లు విడుదల చేయాలని ఇప్పటికే ప్రభుత్వంపై వత్తిడి పెరుగుతోంది. బీసీ విద్యార్థులకు ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, పీజీ, డిగ్రీ, ఇంటర్ తదితర కోర్సులకు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వాలని, హాస్టల్ విద్యార్థులకు నెలకు బాలికలకు రూ.1,000, బాలురకు రూ.800 పాకెట్‌మనీ ఇవ్వాలని, హాస్టళ్లలో అదనంగా సిబ్బంది లేని పరిస్థితి నెలకొంది. నియమించాలని శాశ్వత భవనాల్లో గురుకులాలు నడుస్తున్న చోట పెద్దగా ఇబ్బందులు లేకున్నా.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న చోట విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా టాయిలెట్లు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రభుత్వం కొత్త భవనాల నిర్మాణం కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.500 కోట్లు కేటాయించింది. అటు అధికారులు కూడా 39 చోట్ల భవనాల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నట్లు బీసీ గురుకుల సొసైటీ అధికారులు అంటున్నారు.



# న్యాయపీఠంపై ముగ్గురు స్త్రీ మూర్తులు

'ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్' అన్నది కవి వాక్కు . అలా అన్నట్టుగానే వివిధ రంగాల్లో ఆడవాళ్లు అన్నిటిలో సాటిలేని మేటిగా ఎదుగుతున్నారు. సమయపాలనలో, పరిపాలనలో, న్యాయ పాలనలోనూ వారికి వారే సాటి. గుజరాత్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతాఅగర్వాల్ తాజాగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి గా బాధ్యతలను చేపట్టడంతో సుప్రీంకోర్టులో ఇప్పుడు ముగ్గురు మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. సుప్రీంకోర్టులో ఒకేసారి అత్యధికంగా నలుగురు మహిళా న్యాయమూర్తులు ఉండేవారు. ఆగస్టు 2021 నుండి సెప్టెంబరు 2022లో జస్టిస్ ఇందిరాబెనర్జీ పదవీ విరమణ చేసే వరకు, జస్టిస్‌లు ఇందిరా బెనర్జీ, హిమాకోహ్లీ, బి.వి. నాగారత్న , బేలా త్రివేది ఏకకాలంలో పదవిలో ఉన్నారు. జస్టిస్ హిమాకోహ్లీ సెప్టెంబరు 2024లో పదవీ విరమణ చేయగా, ఆ తర్వాత మే 2025లో జస్టిస్ బేలా ఎం. త్రివేది పదవీ విరమణ చేశారు. మే 2025లో జస్టిస్ త్రివేది పదవీ విరమణ చేసిన తర్వాత, ఒక సంవత్సరం తర్వాత జస్టిస్ మోహన పదోన్నతి పొందే వరకు జస్టిస్ నాగారత్న ఏకైక మహిళా న్యాయమూర్తిగా ఉన్నారు.గమనించదగ్గ విషయం ఏమిటంటే, జస్టిస్ మోహన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం ఒక మహిళా న్యాయమూర్తిని నియమించడం ఇది రెండవసారి.వీరి నేతృత్వంలో మహిళా న్యాయసాధికారత వర్ధిల్లుతుందని ఆశిద్దాం.. □

## నేడు అటుకుల బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో రెండవ రోజైన అశ్వయుజ శుద్ధ పాడ్యమినాడు అటుకులు పెట్టతారు. కాబట్టి అటుకుల బతుకమ్మ అని పిలుస్తారు. తంగేడు, గునుగు, తదితర పూలను రెండు ఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు. **ఈ రోజు నైవేధ్యం :** బెల్లం, అటుకులు.

# అటుకుల ప్రసాదాలు

## అటుకుల బూరెలు



బియ్యప్పిండి రెండుకప్పులు, మినప్పప్పు, బెల్లం తరుగు: ఒకటిన్నర కప్పు, మందంగా ఉండే అటుకులు: రెండు కప్పులు, కొబ్బరి తురుము: అరకప్పు, ఉప్పు: పావుచెంచా, యాలకుల పొడి: పావుచెంచా, నూనె: వేయించేందుకు సరిపడా. **తయారీ విధానం :** 1. మినపప్పును నాలుగైదు గంటలు నానబెట్టుకుని ఆ తరువాత మెత్తగా రుబ్బి పెట్టుకోవాలి. ఇందులో బియ్యప్పిండి,ఉప్పు వేసుకుని కాస్త చిక్కగా తోపుపిండిని సిద్ధంచేసుకోవాలి. 2. అటుకుల్ని జల్లించుకుని, కడిగి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి బెల్లం తరుగు వేసి.. పావువకప్పు నీళ్లుపోయాలి. బెల్లం కరిగి చిక్కనిపాకంలా మారుతున్నప్పుడు అటుకులు,కొబ్బరి తురుము యాలకులపొడి వేసిబాగా కలిపి దగ్గరకు అయ్యాక దింపేయాలి. 3. అటుకుల మిశ్రమం చల్లగా అయ్యాక చిన్నచినన ఉండల్లా చేసుకుని బియ్యప్పిండి మిశ్రమంలో ముంచి..కాగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకుంటే చాలు. కమ్మని బూరెలు సిద్ధం.,



## అటుకుల కేసరి

**కావలసినవి :** అటుకులు, చక్కెర- కప్పు చొప్పున, నెయ్యి- అరకప్పు, యాలకుల పొడి-అర చెంచా, జీడిపప్పు, కిస్మిస్- అర కప్పు, కుంకుమ పువ్వు. **తయారీ :** ముందుగా కడాయిలో నెయ్యి వేసి అటుకుల వేయించాలి. వేడి తగ్గాక కొంచెం బరకగా పొడి చేసుకోవాలి. ఇందులో నెయ్యి,కొద్దిగా నీళ్ల పోసి ఉండలు రాకుండా ఉడికించాలి. పంచదార వేస్తూ కలియబెట్టాలి. దగ్గరగా అయ్యాక.. నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్మిస్, కుంకుమ పువ్వు వేసి కలపలాలి. అంతే కేసరి సిద్ధం.

## బెల్లం మిఠాయి



అటుకులు-2 కప్పులు,కొబ్బరి తురుము - కప్పు, బెల్లం-పావుకిలో, నెయ్యి-కప్పు, యాలకుల పొడి-అరచెంచా, నువ్వులు-అరకప్పు, జీడిపప్పు, కిస్మిస్-అర కప్పు, **తయారీ :** జీడిపప్పు, కిస్మిస్ నేతిలో వేయించాలి. బెల్లం పాకం పట్టి.. అందులో కొబ్బరి తురుము, జీడిపప్పు, కిస్మిస్ వేయాలి. కాస్త ఉడకనిచ్చి, అటుకులు, మిగిలిన నెయ్యి వేయాలి. రెండు నిమిషాలు సన్న సెగ మీద ఉంచి, కలియతిప్పి, దించితేసరి, అటుకులు కొబ్బరి బెల్లంతో రుచికరమైన కొబ్బరి మిఠాయి తయారైపోతుంది.

## మోదకం



**కావలసినవి :** అటుకులు-రెండు కప్పులు, నెయ్యి-కప్పు, బెల్లం-పావు యాలకుల పొడి-అరచెంచా, జీడిపప్పు, కిస్మిస్-అరకప్పు, నచ్చిన ఫుడ్ కలర్ - కొద్దిగా. **తయారీ :** కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి అటుకులు వేయించుకోవాలి. చల్లారాక మెత్తగా గ్రైండ్ చేయాలి. జీడిపప్పు, కిస్మిస్ నేతిలో వేయించాలి. బెల్లం పాకం మిశ్రమంతో మోదకాలు చుట్టుకోవాలి. ఇవి రుచీ, ఆరోగ్యం కూడా.

## అటుకుల లడ్డు

**కావలసినవి :** అటుకులు- రెండు కప్పులు,పంచదార-కప్పు, కొబ్బరితురుము - అర కప్పు, యాలకులపొడి-అర చెంచా, నెయ్యి-తగినంత, జీడిపప్పు, కిస్మిస్-అరకప్పు. **తయారీ :** కడాయిలో కాస్త నెయ్యి వేసి అటుకులు వేయించాలి. అవి కాస్త వేగాక కొబ్బరి తురుము, యాలకుల పొడి వేసి ఇంకాస్త వేయించాలి. చల్లారాక గ్రైండ్ చేసి.. ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో జీడిపప్పు, కిస్మిస్, పంచాదార పొడి, నెయ్యి వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలియతిప్పి.. చిన్న ఉండలుగా చుట్టుకోవాలి. ఇంకా తియ్యగా కావాలనుకుంటే..మిక్‌సడే ఫ్రైట్ జామ్ కొద్దిగా కలపవచ్చు. ఇవి వారం పాటు తాజాగా ఉంటాయి.



## తియ్యటి అటుకులు

**కావలసినవి :** అటుకులు-రెండు కప్పులు, కొబ్బరి పాలు - రెండు కప్పులు, పంచదార-కప్పు, ఆకుప్చ ఫుడ్, కలర్-కొద్దిగా.

**తయారీ :** ముందుగా కొబ్బరిని గ్రైండ్ చేసి, అందులోంచి కొబ్బరి పాలు తీయాలి. సన్న సెగ మీద ఈ పాలు మరిగిస్తూ అందులో పంచదార వేయాలి. అది కరిగాక అటుకులు, ఫుడ్ కలర్ వేసికలియతిప్పికొద్దిగా ఉడికించి దించేయాలి. ఈ తియ్యటి ఆటుకుల పైన కాస్త కొబ్బరి కోరు చల్లితే.. రుచి పెరగడమే కాకుండా, మరింత ఆకర్షనీయంగా ఉంటుంది. □



నేడు దుర్గమ్మ అలంకరణ

# బాలాత్రిపుర సుందరీదేవి



**"హ్రీంకారాసన గర్భితానల శిఖాం సౌః క్లీం కళాం బిభ్రతీం**
**సౌవర్ణాంబర ధారిణీం వరసుధాదౌతాం త్రినేత్రోజ్జ్వలాం**
**వందే పుస్తక పాశమంకుశధరాం స్రగ్భూషితాముజ్జ్వలం**
**త్వాంగౌరీం త్రిపురాం పరాత్పరకళాం శ్రీచక్ర సంచారిణీమ్"**

శరన్నవరాత్రి ఉత్సవాలలో మొదటి రోజు దుర్గమ్మ శ్రీ బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిస్తుంది. బాలాదేవి మంత్రం సమస్త దేవీ మంత్రాల్లోకెల్లా మొదటిది అయిన బాలాదేవి అనుగ్రహాన్ని పొందితేనే శ్రీ ఆదిపరాశక్తి అనుగ్రహాన్ని పొందగలం. అందుకే దుర్గాదేవిని బాలాత్రిపుర సుందరదేవిగా అలంకరిస్తారు. త్రిపురుని భార్య అయిన త్రిపుర సుందరీదేవి, అంటే ఈశ్వరుడి భార్య అయిన గౌరిదేవి అని అర్థం. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం త్రిపుర సుందరీదేవి అధీనంలో ఉంటాయి. అభయహస్త ముద్రతో, అక్షమాల ధరించిన ఈమెను ఆరాధిస్తే మనోవికారాలు తొలగిపోతాయి. ఈ తల్లి నిత్యసంతోషం ప్రసాదిస్తుంది. త్రిపుర సుందరీదేవి శ్రీచక్రంలోని త్రిపురాత్రయంలో మొదటి అధిష్టాన దేవతగా భక్తులచే పూజలందు కుంటుంది. షోడశవిద్యకు ఈమే అధిష్టాన దేవతగా నిలిచివుంటుంది. అందుకే ఉపాసకులు బాలా త్రిపుర సుందరీదేవి అనుగ్రహం కోసం బాలార్చన చేస్తారు. సత్సంతానాన్ని అనుగ్రహించే దేవతగా బాలా త్రిపుర సుందరీ దేవి భక్తుల పూజలందుకుని వారిని అనుగ్రహిస్తుంది. ఈ రోజు రెండు నుంచి పదేళ్లలోపు బాలికలను అమ్మవారి స్వరూపంగా పూజచేసి కొత్త బట్టలు పెట్టాలి.

**అలంకారం:** అమ్మవారిని లేత గులాబి వర్ణంతో వున్న పట్టుచీరను అలంకరిస్తారు.

**మంత్రం:** "ఓం ఐం హ్రీం శ్రీం బాలా త్రిపుర సుందర్యైః నమోనమః" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి.

**నివేదన:** అమ్మవారికి పులిహోర, రవ్వకేసరి నివేదన చేసి, త్రిశతీ పారాయణ చేయాలి.

**- భట్టిప్రోలు నటరాజ కుమార్**

# తెర

## 'భోగి'లో 'ఏగిలివారంగ' సాంగ్ రిలీజ్



చార్మింగ్ స్టార్ శర్వా 'భోగి'చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామాను శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా ప్రమోషన్స్ ఇటీవల విడుదలైన టీజర్‌తో ప్రారంభమ య్యాయి. 'భోగి'మ్యూజికల్ ప్రమోషన్స్ తాజాగా ఏగిలివారంగ పాట విడుదలతో ప్రారంభమయ్యాయి. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే ఈ జానపద గీతం సినిమా నేపథ్యాన్ని అద్భుతంగా పరిచయం చేస్తోంది. మట్టి వాసనతో కూడిన జానపద పాటలను రూపొందించడంలో తన ప్రత్యేకతను చాటుకున్న భీమ్స్ సిసిరోలియో ఈ పాటకు అందమైన బాణీని అందించారు. 1960ల కాలంలో మహారాష్ట్ర- ఆదిలాబాద్ సరిహద్దులోని బొగ్గుల గుట్ట గ్రామం నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. అప్పటి పల్లె జీవనాన్ని సహజంగా ఆవిష్కరిస్తూ, ఆ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, కులవృత్తులు, గ్రామస్థుల జీవితాలపై పెత్తనం చెలాయించిన స్థానిక భూస్వాముల ప్రభావాన్ని ఈ పాటలో చూపించారు. ఆస్కార్ అవార్డు విజేత చంద్రబోస్ తెలంగాణ సహజమైన మాండలికంలో రాసిన సాహిత్యం ఈ వాస్తవాలను కళ్లకు కట్టినట్లు ఆవిష్కరిస్తుంది. గ్రామంలోని సామాజిక వ్యవస్థ, ప్రజల నిత్యజీవిత అనుభవాలను ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, సహజంగా, వాస్తవికంగా తన సాహిత్యంలో ప్రతిబింబించారు.నల్గొండ గద్దర్ నర్సన్న తన వాయిస్ తో పాటకు ప్రాణం పోశారు. తన ప్రత్యేకమైన పల్లె గొంతుతో పాటకు మరింత సహజత్వాన్ని తీసుకొచ్చారుపాటలోని సంగీతం, సాహిత్యంలోని గొప్పదనానికి విజువల్స్ కూడా చక్కగా తోడయ్యాయి. అప్పటి గ్రామీణ వాతావరణాన్ని, పల్లె జీవనశైలిని సహజంగా రీ క్రియేట్ చేశారు. శర్వా, అనుపమ పరమేశ్వరన్ తమ పల్లెటూరి పాత్రల్లో ఎంతో సహజంగా కనిపిస్తూ, సినిమా నేపథ్యానికి చక్కగా సరిపోయారు. దర్శకుడు సంపత్ నంది తన స్టోరీ టెల్లింగ్ తో అద్భుతంగాఆకట్టుకున్నారు

## సందీప్ కిషన్ కు జోడీగా కేథరిన్ థ్రెసా

'కరికాల'లో సందీప్ కిషన్‌కి జంటగా కెథరిన్ థ్రెసా అలెగ్జాండర్.. 'కరికాల' లో సందీప్ కిషన్‌కి జంటగా కెథరిన్ థ్రెసా అలెగ్జాండర్.. 'కరికాల'లో సందీప్ కిషన్‌కి జంటగా కెథరిన్ థ్రెసా అలెగ్జాండర్.. శంబాల' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు దర్శకుడు యుగంధర్ ముని కలిసి మళ్లీ ఓ విజువల్ వండర్‌ను క్రియేట్ చేయబోతోన్నారు. సందీప్ కిషన్ హీరోగా షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మాణంలో యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న చిత్రం 'కరికాల్త. ఈ మూవీని రెండు చాప్టర్‌లుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి చాప్టర్ 2027 జూలై 2న , రెండో చాప్టర్ 2027 అక్టోబర్ 28న విడుదల కాబోతోన్నట్టుగా మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో ఇప్పటి వరకు వచ్చిన పోస్టర్‌లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. సోషియో ఫాంటసీ, విజువల్ వండర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం సందీప్ కిషన్‌కి జోడిగా కేథరిన్ థ్రెసా నటించనున్నారు. ఈ మేరకు హీరోయిన్‌కి వెల్కమ్ చెప్తూ చిత్రయూనిట్ ఓ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. సందీప్ కిషన్, కేథరిన్ థ్రెసా అలెగ్జాండర్ తెరపై మొదటి సారిగా కలిసి కనిపించబోతోన్నారు. ఇక



ఈ చిత్రంలో కేథరిన్ థ్రెసా అలెగ్జాండర్ ఓ డిఫరెంట్ రోల్‌ను పోషించబోతోన్నట్టుగా తెలుస్తోంది. వెల్కమ్ ఆన్ బోర్డ్ అంటూ'కరికాల్త టీం స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది.వరల్డ్ క్లాస్ టెక్నాలజీ, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్, అత్యద్భుతమైన కథనంతో కరికాల పాన్ ఇండియన్ సినిమాగా రాబోతోంది.

## 'రణబాలి' గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది,విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. రశ్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమానుప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. పెళ్లి చూపులు తర్వాత నేను కంఫర్ట్ గా ప్రమోషన్ చేస్తూ, రెండు మూడు సార్లు కాపీ చెక్ చేసుకుని, రిలీజ్ కు తీసుకొస్తున్న సినిమా ఇది. మా మూవీ బ్యాక్ డ్రాప్ లోనే చాలా సీజీ వర్క్ ఉంది. ప్రీ ప్రొడక్షన్ టైమ్ లోనే మాకు సీజీ వర్క్ ఎంత ఇంపార్టెంట్ అనేది తెలిసింది. రీసెంట్‌గా చెన్నైలో ఒక సీనియర్ జర్నలిస్ట్ తో మాట్లాడుతున్నప్పుడు అప్పట్లో బెంగాల్ లో సంభవించిన కరువు గురించి చెప్పారు. ఎంతోమంది ప్రజలు ఆకలితో చనిపోయారట. కొన్ని అమెరికన్ పత్రికల ద్వారా భారతదేశ పరిస్థితి తెలుసుకున్న అమెరికన్లు బ్రిటీషర్లు ఎలాంటి దారుణ పరిస్థితులు సృష్టించారో తెలుసుకుని తమ దేశ స్వాతంత్రం కోసం పోరాటం ప్రారంభించారట. మన ప్రజల ధైన్యం అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిందని ఆ పాత్రికేయుడు నాతో చెప్పాడు.తన పరిధిలో ఉన్నంత వరకు సినిమాల టికెట్ ధరలను పెంచనివ్వబోనని ఈ సందర్భంగా స్పష్టం చేశాడు. తాను విద్యార్థిగా ఉన్న సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులే ఇందుకు కారణమని విజయ్ వివరించాడు.

## 'బ్లడీ రోమియో' కోసం నాని అల్ట్రాస్టైలిష్ మేకోవర్



నేచురల్ స్టార్ నాని తన నెక్స్ట్ భారీ ఎంటర్‌టైనర్'బ్లడీ రోమియోతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు.'ఓజీ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నాని, సుజీత్ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రం. డార్క్ హ్యూమర్, ఎక్సయిటింగ్ యాక్షన్, విలక్షణమైన పాత్రలతో ఈ సినిమా ప్రేక్షకులను అలరించనుంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. వెంకట్ బోయనపల్లి నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్, యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. బ్లడీ రోమియో కోసం నాని తన సరికొత్త లుక్‌ను పరిచయం చేశారు. మేకోవర్‌కు సంబంధించిన వీడియోను విడుదల చేస్తూ, తన ప్రత్యేకమైన స్క్రీన్ పర్సనాలిటీని తీర్చిదిద్దడం వెనుక జరిగిన కృషిని ప్రజెంట్ చేశారు. ఇంతవరకు ప్రేక్షకులకు పరిచయమైన తన లుక్‌కు భిన్నంగా, ఈసారి నాని రెట్రో స్టైల్‌లో బోల్డ్ మేకోవర్‌తో కనిపిస్తున్నారు. సినిమా కథకు, పాత్ర స్వభావానికి తగ్గట్టుగా ఈ లుక్‌ను రూపొందించారు.ప్రముఖ సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలీమ్ హకీమ్ నాని మేకోవర్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. కర్లీ ముల్లెట్ హెయిర్‌స్టైల్, టెక్స్చర్డ్ లేయర్స్‌తో పాటు రఫ్‌గా కనిపించే ఫుల్ బియర్డ్‌తో నానికి సరికొత్త లుక్ లో కనిపించారు. డిఫరెంట్ హెయిర్‌స్టైల్ నానికి రెబల్ లుక్‌ను తీసుకొచ్చింది. ఆయన పోషిస్తున్న పాత్రకు ప్రత్యేకమైన యాటిట్యూడ్, పర్సనాలిటీ ఉన్నాయనే ఆసక్తిని ఈ లుక్ కలిగిస్తోంది.తన హీరోలను స్టైలిష్‌గా చూపించడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సుజీత్.. ఆలీమ్ హకీమ్ సెలూన్‌లో జరిగిన ఈ మేకోవర్ సెషన్‌ను స్వయంగా పర్యవేక్షించారు.

## 'క్రేజీ కల్యాణం' 16న విడుదల



నరేష్ వికె, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న 'క్రేజీ కల్యాణం' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. మా "క్రేజీ కల్యాణం" సినిమా కాపీ రెడీగా ఉంది. ఈ నెలలో పెద్ద సినిమాలు ఉన్నందువల్ల థియేటర్స్ దొరకవని 30వ తేదీ రిలీజ్ చేయాలని అనుకున్నాం. అయితే ఆదర్శకుటుంబం సినిమా విడుదల వాయిదా పడటంతో మన సినిమాకు తగినన్ని థియేటర్స్ దొరుకుతాయని ఈ నెల 16వ తేదీకి రిలీజ్ డేట్ మార్చుకున్నాం. మాది తెలంగాణ, మేడ్చల్ దగ్గర బండమైలారం. నేను పుట్టి పెరిగింది అంతా అక్కడే. మా ఫ్యామిలీలో ఆర్ట్ ఫామ్ కు సంబంధించిన రూట్స్ ఉన్నాయి. మా ముత్తాత ఎవరో సంగీత వాయిద్యం పట్టుకుని కథలు చెప్పేవారట. అందులో క్యారెక్టర్స్ లో నటించేవారు. అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేయలేదు. బ్యాచ్ లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్స్ చేశాను. చదువుకునే టైమ్ లో ఫ్రెండ్స్ పెళ్లిళ్లకు వెళ్లేవాళ్లం. చదువుకునే అబ్బాయిలతో పోల్చితే సొసైటీ, పరువు అనే పేర్లు చెప్పి అమ్మాయిలకు త్వరగా పెళ్లిళ్లు చేస్తుంటారు. అమ్మాయిలకు కూడా తమ జీవితాల్లో ఏదో ఒకటి సాధించాలని, బాగా చదువుకోవాలని డ్రీమ్స్ ఉంటాయి. కానీ వాళ్ల పేరెంట్స్ త్వరగా పెళ్లి చేస్తారు. మిగతా క్లాస్ మేట్స్ అంతా ఆ పెళ్లికి అతిథులుగా వచ్చి హ్యాపీగా ఉంటే ఆ అమ్మాయి మాత్రం పెళ్లికూతురిలా ఉంటుంది. అక్క, చెల్లి, అమ్మ, నానమ్మ..ఇలా నా కుటుంబంలోని మహిళల మధ్యలో పెరిగిన నాకు అమ్మాయి మనసు కోణంలో కథ చెప్పాలని అనిపించింది.

## 'అ' థ్రిల్ల్ చేస్తుంది: రాహుల్ విజయ్



రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'అఖి' '(ఎహెచ్)' సినిమాపై ఇప్పటికే మంచి బజ్ నెలకొంది. అడివి శేష్ విడుదల చేసిన సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన రావడంతో పాటు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న థియేట్రి కల్ విడుదల చేస్తున్నారు.ఈ సందర్భంగా లిరిసిస్ట్ సుమన్ మాట్లాడుతూ ఇది నా తొలిపాట. శ్రీచరణ్ నాకు ఈ అవకాశం ఇచ్చాడు. నాలోని పాటల రచయితను మీకు ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాడు. సింగర్ షణ్ముఖ్ మాట్లాడుతూ శ్రీచరణ్ పాకాల నన్ను నమ్మి ఈ పాట పాడే అవకాశం ఇచ్చాడు. ఈ పాట ఈ సినిమాలో చాలా స్పెషల్‌గా ఉంటుంది. కో ప్రొడ్యూసర్ అభినవ్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ఇంత బాగా రావడానికి కారణమైన ఆర్టిస్టులకు,టెక్నిషియన్స్‌కు నా కృతజ్ఞతలు. నిర్మాత గ్యారీ బీహెచ్ మాట్లాడుతూ ఈ పాట అందరికి నచ్చుతుందని నమ్ముతున్నాను. స్నేహితులు అందరం కలిసి ఈ సినిమా చేస్తున్నాం. ఈ ప్రాజెక్ట్‌లో బాగమైనందుకు గర్వంగా ఉంది. శ్రీచరణ్ పాకాల మాట్లాడుతూ ఈ సినిమా నా కెరీర్‌లో వెరీ వెరీ స్పెషల్. రాహుల్ విజయ్, అర్చన పర్‌ఫార్మెన్స్ గురించి మాట్లాడుకుంటారు. ఫ్రెండ్స్ అందరూ కలిసి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేశారు. వెరీ టాలెంటెడ్ పీపుల్ అందరూ. దర్శకుడు సాయి చూడటానికి సున్నితంగా ఉంటాడు కానీ ఈయన చేసిన క్రైమ్ థ్రిల్లర్ చూస్తే అందరూ షాక్ అవుతారు. దర్శకుడు సాయి బాలి మాట్లాడుతూ రాహుల్ విజయ్ ఎంతో ఏమేజింగ్ యాక్టర్. కథ చెప్పినప్పుడు వెంటనే ఓకే అన్నాడు. ఎంతో క్రమశిక్షణ గల ఆర్టిస్ట్. నేను ఎంత ఇబ్బంది పెట్టినా ఎంతో సపోర్ట్ చేశాడు. హీరోయిన్ అర్చన అయ్యర్ బ్యూటిఫుల్ ఆర్టిస్ట్. ఆమె పర్‌ఫార్మెన్స్ ఈ సినిమాలో కొత్తగా ఉంటుంది.



## ఆర్కిటిక్ ఓపెన్‌లో ఓటమితో సింధు నిష్క్రమణ

**ఫిన్లాండ్:** ఆర్కిటిక్ ఓపెన్ 2026, ఉత్కంఠభరితమైన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ప్లేయర్ ఓటమితో పీవీ సింధు టోర్నీ నుండి నిష్క్రమించింది. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత సింధు ఫిన్లాండ్‌లో జరిగిన ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్స్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన టాప్ సీడ్, ప్రపంచ నంబర్ 5 రాట్చానోక్ ఇంటానన్‌తో మూడు గేమ్‌లలో ఓడిపోవడానికి ముందు గట్టిగా పోరాడింది. నాలుగేళ్ల తర్వాత జరిగిన వారి మొదటి ముఖాముఖిలో, మాజీ ప్రపంచ ఛాంపియన్ ఇంటానన్, ఆరో సీడ్ సింధును ఒక గంట రెండు నిమిషాల పాటు సాగిన ఉత్కంఠభరితమైన మూడుగేమ్‌ల పోరులో 21-11, 19-21, 21-18 తేడాతో ఓడించింది.

ఈ విజయంతో హెడ్‌టుహెడ్ రికార్డులో ఇంటానన్, సింధుపై 10-4 ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు, మహిళల సింగిల్స్ పోటీలో జపాన్‌కు చెందిన రికో గుంజిని ఓడించి సింధు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. జూలైలో జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ గెలుచుకున్న హైదరాబాద్‌కు చెందిన 31 ఏళ్ల సింధు, రెండో రౌండ్‌లో గుంజిపై 21-15, 21615 తేడాతో విజయం సాధించింది. అలాగే పురుషుల డబుల్స్ జోడీ కృష్ణ ప్రసాద్ గరగ-పృథ్వీ కృష్ణమూర్తి రాయ్ కూడా క్వార్టర్ ఫైనల్స్‌లో డెన్మార్క్‌కు చెందిన క్రిస్టియన్ ఫాస్ట్ క్యేర్-రాస్మస్ క్యేర్ చేతిలో 13-21, 14-21 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. దీంతో, ఫిన్లాండ్ పోటీలో భారత ప్రయాణం ముగిసింది.




## వరల్డ్ బౌల్స్ ఛాంపియన్: పుతుల్‌కు కాంస్యం

**గ్లాస్గో (యునైటెడ్ కింగ్‌డమ్):** ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్‌లోని క్లబ్ బర్వామ్‌లో శనివారం జరిగిన 2026 వరల్డ్ బౌల్స్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ సెమీఫైనల్స్‌లో పుతుల్ సోనోవాల్ అద్భుతమైన పరుగుకు ముగింపు పడింది. అతను ప్రపంచ 3వ ర్యాంకర్ అయిన స్కాటిష్ ఆటగాడు ఇయాన్ మెక్‌లీన్ చేతిలో వరుస సెట్లలో (5-8, 4-8) ఓటమి పాలై కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. వరల్డ్ బౌల్స్ అనుబంధ దేశాలన్నింటి నుండి జాతీయ సింగిల్స్ ఛాంపియన్‌లు పాల్గొనే వార్షిక అగ్రశ్రేణి ఈవెంట్ అయిన ఈ పోటీలో భారతదేశానికి ఇది మొట్టమొదటి పతకం. కొన్ని నెలల క్రితం కామన్వెల్త్ గేమ్స్ పతకాన్ని కోల్పోయిన పుతుల్, ఈ టోర్నమెంట్‌లో అద్భుతంగా రాణించి, 7 మ్యాచ్‌లకు 6 విజయాలతో తన గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. అతను తన మంచి ఫామ్‌ను కొనసాగిస్తూ, క్వార్టర్ ఫైనల్స్‌లో సింగపూర్‌కు చెందిన హారిమన్ యుయెన్‌పై హోరాహోరీగా (4-4, 6-5) విజయం సాధించి ఈ చారిత్రాత్మక పతకాన్ని ఖరారు చేసుకున్నాడు. సెమీఫైనల్స్‌లో నాలుగుసార్లు ప్రపంచ పతక విజేత అయిన ఇయాన్‌తో పోరాడటంలో విఫలమైనప్పటికీ, అతను ఇప్పటికే భారత్‌కు మొట్టమొదటి పతకాన్ని సాధించాడు. గతసారి అతను ఫిజీకి చెందిన, చివరికి రజత పతకం సాధించిన రజనేష్ ప్రసాద్ చేతిలో క్వార్టర్ ఫైనల్‌లో ఓటమి చవిచూశాడు. ఇక మహిళల సింగిల్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన బంగిత హాజారిక, ఏడు మ్యాచ్‌లలో నాలుగు విజయాలతో నాలుగో స్థానంతో తన గ్రూప్‌ను దాటలేకపోయింది.

### వెస్టిండీస్‌తో నేడు మూడో టి20

## టీమిండియాలో ముగ్గురికి నో ఛాన్స్!

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఒకటి గెలిచి, మరొకటి ఓడిన టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఇండోర్ వేదికగా ఆదివారం జరిగే మూడో టీ20లో పర్యాటక వెస్టిండీస్‌తో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టీ20లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన టీమిండియా, రెండో టీ20లో వెస్టిండీస్ అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఖంగుతిన్నది. దీంతో ఎలాగైనా మూడో టీ20 గెలిచి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలనే పట్టుదలతో భారత్ జట్టు ఉంది. మరోవైపు అద్భుత ప్రదర్శనతో రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్ అదే జోరు కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. దాంతో ఈ మూడో టీ20పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మూడో టీ20లో టీమిండియా కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం కనిపించడం లేదు. తొలి రెండు టీ20ల్లో కొనసాగించిన కాంబినేషన్‌తో టీమిండియా బరిలోకి దిగే అవకాశం ఉంది. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో విఫలమైన సంజూ శాంసన్ విధ్వంసకర హాఫ్ సెంచరీతో ఫామ్‌లోకి వచ్చాడు. కాబట్టి వైభవ్ సూర్యవంశీకి మరోసారి నిరాశే




ఎదురవ్వనుంది. సిరీస్ గెలిచే వరకు అతను బెంచ్‌కే పరిమితం కానున్నాడు. మిగతా కాంబినేషన్‌లో కూడా పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్‌నే పేసర్లుగా కొనసాగించనుడగా, నమన్ ధీర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు. అయితే తొలి రెండు టీ20ల్లో నిరాశపర్చిన శివమ్ దూబే స్థానంలో నితీష్ కుమార్‌ని తీసుకోవచ్చు. బ్యాట్‌తో పాటు బంతితో తేలిపోతున్న శివమ్ దూబేను పక్కన పెట్టాలనుకుంటే నితీష్ అవకాశం దక్కుతుంది. లేదంటే నితీష్‌తో పాటు రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్‌లకు మరోసారి నిరాశే ఎదురుకానుంది. తొలి టీ20లో మయాంక్ యాదవ్ నిరాశపర్చినా, రెండో టీ20లో ఆకట్టుకున్నాడు. మూడు వికెట్లతో అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. కానీ మిగతా బౌలర్లు ఆశించిన రీతిలో రాణించలేకపోయారు. విపరీతమైన డ్యూ కారణంగా చేతులెత్తేసారు. సంజూ, అభిషేక్ ఓపెనింగ్ చేయనుండగా, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, శివమ్ దూబే, తిలక్ వర్మ, నమన్ ధీర్, అక్షర్ పటేల్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. వెస్టిండీస్‌తో రెండో టీ20కి భారత తుది అంచనా జట్టులో సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్ ఉన్నారు.

ఆట




## అథ్లెటిక్స్ ఓపెన్ నేషనల్స్.. మణికాంతకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్ప్రింటర్ మణికాంత హోబ్లిధర్ 100 మీటర్ల పరుగులో స్వర్ణ పతకం గెలుచుకుని, అత్యంత వేగవంతమైన పురుష అథ్లెట్‌గా నిలిచాడు. ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో అతను 10.25 సెకన్ల సమయంతో అగ్ర బహుమతిని గెలుచుకుని, గత సంవత్సరం తన టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు, కానీ గత సంవత్సరం నెలకొల్పిన తన సొంత మీట్ రికార్డు అయిన 10.19 సెకన్లను మెరుగుపరచడంలో విఫలమయ్యాడు. ఉదయం సెషన్‌లో అంతకుముందు, SSCB రేస్ వాకర్ సెర్విన్ సెబాస్టియన్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. పురుషుల 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో సెబాస్టియన్ మొదటి స్థానంలో ముగింపు రేఖను దాటినప్పటికీ, సాంకేతిక నియమాల ఉల్లంఘన కారణంగా విధించిన రెండు నిమిషాల పెనాల్టీ, స్వర్ణం గెలవాలన్న అతని ఆశలను నీరుగార్చింది. అతను చివరకు 1:32:46.00 సమయంతో నాలుగో స్థానానికి పడిపోయాడు. పురుషుల హాఫ్ మారథాన్ రేస్ వాక్‌లో సూరజ్ పవార్ విజేతగా ప్రకటించబడ్డాడు.



## షాంఘై మాస్టర్స్‌లో రౌండ్ ఆఫ్ 32కు జోడార్

**షాంఘై:** షాంఘై మాస్టర్స్‌లో శనివారం జరిగిన తమ రెండో రౌండ్ పోరులో రఫేల్ జోడార్ తోపాటు, ఫెలిక్స్ ఆగర్ అలియాసిమ్‌లు వెనుకబడిన స్థితి నుంచి పుంజుకుని విజయాలు నమోదు చేసి రౌండ్ ఆఫ్ 32కు చేరుకున్నారు. 12వ సీడ్ జోడార్, థియాగో అగస్టిన్ టిరాంటెను 4-6, 6-2, 6-3 తేడాతో ఓడించి, తన తొలి మ్యాచ్‌లోనే తదుపరి రౌండ్ లోకి ప్రవేశించాడు. మొదటి సెట్‌ను కోల్పోయిన తర్వాత, ఆ స్పానిష్ ఆటగాడు రెండవ సెట్‌లో తన మొదటి సర్వ్ పాయింట్లలో 93 శాతం గెలుచుకున్నాడు. అతను మ్యాచ్ సమయంలో ఎదుర్కొన్న 10 బ్రేక్ పాయింట్లలో తొమ్మిదింటిని కాపాడుకోవడమే కాకుండా, తన ప్రత్యర్థి సర్వ్‌ను మూడుసార్లు బ్రేక్ చేసి ఘన విజయాన్ని అందుకున్నాడు. మరోవైపు, ఆగర్‌అలియాసిమ్, కామిలో ఉగో కారబెల్లి నుండి గట్టి పోటీని ఎదుర్కొని, రెండు గంటల 58 నిమిషాల పాటు సుదీర్ఘంగా సాగిన పోరులో 4-6, 7-6(1), 7-5 తేడాతో విజయం సాధించాడు. జోడార్ ఈ సీజన్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. జనవరిలో ర్యాంకింగ్స్‌లో టాప్100 నుండి13వ స్థానానికి ఎగబాకి, టాప్ 10లోకి ప్రవేశించాలని చూస్తున్నాడు.

## చైనా ఓపెన్‌లో స్వియాటెక్ ఓటమి

### సెమీఫైనల్‌లోకి ఎలిస్



**బీజింగ్:** చైనా ఓపెన్ 2026 క్వార్టర్ ఫైనల్‌లో బెల్జియంకు చెందిన ఎలిస్ మెర్టెన్స్, పోలాండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్‌ను 7-6 (0), 6-3 తేడాతో ఓడించి సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 19వ స్థానంలో ఉన్న ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ విజేతను ఓడించడానికి ఒక గంట 50 నిమిషాలు తీసుకుని, తన కెరీర్‌లో మూడవ డబ్ల్యూటిఎ 1000 సెమీఫైనల్‌కు మరియు 2021 తర్వాత మొదటిసారిగా చేరుకుంది. ఈ టోర్నమెంట్‌లో మెర్టెన్స్ ఓడించిన మూడవ గ్రాండ్ స్లామ్ విజేత స్వియాటెక్. అంతకుముందు ఆమె జెలెనా ఒస్టాపెంకో మరియు కోకో గాఫ్‌లను ఓడించింది. అలాగే ఉక్రెయిన్‌కు చెందిన ఎలినా స్విటోలినాను 6-3, 7-6 (6) తేడాతో ఓడించిన మెర్టెన్స్, ఫైనల్‌లో స్థానం కోసం ఇప్పుడు స్వదేశీ క్రీడాకారిణి జెంగ్ క్విన్వెన్‌తో తలపడనుంది.

## రూపాయి క్షీణత కట్టడికి ఆర్బీఐ కఠిన కార్యాచరణ




**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** దేశంలో డాలర్లకు అతి పెద్ద డిమాండ్ సృష్టించేది చమురు దిగుమతులే. ఈ డిమాండ్‌ను సాధారణ ఫారెక్స్ మార్కెట్ నుంచి వేరు చేసేందుకు ఆర్‌బీఐ ఒక ప్రత్యేక విండోను అందుబాటులోకి తెచ్చింది. దేశీయ ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ దిగ్గజాలైన ఇండియన్ ఆయిల్, హిందుస్తాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియమ్‌లకు రోజువారీ అవసరమైన డాలర్లను ఆర్‌బిఐ తన విదేశీ మారక నిల్వల నుంచి నేరుగా అందజేస్తుంది. సోమవారం నుంచి అందుబాటులోకి రానున్న ఈ నిర్ణయం వల్ల సాధారణ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్లకు ఉండే భారీ డిమాండ్ ఒక్కసారిగా తగ్గి, రూపాయి క్షీణతకు తక్షణమే అడ్డుకట్ట పడుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. కరెన్సీ మార్కెట్‌లో జరిపే ఊహాజనిత ట్రేడింగ్ రూపాయి విలువను మరింత దిగజార్చకుండాఉండేందుకు ఆర్‌బిఐ నిబంధనలను అత్యంత కఠినతరం చేసింది. రూపాయితో కూడిన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కరెన్సీ డెరివేటివ్స్ పొజిషన్ల పరిమితిని ఏకంగా 100 మిలియన్ డాలర్ల నుంచి కేవలం 5 మిలియన్ డాలర్లకు కుదించింది. ఫారెక్స్ డీలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ విదేశీ మారక ద్రవ్య డెరివేటివ్స్‌ను తిరిగి రీబుక్ చేయడానికి అనుమతించకూడదని స్పష్టం చేసింది. రూపాయితో జరిగే ప్రతి డెరివేటివ్ కాంట్రాక్ట్‌కు సంబంధించి ఆ లావాదేవీ మొత్తం విలువలో 20 శాతానికి సమానమైన మొత్తాన్ని 'ఫారెక్స్ రిస్క్ రిజర్వ్' రూపంలో నిర్వహించాలని ఆర్‌బిఐ ఫారెక్స్ డీలర్లను ఆదేశించింది. గతంలో కూడా ఆర్‌బిఐ పలుమార్లు డాలర్లను విక్రయించడం, వడ్డీ రేట్లను పెంచడం వంటి చర్యలు చేపట్టినప్పటికీ రూపాయిపై ఒత్తిడి కొనసాగుతూనే వచ్చింది. అయితే తాజా చర్యల సంకేతాలతో శనివారం నాన్‌డెలివరబుల్ ఫార్వర్డ్ మార్కెట్‌లో వన్‌మంత్ డాలర్/రూపాయి కాంట్రాక్ట్ దాదాపు 40 పైసలు తగ్గి, రూపాయి కోలుకునే సంకేతాలను చూపించింది. చమురు సంస్థలకు నేరుగా డాలర్లను అందించడం వల్ల ఆర్‌బిఐ వద్ద ఉన్న విదేశీ మారక నిల్వలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ, రూపాయి రికార్డు పతనాన్ని అడ్డుకోవడానికి ఆర్‌బిఐ వేసిన ఈ వ్యూహాత్మక అడుగు దేశీయ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమైనదిగా మారనుంది.

## భారత్ ఫారెక్స్ నిల్వలు 12.95 బిలియన్ డాలర్లు డౌన్




**ముంబయి, అక్టోబరు 10:** భారత్ విదేశీ మారక నిల్వలు ఈనెల 2తో ముగిసిన వారంలో 734.60 బిలియన్ డాలర్లకు తగ్గాయి. దేశ విదేశీ మారక నిల్వలు ముగిసిన వారంలో 12.95 బిలియన్ డాలర్లు తగ్గి 734.60 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ కరెన్సీ ఆస్తులు, బంగారం నిల్వలు తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు సెప్టెంబర్ 25తో ముగిసిన వారంలో నిల్వలు 18.34 బిలియన్ డాలర్లు తగ్గి 747.56 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రవాస భారతీయుల డిపాజిట్ల కోసం బ్యాంకులు ప్రత్యేక రాయితీ స్వాప్ పథకం ద్వారా రికార్డు స్థాయిలో దాదాపు 133 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించడంతో, సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైమ్ గరిష్ఠమైన 785.70 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

ఈనెల 2తో ముగిసిన వారంలో నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 10.66 బిలియన్ డాలర్లు తగ్గి 604.74 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. డాలర్లలో లెక్కించే విదేశీ కరెన్సీ ఆస్తుల విలువపై, ఫారెక్స్ నిల్వల్లో ఉన్న యూరో, పౌండ్, యెన్ వంటి డాలర్ కాని కరెన్సీల విలువ పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ఉంటుంది. ఇదే సమయంలో బంగారం నిల్వల విలువ 2.28 బిలియన్ డాలర్లు తగ్గి 106.413 బిలియన్ డాలర్లకు చేరింది.

# ఈక్విటీ మార్కెట్లలో ఐపిఒల హవా

## డజను కంపెనీలు రూ.50వేల కోట్ల సమీకరణకు సిద్ధం




**ముంబయి, అక్టోబరు 10:** దేశీయ ఈక్విటీ మార్కెట్లలో అస్థిరత కొనసాగుతున్నప్పటికీ, ప్రైమరీ మార్కెట్ మాత్రం రికార్డు స్థాయి నిధుల సమీ కరణతో రికార్డులు సృష్టిస్తోంది. జూలై సెప్టెంబర్ త్రైమాసికంలో ఏకంగా 70 మెయిన్‌బోర్డ్ ఐపీఓలు పెట్టుబడిదారుల నుండి రూ. 90,500 కోట్లకు పైగా సమీకరించగా, అదే జోరు రాబోయే దీపా వళి పండుగ నాటికి దాదాపు డజనుకు పైగా అగ్రగామి కంపెనీలు తమ ఐపీఓల ద్వారా ప్రాథమిక మార్కెట్ నుండి రూ. 50,000 కోట్ల భారీ నిధులను సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి.

ఈ భారీ ఐపిఒల్లో టెలికామ్ రంగానికి చెందిన జియో ప్లాట్‌ఫామ్స్ మెగా ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 31,000 నుండి రూ. 32,000 కోట్ల నిధులను సమీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తే అవదా ఎలక్ట్రో కార్ల్స్‌బర్గ్ ఇండియా రూ. 6,500 కోట్ల ఇష్యూతో అక్టోబర్ నాటికి మార్కెట్‌లోకి రానుంది) ఈ నెల ద్వితీయార్థంలో రూ. 7,600 కోట్ల ఐపిఒతో ముందుకు రానుంది. హెచ్‌డి ఫైర్ సిస్టమ్స్ మరియు ఫ్యూజన్ సిస్టమ్ వరుసగా ప్రారంభమై ఉమ్మడిగా రూ. 1,414 కోట్లు సేకరించనున్నాయి.

సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ మరియు జెట్‌వర్క్ మ్యానుఫ్యాక్చరింగ్ బిజినెస్‌లు సంయుక్తంగా రూ. 5,500 కోట్లు, బోన్‌ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్ రూ. 2,500 కోట్లు, పారస్ హెల్త్‌కేర్ రూ. 1,800 కోట్లు, టొరెంట్ గ్యాస్ రూ. 4,000 కోట్లు, గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్స్ రూ. 250 కోట్లు మరియు ఎన్‌డిఆర్ ఇన్విట్ ట్రస్ట్ రూ. 750 కోట్లను దారితీయనున్నాయి. టోన్ట్సో ఇమేజింగ్ 1.81 కోట్ల ఈక్విటీ షేర్ల ఓఎఫ్ఎస్, ఎస్ఎఫ్‌సి ఎన్విరాన్‌మెంటల్ మరియు బాంబే కోటెడ్ స్టీల్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ జోరుపై జెరోధా సిఇఒ నితిన్ కామత్ స్పందిస్తూ, ప్రస్తుతం మార్కెట్‌లో ఐపిఒలు మాత్రమే నిజమైన పండుగ వాతావరణాన్ని నింపుతున్నాయని, దాదాపు 67.2 శాతం మెయిన్‌బోర్డ్ ఐపిఒలు ఇష్యూ ధర కంటే పైనే ట్రేడ్ అవుతున్నాయని విశ్లేషించారు.

ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో 78 కంపెనీలు రూ. 94,200 కోట్లను సమీకరించడం ప్రాథమిక మార్కెట్‌బలాన్ని చాటుతోంది. రాబోయే 12 నుండి 24 నెలల్లో నాణ్యమైన స్మాల్‌క్యాప్, బిఎఫ్ఎస్ఐ, ఐటీ మరియు టెలికాలంలో విపరీతమైన పెట్టుబడి అవకాశాలు లభిస్తాయని మోనార్క్ ఏఐఎఫ్ అభిప్రాయపడింది.

## డీమార్ట్ నికరలాభం రూ.804 కోట్లు

**ముంబయి, అక్టోబరు 10:** ప్రముఖ రిటైల్ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ రెండో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ నికర లాభం గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 7.6 శాతం పెరిగి రూ.804 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో రూ.747 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్‌నిపుణులు అంచనా వేసిన రూ.879 కోట్ల లాభంతో పోలిస్తే తాజా ఫలితం తక్కువగా నమోదైంది.18.4 శాతం పెరిగిన ఆదాయం సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 18.4 శాతం వృద్ధితో రూ.19,206 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఈ ఆదాయం రూ.16,219 కోట్లుగా ఉంది.రూ.1,403 కోట్లకు ఇబిఐటిడిఏ కంపెనీ నిర్వహణ పనితీరును ప్రతిబింబించే వడ్డీలు, పన్నులు, తరుగుదల, రుణ విమోచనలకు ముందు ఆదాయం 14.1 శాతం పెరిగి రూ.1,403 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.1,230 కోట్లుగా నమోదైంది. అయితే అంచనాలు రూ.1,468 కోట్లను అందుకోలేకపోయింది.ఇబిఐటిడిఏ మార్జిన్ ఏడాది క్రితం 7.6 శాతంగా ఉండగా, తాజా త్రైమాసికంలో 7.3 శాతానికి తగ్గింది. ఈ మూడు నెలల్లో కంపెనీ కొత్తగా 15 స్టోర్లను ప్రారంభించింది. రెండో త్రైమాసికంలో ఒక్కో షేరుపై ఆదాయం ఇపిఎస్‌పై రూ.12.32గా నమోదైంది. గత యేడాది ఇదే త్రైమాసికానికి సంబంధించిన ఇపిఎస్ రూ.1.47గా ఉంది. పాత స్టోర్ల అమ్మకాల వృద్ధి 9.5 శాతంరెండో త్రైమాసిక ఫలితాలపై అవెన్యూ సూపర్‌మార్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ అన్షుల్ అసావా మాట్లాడుతూ రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న డీమార్ట్ స్టోర్ల అమ్మకాలు 2026-27 రెండో త్రైమాసికంలో 9.5 శాతం పెరిగాయని తెలిపారు.

## భారత్ యుపిఐ టెక్నాలజీకోసం జింబాబ్వే సంప్రదింపులు

UNIFIED PAYMENTS INTERFACE

**న్యూఢిల్లీ, అక్టోబరు 10:** భారత్ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సాంకేతికత అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతోంది. ఆఫ్రికా దేశమైన జింబాబ్వే తమ దేశ చెల్లింపుల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు యుపిఐ సాంకేతికతను వినియోగించుకోవడంపై భారత్‌తో చర్చలు జరుపుతోంది. ఈ మేరకు ఎన్‌పిసిఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ (ఎన్ఐపిఎల్)తో జింబాబ్వే సంప్రదింపులు జరుపుతున్నట్లు ఒక నివేదిక వెల్లడించింది. జింబాబ్వేలోని బ్యాంకులు, మొబైల్ మనీ ఆపరేటర్లు, ఫిన్‌టెక్ సంస్థలు ఒకే వేదికపైకి వచ్చి రియల్ టైమ్ చెల్లింపులు జరిపేందుకు వీలు కలుగుతుంది. దీనివల్ల లావాదేవీల వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, నగదు బదిలీల వేగం కూడా పెరుగుతుందని జింబాబ్వే రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ జాన్ ముషయవాన్హ ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న మొత్తాల దేశీయ లావాదేవీలకు డెబిట్, క్రెడిట్ కార్డులకు ప్రత్యామ్నాయంగా ఇది నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్ఐపిఎల్‌తో సాగుతున్న ఈ చర్చలు ఈ యేడాది అక్టోబర్ 31 నాటికి ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఎఫ్ఎంసిజి రంగంలో ఇ-కామర్స్, క్విక్ కామర్స్‌కు పెరుగుతున్న ఆదరణ



**ముంబయి, అక్టోబరు 10:** దేశంలోని ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీలు ప్రత్యామ్నాయ విక్రయ మార్గాల్లో బలమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయి. క్విక్ కామర్స్, ఇ-కామర్స్, ఆధునిక రిటైల్ స్టోర్ల ద్వారా అమ్మకాలు పెరుగుతున్నాయి. కొన్ని త్రైమాసికాలుగా, ముఖ్యంగా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల మద్దతుతో మొత్తం ఇ-కామర్స్ విభాగంలో అమ్మకాల వృద్ధి వేగవంతమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి సంబంధించిన వ్యాపార అప్‌డేట్‌లో, మోడ్రన్ ట్రేడ్, క్విక్ కామర్స్, ఇ-కామర్స్‌లతో కూడిన ప్రత్యామ్నాయ విక్రయ మార్గాల్లో రెండంకెల వృద్ధి నమోదైనట్లు ఏడబ్ల్యూఎల్ అగ్రిబిజినెస్ వెల్లడించింది.ఆహార ఉత్పత్తులు, ఎఫ్ఎంసిజి విభాగాల్లో కీలక ఉత్పత్తులకు ఈకామర్స్, క్విక్ కామర్స్ ద్వారా ఆదరణ పెరిగిందని కంపెనీ తెలిపింది. ఈ రెండు మార్గాల్లో కలిపి గత యేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 40 శాతం వృద్ధి సాధించినట్లు పేర్కొంది.వివిధ ఉత్పత్తుల విభాగాల్లో కంపెనీ సాధించిన మార్కెట్ వాటా వివరాలను కూడా వెల్లడించింది. ఆట్టా విభాగంలో 10 శాతానికి పైగా, బేసన్‌లో 25 శాతానికి పైగా, సోయా నగెట్స్‌లో 40 శాతానికి పైగా మార్కెట్ వాటా ఉందని తెలిపింది. చక్కెర, సూజీ (రవ్వ), పోహా (అటుకులు) విభాగాల్లో సుమారు 15-20 శాతం మార్కెట్ వాటా ఉన్నట్లు పేర్కొంది.త్రైమాసికంలో ఉత్పత్తుల లభ్యత, ఆర్డర్లను పూర్తిస్థాయిలో సరఫరా చేసే సామర్థ్యం, వినియోగదారులను నిలుపుకునే స్థాయి మెరుగుపడ్డాయని కంపెనీ తెలిపింది. మెరుగైన ఉత్పత్తుల ఎంపిక, సరఫరా అందుబాటు ఇందుకు తోడ్పడ్డాయని వివరించింది. బిఎస్ఇకి సమర్పించిన ప్రకటనలో, ఈకామర్స్, క్విక్ కామర్స్‌తో కూడిన అభివృద్ధి చెందుతున్న విక్రయ మార్గాల్లో ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బలమైన వృద్ధి కొనసాగుతుందని డాబర్ ఇండియా అంచనా వేసింది. ఈ విభాగాల్లో నిరంతర పెట్టుబడులు, అన్ని విక్రయ మార్గాలను సమన్వయం చేసే ఓమ్నిచానల్ పంపిణీ విధానంపై దృష్టి సారించడం వృద్ధికి దోహదం చేస్తాయని కంపెనీ పేర్కొంది. మోడ్రన్ ట్రేడ్ విభాగంలో రెండంకెల వృద్ధి కొనసాగుతోందని డాబర్ తెలిపింది. సాధారణ రిటైల్ మార్కెట్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ అమ్మకాలు పెరుగుతున్నాయని వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.